www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 27-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 313 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి ఉ. 8.55, అమావాస్య తె. 6.14 వరకు; నక్షత్రం: ధనిష్ఠ మ. 3.44 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.10.18-11.46; దుర్ముహూర్తం: ఉ.10.31-11.17, మ.3.11-3.57; అమృతఘడియలు: ఉ.6.08-7.32; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 6.17 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధుల విడుదల

ఎన్నికల కోడ్ లేని ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జమ

రూ.6 వేల చొప్పున 66,640 మందికి రూ.39.98 కోట్ల భరోసా

13

తమిళంలో మాట్లాడలేకపోతున్నా.. క్షమించండి

2

ప్రపంచంలో అతి ప్రాచీన భాష తమిళం

దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు తగ్గవు

ప్రజల దృష్టి మరల్చడానికే డీఎంకే ఆరోపణలు

పునర్విభజనలో తమిళనాడు ఒక్క సీటు కూడా కోల్పోదు: కేంద్ర హోం మంత్రి అమిత్ షా



పోసాని అరెస్ట్

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ పోలీసులు

జనసేన నేత ఫిర్యాదుపై పోసాని మీద కేసు

ఏపీ వ్యాప్తంగా ఇప్పటికే పదికిపైగా కేసులు

వైసీపీ అధికారంలో ఉండగా నోటిదురుసు

అప్పట్లో ఫిర్యాదులపై స్పందించని పోలీసులు

అరెస్టు వేళ పోలీసులతో పోసాని వాగ్వాదం

నోటీసులు ఇచ్చి అరెస్టు చేసిన పోలీసులు

నేడు రాజంపేట కోర్టులో పోసాని హాజరు!

అమరావతి/హైదరాబాద్/రాయచోటి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా... టీడీపీ, జనసేన అగ్రనేతలపై పిచ్చిపిచ్చిగా రెచ్చిపోయి, అడ్డూ అదుపూ లేకుండా నోరు పారేసుకున్న సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని మైహోం భూజా అపార్ట్‌మెంట్‌లో ఉన్న పోసాని కృష్ణ మురళి నివాసానికి వెళ్లి... నోటీసులు అందించి, అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో నలుగురు పోలీసులు హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీసులను కలిసి... పోసాని కృష్ణ మురళిపై నమోదైన కేసు వివరాలను అందించారు. ఆయన అరెస్టుకు ఎస్కార్ట్ కల్పించాలని కోరారు. దీంతో... రాయదుర్గం ఠాణా నుంచి ఒక ఎస్ఐ, ఒక కానిస్టేబుల్ ఏపీ పోలీసులకు తోడుగా

మిగతా 12వ పేజీలో...

మిస్టరీగా మరణాలు!

రాజలింగమూర్తి, సంజీవరెడ్డి, కేదార్‌ల మరణం అనుమానాస్పదం

ఫిర్యాదు వస్తే దర్యాప్తు చేస్తాం.. నిజాలు వెలికితీస్తాం

ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి గత కేసీఆర్ సర్కారుదే బాధ్యత

పదేళ్ల నిర్లక్ష్యం వల్లే టన్నెల్ మట్టి కుంగి ప్రమాదం జరిగింది

ఫిరాయింపులపై పదేళ్ల రాజ్యాంగంలో మార్పులేమీ రాలేదు

తెలంగాణలో ఉప ఎన్నికలు.. కేటీఆర్ అవగాహన రాహిత్యమే

విదేశాలకు పారిపోయిన వారిని రప్పించాల్సింది కేంద్రమే

సీబీఐ విచారణ కోరితే బీఆర్ఎస్‌ను బీజేపీ కలిపేసుకుంటుంది

నా దృష్టి పనిపైనే.. లబ్ధిదారులే కాంగ్రెస్‌ను గెలిపిస్తారు

బీఆర్ఎస్ కథ ముగిసింది.. భవిష్యత్తులో బీజేపీతోనే మా పోటీ

ఆదాయాన్ని నెలకు 22 వేల కోట్లకు పెంచితేనే సరిపోతుంది

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

తెలంగాణలో గత పదేళ్లలో జరిగిన అవినీతిపై విచారణను సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చెప్పడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. సీబీఐకి అప్పగిస్తే.. ఆ పేరుతో బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసుకోవాలన్నది వారి ఆలోచన.

\- సీఎం రేవంత్‌రెడ్డి


ఢిల్లీలో ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల మరణించిన తీరు అనుమానాస్పదంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పోరాడిన రాజలింగమూర్తి, ఆయన తరఫున న్యాయస్థానంలో వాదనలు వినిపించిన న్యాయవాది సంజీవరెడ్డితోపాటు డ్రగ్స్ కేసు నిందితుడు కేదార్‌ల మరణాలు మిస్టరీగా ఉన్నాయని పేర్కొన్నారు. కేదార్ ఏడాది క్రితం హైదరాబాద్‌లో ఒక డ్రగ్స్ పార్టీలో దొరికాడని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసు దర్యాప్తును వేగవంతం చేయగానే దుబాయ్‌లో కేదార్ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు కేదార్ పార్ట్‌నర్ అని సీఎం ఆరోపించారు. ప్రతి విషయంలోనూ సమగ్ర దర్యాప్తు చేయాలని కోరే కేటీఆర్.. కేదార్ మృతిపై విచారణ ఎందుకు

మిగతా 13వ పేజీలో...

ఐదు కీలక ప్రాజెక్టులకు నిధులివ్వండి

మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతివ్వండి.. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి

దానికి సమాంతర రైల్వే లైన్ అవసరం.. మూసీ ప్రాజెక్టు, డ్రైపోర్టుకు సహకరించాలి

సెమీకండక్టర్ మిషన్‌ను ఏర్పాటు చేయాలి.. ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తులు

వీటిని సాధిస్తే కిషన్ రెడ్డికి పౌరసన్మానం చేసి గండపెండేరం తొడుగుతానన్న రేవంత్

13 ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై ప్రధానికి వివరించానన్న ముఖ్యమంత్రి



మన సంగతేంటి భయ్యా?

నిర్మాత కేదార్ ఆకస్మిక మరణంతో అగ్ర హీరోల్లో ఉలికిపాటు

దుబాయ్‌లో నిర్మాణ, స్థిరాస్తి రంగాల్లో కేదార్ వ్యాపారాలు

వాటిలో వందల కోట్లు పెట్టిన హీరోలు, నిర్మాతలు, దర్శకులు

పెట్టుబడుల వివరాలు తెలియక వారిలో ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ సినీ నిర్మాత సెలగంశెట్టి కేదార్ ఆకస్మిక మరణం తెలుగు సినిమా రంగానికి చెందిన ప్రముఖులు ముఖ్యంగా కొందరు అగ్రహీరోల గుండెల్లో గుబులు రేపుతోంది. తెలుగు సినీ రంగానికి చెందిన కొందరు అగ్రహీరోలు, నిర్మాతలు, దర్శకులకు బినామీగా వ్యవహరిస్తూ.. వారికి చెందిన వందల కోట్ల రూపాయలతో కేదార్ దుబాయ్‌లో వ్యాపారాలు చేయడమే ఇందుకు కారణమని సమాచారం. కోట్లల్లో పెట్టుబడులు పెట్టిన ఆయా ప్రముఖులు.. కేదార్ ఆకస్మిక మరణంతో ఇప్పుడు తమ

మిగతా 10వ పేజీలో...

కేదార్‌ది అనుమానాస్పద మృతేనా?

ఇంకా దొరకని దుబాయ్ పోలీసుల క్లియరెన్స్

దుబాయ్‌లో లేను.. ఇంట్లోనే ఉన్నా

తనపై అసత్య ప్రచారం జరుగుతోందన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి 10



ప్రజలందరికీ పింఛను!

2

'కొత్త పెన్షన్ స్కీమ్'పై కేంద్రం కసరత్తు

60 ఏళ్లు దాటిన వారందరికీ వర్తింపు!

ఈపీఎఫ్‌వో ఆధ్వర్యంలో నిబంధనల రూపకల్పన.. త్వరలో అభిప్రాయ సేకరణ

అమ్మకానికి అమెరికా పౌరసత్వం!



రూ.43.5 కోట్లకు 'గోల్డ్ కార్డు'

డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

ఉద్యోగకల్పనతో లింకు లేకుండా గ్రీన్‌కార్డ్

కాంగ్రెస్ అనుమతి అక్కర్లేదన్న వైట్‌హౌస్

ప్రస్తుతం ఉన్న 'ఈబీ-5' స్థానంలో కొత్తది

రూ.8.7 కోట్ల పెట్టుబడి, 10 ఉద్యోగాల కల్పనతో ఈబీ-5

కోటి గోల్డ్‌కార్డులతో రూ.43.5 కోట్ల కోట్లు ఆదాయమే లక్ష్యం

ఉద్యోగాల ఊచకోతకు ట్రంప్ మెమో

భారీగా సిబ్బంది తొలగింపునకు చర్యలు

మార్చి 13కి ప్రణాళికలు సమర్పించండి

వైట్‌హౌస్ నుంచి అన్ని ఫెడరల్ ఏజెన్సీలకూ అందిన మెమో

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: సంపన్న వలసదారులకు అగ్రరాజ్యం అమెరికా పెద్దపీట వేయనుంది. రూ.43.5 కోట్లు (5 మిలియన్ డాలర్లు) చెల్లించేవారికి శాశ్వత పౌరసత్వం కల్పించనుంది. ఈ మేరకు 'గోల్డ్‌కార్డు' వీసాను ప్రవేశపెట్టనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం సంచలన ప్రకటన చేశారు. 35 ఏళ్ల నాటి పెట్టుబడిదారుల వీసా(ఈబీ-5) స్థానంలో గోల్డ్‌కార్డు వీసాను తీసుకురానున్నారు. దేశంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 1990లో ఈబీ-5 వీసాలను అమెరికా కాంగ్రెస్ తీసుకొచ్చింది. అమెరికాలో కనీసం రూ.8.7 కోట్లు(ఒక మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టడం

మిగతా 2వ పేజీలో...

2

మీ పాపాల్లో పాలుపంచుకోం!

ఉద్యోగుల తొలగింపులో భాగస్వాములం కాలేమంటూ 21 మంది డోజ్ సిబ్బంది రాజీనామా

మస్క్‌కు షాక్

కూలిన టెస్లా షేర్లు

మస్క్ సంపద రూ.1.93 లక్షల కోట్ల మేర ఆవిరి

ఆశలు ఆవిరి?

సొరంగంలో చిక్కుకున్న 8 మంది ప్రాణాలతో తీసుకురావడం కష్టమే!

సహాయ చర్యల బృందం సభ్యులు, ర్యాట్ హోల్ మైనర్స్ చెబుతున్నదిదే

టీబీఎం కటింగ్‌కు కంపెనీ ఒప్పుకోక ఇన్ని రోజులు వెలికితీతలో ఆలస్యం?

మంత్రులతో ఆ కంపెనీ అధినేత భేటీ

కటింగ్‌కు నిర్ణయం.. గ్యాస్ కట్టర్లు సిద్ధం.. నేడు రానున్న ప్లాస్మా కట్టర్

సహాయక చర్యలు రేపటితో పూర్తి

దేశంలోని టన్నెల్ నిష్ణాతులందర్నీ రప్పించి చర్యలు చేపట్టాం

అత్యున్నత టెక్నాలజీ వినియోగం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ సహాయక చర్యలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న 8 మంది జాడ ఇప్పటికీ తెలియలేదు. శనివారం ఉదయం 8.30 గంటలకు ఈ ప్రమాదం జరగ్గా దాదాపు ఐదు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నా.. వారు ఏ ప్రాంతంలో చిక్కుకున్నారనే విషయంలో ఎలాంటి స్పష్టత రాలేదు. పుష్ కెమెరాలు, ప్రోబోస్కోప్‌లు వినియోగించడంతో పాటు సోనార్ ద్వారా సంకేతాలు కనుక్కోవాలని ప్రయత్నించినా ఇప్పటివరకు వారి ఆచూకీ తెలియలేదు. దీంతో వారిని రక్షించి బయటకు తీసుకురావడంపై ఆశలు ఆవిరవుతున్నాయని సహాయ చర్యల్లో పాల్గొంటున్న ఎన్‌డీఆర్ఎఫ్, ర్యాట్‌హోల్ మైనర్స్ ఇతర బృందాల సిబ్బంది అంటున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం, సాయంత్రం మూడు సహాయ బృందాలు లోపలికి వెళ్లాయి. ఒక ఆస్పత్రికి చెందిన కొందరు సిబ్బంది కూడా వెళ్లినట్టు

మిగతా 10వ పేజీలో...



నిమ్స్‌కు వైద్యుల టాటా

12

కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరుతున్న పలువురు

ఈ మధ్యే 10 మంది వైద్యులు రాజీనామా

ప్రత్యేక వైద్య సేవలపై తీవ్ర ప్రభావం

వైద్యులకు అందని ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్‌లు

కనీస ప్రోత్సాహం కరువైందన్న ఆవేదన

సంస్థ డైరెక్టర్ తీరు కూడా ఓ కారణమా?

ఏపీ నీటి తరలింపును అడ్డుకోండి

3

శ్రీశైలం నుంచి చుక్క నీరూ ఇవ్వొద్దు

సాగర్ కుడి కాల్వకు నీటిని 7 వేల నుంచి 5 వేల క్యూసెక్కులకు తగ్గించండి

కృష్ణా బోర్డు ఎదుట తెలంగాణ వాదన

అత్యవసర భేటీకి మరోసారి ఏపీ డుమ్మా

తెలంగాణకు 63, ఏపీకి 55 టీఎంసీలు

రబీ సాగు ప్రణాళిక సిద్ధం చేసిన సీఈలు

నీటి కేటాయింపులపై నేడు బోర్డు నిర్ణయం



బయో ఏషియా సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల తదితరులు

20 రోజుల్లోగా లైఫ్ సైన్సెస్ పాలసీ

అన్ని వర్సిటీల్లో లైఫ్‌సైన్సెస్ కొత్త కోర్సులు

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో లైఫ్‌సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

ముగిసిన బయో ఏషియా-2025 సదస్సు

44 దేశాల నుంచి 4 వేల మంది ప్రతినిధుల హాజరు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బయో ఏషియా-2025 సదస్సుకు ప్రభుత్వం ఊహించిన దాని కంటే అధిక స్పందన వచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బయో ఏషియా చరిత్రలో ఈ ఏడాది సదస్సు ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 44 దేశాల నుంచి 4 వేల మంది ఫార్మా, హెల్త్‌కేర్ పరిశ్రమ లీడర్లు, విధానకర్తలు, ఆవిష్కర్తలు

మిగతా 12వ పేజీలో...

శంభో శివ శంభో!

14

రాష్ట్రంలో శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

వైభవంగా రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు

వేయిస్తంభాల గుడికి మూడు లక్షల మంది భక్తులు

వేములవాడ, కీసర, ఏడుపాయలకు పోటెత్తిన భక్తజనం

నదీ స్నానాలకు వెళ్లి రాష్ట్రంలో ఒకరి మృతి.. ఇద్దరి గల్లంతు.. ఆంధ్రప్రదేశ్‌లో 9 మంది మృతి


శివరాత్రి సందర్భంగా బుధవారం మహాకుంభమేళాలో భక్తుల పుణ్యస్నానాలు

ముగిసిన మహా కుంభమేళా

చివరిరోజు శివరాత్రి సందర్భంగా 1.32 కోట్ల మంది పవిత్రస్నానాలు

45 రోజుల్లో 65 కోట్ల మందికి పైగా ప్రయాగ్‌రాజ్‌కు రాక 2



నల్లగొండలో పోలింగ్ సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేడే

రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి..

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల దాకా

ఉపాధ్యాయుల ఓటుకు రేటు!

వెయ్యి నుంచి 3 వేల చొప్పున పంపిణీ!

కరీంనగర్, నల్లగొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు సర్వం సిద్ధమైంది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు, నల్లగొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన పోలింగ్ గురువారం

మిగతా 3వ పేజీలో...

ప్రజలందరికీ పింఛను!

'కొత్త పెన్షన్ స్కీమ్' అమలుకు కేంద్రం సన్నాహాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశంలోని ప్రజలు అందరికీ కొత్త పింఛను పథకం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అసంఘటిత రంగంలోని వారితో సహా పౌరులందరికీ ప్రయోజనం కల్పించే ఉద్దేశంతో సార్వత్రిక పింఛను పథకంపై కేంద్రం కసరత్తు చేస్తోందని కార్మిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అసంఘటిత రంగానికి చెందిన నిర్మాణ రంగ కార్మికులు, గిగ్ వర్కర్లకు సంబంధించి ప్రభుత్వం నిర్వహించే పెద్ద పొదుపు పథకాలేవీ లేవు. ఇప్పటికే అమలులో ఉన్న ఈపీఎఫ్‌వో వంటి పథకాల్లో ఉద్యోగులు, వారు పనిచేసే సంస్థ నుంచే కంట్రిబ్యూషన్లు జమవుతాయి, వీటిలో ప్రభుత్వం నుంచి ఎలాంటి వాటా జమ కాదు. పెట్టుబడిదారుడికి 60ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.1000 నుంచి 1,500 రాబడిని అందించే అటల్ పెన్షన్ యోజన, వీధి వ్యాపారులు, గృహనిర్మాణ కార్మికులకు ప్రయోజనం చేకూర్చే ప్రధానమంత్రి శ్రమ్ యోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం) తో పాటు 60 ఏళ్లు నిండిన రైతులకు నెలకు రూ.3వేలు అందించే ప్రధాన మంత్రి కిసాన్ మన్‌ధన్ యోజన వంటి పథకాలు ప్రస్తుతం అమలులో ఉన్నాయి. వీటికి కొంత మొత్తం



ప్రజలు చెల్లిస్తుండగా, మరికొంత ప్రభుత్వం భరిస్తోంది. భారత్‌లో 2036 నాటికి సీనియర్ సిటిజన్ల జనాభా 22.7 కోట్లకు చేరుతుందని అంచనా. ఇది మొత్తం దేశ జనాభాలో 15శాతం. 2050 నాటికి వీరి సంఖ్య దేశ జనాభాలో 20 శాతానికి అంటే 34.7 కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. అమెరికా, కెనడా, యూరప్, రష్యా, చైనా తదితర దేశాలు ఇప్పటికే పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణ, నిరుద్యోగ ప్రయోజనాలను కవర్ చేసే సామాజిక భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేశాయి. ఇక డెన్మార్క్, నార్వే, స్వీడన్, నెదర్లాండ్స్ న్యూజిలాండ్ వంటి దేశాలు ఇప్పటికే సార్వత్రిక పెన్షన్ పథకాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన దేశంలోనూ సామాజిక భద్రతను విస్తరించే లక్ష్యంతో 60 ఏళ్లు దాటిన వారందిరికీ ఒకే పింఛను పథకం అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న పొదుపు/ పింఛను పథకాలను హేతుబద్ధీకరించి ఈ కొత్త కార్యక్రమాన్ని అమలు చేసే అవకాశం ఉందని కార్మిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఉద్యోగం చేస్తున్న వేతన జీవులతో పాటు స్వయం ఉపాధి పొందుతున్న వారికి కూడా కొత్త విధానం వర్తించేందుకు వీలుగా ఈపీఎఫ్‌వో ఆధ్వర్యంలో విధివిధానాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతానికి 'న్యూ పెన్షన్ స్కీం' అని పిలిచే ఈ కొత్త పథకం ఇప్పటికే అమలులో ఉన్న ఎన్‌పీఎస్ స్థానాన్ని భర్తీ గానీ, విలీనం గానీ చేయబోదని ఆ వర్గాలు వివరించాయి.

మస్క్ సంపదలో 1.93 లక్షల కోట్లు ఆవిరి

న్యూయార్క్: టెస్లా అధిపతి మస్క్ సంపదకు భారీగా గండిపడింది. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. మస్క్ నెట్‌వర్త్ మంగళవారం ఒక్క రోజే 2,220 కోట్ల డాలర్లు (రూ.1.93 లక్షల కోట్లు) క్షీణించి 35,800 కోట్ల డాలర్లకు(రూ.31.14 లక్షల కోట్లు) పడిపోయింది. గత నెల యూరప్ మార్కెట్లో టెస్లా కార్ల విక్రయాలు 45% క్షీణించడమే ఇందుకు కారణం. దీంతో టెస్లా షేరు ధర మంగళవారం ట్రేడింగ్‌లో ఏకంగా 8.39 శాతం క్షీణించి 302.80 డాలర్లకు పడిపోయింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) లక్ష కోట్ల డాలర్ల దిగువకు పడిపోయి.. 94,800 కోట్ల డాలర్లకు (రూ.82.47లక్షల కోట్లు) పరిమితమైంది. ఇక, మస్క్ నెట్‌వర్త్ ఈ ఏడాదిలో 7,450 కోట్ల డాలర్ల (రూ.6.48 లక్షల కోట్లు) మేర తరిగిపోగా.. గత డిసెంబరు 16 నాటికి రికార్డు స్థాయితో పోలిస్తే 10,000 కోట్ల డాలర్ల (రూ.8.70 లక్షల కోట్లు)కు పైగా తగ్గింది.

డోజ్‌కు 21 మంది రాజీనామా

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ట్రంప్, మస్క్ ద్వయం రూపొందించిన డోజ్‌కు సొంత ఉద్యోగుల నుంచే వ్యతిరేకత ఎదురైంది. అత్యంత కీలకమైన ప్రజా సేవల వ్యవస్థ నాశనంలో, ఫెడరల్ ఉద్యోగుల తొలగింపులో తాము భాగం కాలేమంటూ 21 మంది డోజ్ ఉద్యోగులు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. "మీరు గత వారం చేసిన పనేమిటో ఐదు పాయింట్లలో తెలపండి. చెప్పకపోతే మీరు రాజీనామా చేసినట్టే భావిస్తాం" అంటూ మస్క్ ఇటీవలే 20 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులకు ఈమెయిళ్లు పంపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే.. డోజ్ ఉద్యోగులు 21 మంది రాజీనామా చేశారు. ప్రభుత్వ వ్యవస్థల ప్రక్షాళన పేరుతో డోజ్ కోసం మస్క్ తీసుకుంటున్నవారెవరికీ ఎలాంటి నైపుణ్యాలూ లేవని.. వారంతా ఆయన రాజకీయ సిద్ధాంతాలతో ఏకీభవించేవారు మాత్రమేనని వారు విమర్శించారు.

మస్క్ కాళ్లు నాకుతున్న ట్రంప్.. ఏఐ వీడియో వైరల్

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. స్పేస్‌ఎక్స్ అధినేత మస్క్ పాదాలను నాకుతున్నట్టుగా కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన ఫేక్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది! దీన్ని తయారుచేసిన వ్యక్తి ఎవరో తెలియదుగానీ.. రెండు రోజుల క్రితమే అమెరికా హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (హెచ్‌యూడీ) కార్యాలయంలోని అన్ని టీవీల్లో ఈ వీడియో తొలుత ప్రసారమైంది. ఎవరో ఆ టీవీల్ని హ్యాక్ చేసి.. ఆపకుండా లూప్‌లో ఆ వీడియోను ప్రసారం చేశారు. "లాంగ్ లివ్ ద రియల్ కింగ్" అనే నినాదంతో ఆ వీడియో పదే పదే ప్రసారం అవుతుండడంతో కార్యాలయ సిబ్బంది లోపలున్న టీవీలన్నింటినీ కట్టేశారు. కానీ, అది అక్కడితో ఆగక నెట్‌లో కూడా వైరల్ అయ్యింది.



బుధవారం త్రివేణి సంగమంలో సాధువులు

ముగిసిన మహా కుంభ మేళా

- హెలికాప్టర్లతో భక్తులపై 20 క్వింటాళ్ల గులాబీ పూల వర్షం
- మొత్తం 65 కోట్లకు పైగా రాక..చివరి రోజు 1.32 కోట్లు

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 26: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్మాతిక వేడుక మహా కుంభమేళా ముగిసింది.. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమ ప్రదేశం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చివరిరోజైన బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. హర హర మహాదేవా.. శంభో శంకరా అంటూ తెల్లవారు జాము నుంచే పవిత్ర స్నానాలు ఆచరించారు. సాయంత్రం 4 గంటల వరకే 1.32 కోట్ల మంది పుణ్య స్నానాలు చేసినట్లు యూపీ సర్కారు తెలిపింది. కుంభమేళా ప్రారంభమైన జనవరి 13వ తేదీ నుంచి దాదాపు 45 రోజుల్లో 65 కోట్లకు పైగా మంది వేడుకలో పాల్గొన్నట్లు అంచనా వేసింది. కుంభామేళా ముగింపు సందర్భంగా స్నానాలు ఆచరిస్తున్న భక్తులపై హెలికాప్టర్ల ద్వారా పూల వర్షం కురిపించారు. ఇందుకు 20 క్వింటాళ్ల గులాబీ పూలను వాడారు.

వక్ఫ్ బిల్లు సవరణలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: వక్ఫ్ బిల్లు పరిశీలనకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సూచించిన సవరణలకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి, చర్చించేందుకు మార్గం సుగమమైంది. జగదాంబిక పాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జేపీసీ కమిటీ కేంద్ర వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం, వివాదాలకు సంబంధించిన విచారణలను జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగికి అప్పగించడం, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ముస్లిం ఓబీసీ వర్గం నుంచి ఓ వ్యక్తిని నియమించి, ఆయన అధికారాలను విస్తృతం చేయడం వంటి సవరణలను సూచించింది.

సూడాన్‌లో సైనిక విమానం కూలి 46మంది మృతి

కైరో, ఫిబ్రవరి 26: సూడాన్‌లో ఓ సైనిక విమానం కుప్పకూలి 46 మంది మృతి చెందారు. మంగళవారం ఖార్తూమ్ ప్రావిన్స్ ఆమ్‌దూర్‌మన్‌లోని వాడీ సాయిద్నా ఎయిర్ బేస్ నుంచి బయలుదేరిన విమానం కొద్దిసేపటికి జనావాసాల మీద కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలోని 19 మంది సైనికులు సహా మొత్తంగా 46 మంది మృతి చెందారు. మరో 10 మందికిపైగా పౌరులు గాయపడినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. సూడాన్‌పై పట్టు కోసం సైన్యం, పారా మిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) మధ్య అంతర్యుద్ధం ఇటీవల తీవ్ర రూపం దాల్చింది. ఈ నేపథ్యంలో ప్రమాదానికి ఆర్‌ఎస్‌ఎఫ్‌కు సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

'వీసీ' డిజిటల్ అరెస్టు.. రూ.14 లక్షలు వసూలు

బెర్హంపూర్, ఫిబ్రవరి 26: డిజిటల్ అరెస్టు సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి ఒడిశాలోని బెర్హంపూర్ ఉపకులపతి గీతాంజలి దాస్ రూ.14 లక్షలు కోల్పోయారు. ఫిబ్రవరి 12న ఘటన చోటుచేసుకోగా, మోసపోయామని గుర్తించిన సదరు వీసీ 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ప్రకారం.. గీతాంజలికి ఫిబ్రవరి 12న ఈడీ అధికారిని అని చెప్పుకొని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఆమె పేరుతో ఉన్న ఓ బ్యాంకు ఖాతాలో రూ.కోట్లు డిపాజిట్ అయ్యాయని, దానిపై ఈడీ దర్యాప్తు చేస్తోందని, ఆ క్రమంలోనే డిజిటల్ అరెస్టు చేస్తున్నామని సదరు వ్యక్తి నమ్మబలికాడు. గీతాంజలి అకౌంట్‌లో ఉన్న రూ.14 లక్షలను తన ఖాతాలోకి బదిలీ చేయించుకున్నాడు.

రోడ్డు మార్గాల్లో జంతువుల భద్రతపై కేంద్రం నినాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: రోడ్డు మార్గాల్లోని జంతువుల భద్రత గురించి మొదటిసారిగా కేంద్రం ఓ నినాదాన్ని తీసుకువచ్చింది. ప్రజా రవాణా వాహనాలపై 'జంతువుల పట్ల జాలి చూపండి' అనే నినాదాన్ని ఇంగ్లిష్, హిందీ, ప్రాంతీయ భాషల్లో ప్రదర్శించాలని పేర్కొంది. ఈ మేరకు అన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు, రాష్ట్రాలకు మంగళవారం కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇది ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది.

అమ్మకానికి అమెరికా పౌరసత్వం

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా కనీసం 10 మందికి ఉద్యోగాలు కల్పించేవారికి ఈబీ-5 వీసాను ఇస్తున్నారు. అయితే, గోల్డ్‌కార్డు వీసాకు ఉద్యోగాల కల్పన నిబంధనను ట్రంప్ ప్రస్తావించలేదు. రూ.43.5 కోట్లు చెల్లించేవారికి అమెరికా శాశ్వత పౌరసత్వం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. వచ్చే రెండు వారాల్లో ఈబీ-5 వీసా స్థానంలో 'ట్రంప్ గోల్డ్‌కార్డు' రానుందని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ చెప్పారు. గోల్డ్‌కార్డు అంటే గ్రీన్‌కార్డు లేదా శాశ్వత లీగల్ నివాసం అన్నారు. ఈబీ-5 వీసాలో మోసాలు జరుగుతున్నాయని, అందుకే దాని స్థానంలో గోల్డ్‌కార్డును తీసుకొస్తున్నట్టు పేర్కొన్నారు. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వార్షిక వలస గణాంకాల పుస్తకంలోని వివరాల మేరకు 2022 సెప్టెంబరు 30తో ముగిసిన ఏడాది కాలానికి 8 వేల మంది ఈబీ-5 వీసాలు పొందారు. అయితే, ఈబీ-5 వీసాను ఒక చెత్త పథకంగా ట్రంప్ అభివర్ణించారు. పౌరసత్వానికి అర్హతలను కాంగ్రెస్ నిర్ణయిస్తుంది. అయితే, గ్రీన్‌కార్డుకు కాంగ్రెస్ ఆమోదం అవసరం లేదని ట్రంప్ చెప్పారు. ఈబీ-5 వీసాలకు గరిష్ఠ పరిమితి ఉండగా, ద్రవ్యలోటును తగ్గించుకునేందుకు ఫెడరల్ ప్రభుత్వం కోటి గోల్డ్‌కార్డులు విక్రయించుకోవచ్చని ట్రంప్ ప్రకటించారు. కోటి గోల్డ్ కార్డుల ద్వారా రూ.43.5 కోట్ల కోట్లు ఆదాయం రానుంది.

100కుపైగా దేశాల్లో గోల్డెన్ వీసాలు

ప్రపంచవ్యాప్తంగా 100కుపైగా దేశాలు పెట్టుబడిదారుల వీసాలను అందిస్తున్నాయని హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ అనే అడ్వైజరీ సంస్థ తెలిపింది. బ్రిటన్, స్పెయిన్, గ్రీస్, ఆస్ట్రేలియా, కెనడా, ఇటలీ తదితర దేశాలు 'గోల్డెన్ వీసా'లను అందిస్తున్నాయని పేర్కొంది. కాగా, గోల్డ్‌కార్డు వీసాను ఒక అద్భుతంగా ట్రంప్ అభివర్ణించారు. 'ఇది గొప్పది. అద్భుతంగా ఉండనుంది. ఇది గ్రీన్‌కార్డు లాంటిది. ధనవంతులు, గొప్ప టాలెంట్ ఉన్నవారికి పౌరసత్వం కల్పించే ఒక మార్గం. వారు ధనవంతులు. చాలా డబ్బు వెచ్చిస్తున్నారు. చాలా పన్నులు చెల్లిస్తున్నారు. చాలామందికి



ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఇది చాలా విజయవంతమవుతుందని నేను భావిస్తున్నాను' అన్నారు.

కెనడాపై అమెరికా మరింత ఒత్తిడి

అమెరికా దాని ప్రధాన మిత్ర దేశాలతో కలిసి ఏర్పాటు చేసిన ఇంటెలిజెన్స్ కూటమి 'ఫైవ్ ఐస్' నుంచి కెనడాను బయటకు పంపించే దిశగా ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ట్రంప్ సన్నిహితుడు, సలహాదారు పీటర్ నవ్రో ఇందుకు సంబంధించిన ప్రతిపాదన చేసినట్టు ఓ ఆంగ్ల పత్రిక కథనం పేర్కొంది. అమెరికాతో కెనడా విలీనమయ్యేలా ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా ఈ మేరకు ప్రతిపాదన తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. అయితే ఆంగ్ల పత్రిక కథనాన్ని పీటర్ 'నాన్సెన్స్' అంటూ కొట్టిపారేశారు. ఫైవ్ ఐస్ ఇంటెలిజెన్స్ కూటమిలో బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ కూడా ఉన్నాయి. మరోవైపు, రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు తమ మద్దతు ఉంటుందని కెనడా ప్రధాని ట్రూడో పేర్కొన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా కొత్తగా మిలిటరీ సాయాన్ని పంపినట్టు వెల్లడించారు. శాశ్వత శాంతి కోసం పోరాటంలో ఒంటరిగా గెలువలేమన్నారు. పాశ్చాత్య ఆంక్షలను తప్పించుకునేందుకు, అక్రమంగా రష్యా ఆయిల్‌ను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు వాడే రష్యా 'షాడో ఫ్లీట్'పై కొత్త ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటించారు. మరోవైపు, ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజ వనరుల వినియోగంపై ఒప్పందం చేసుకొనేందుకు ఈ శుక్రవారం ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వైట్ హౌస్‌కు రానున్నారని ట్రంప్ బుధవారం వెల్లడించారు.


మస్క్ కెనడా పౌరసత్వం రద్దుకు పిటిషన్

ట్రంప్ సన్నిహితుడు డోజ్ సారథి ఎలాన్ మస్క్ కెనడా పౌరసత్వంతోపాటు పాస్‌పోర్టును రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పార్లమెంటరీ పిటిషన్‌పై కెనడా పౌరులు, నివాసితులు పెద్ద ఎత్తున సంతకాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ పిటిషన్‌పై 2.50 లక్షలకు పైగా మంది సంతకాలు చేసినట్టు తెలుస్తోంది. కెనడా ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా మస్క్ చర్యలు ఉన్నట్టుగా పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ టెక్ బిలియనీర్‌కు దక్షిణాఫ్రికా, కెనడా, అమెరికా పౌరసత్వాలు ఉన్నాయి.

భారతీయులపై కెనడా వీసా నిబంధనల తీవ్ర ప్రభావం

విదేశాల నుంచి వలసల నియంత్రణకు కెనడా చేపట్టిన చర్యలు భారతీయ విద్యార్థులు, ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. విదేశాంగ మంత్రిత్వశాఖ గణాంకాల మేరకు సుమారు 4.27 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడాలో చదువుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 31 నుంచి అమల్లోకి వచ్చిన కెనడా నూతన వలస నిబంధనల ప్రకారం వివిధ కారణాలతో స్టడీ, వర్క్ పర్మిట్లు, ఈటీఏ(ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్)లను ఇమ్మిగ్రేషన్ అధికారులు రద్దు చేయొచ్చు. ఈ నిబంధనల ప్రకారం తప్పుడు సమాచారం ఇచ్చినా, క్రిమినల్ రికార్డు ఉన్నా వీసా రద్దు చేస్తారు. అలాగే, ఆ వ్యక్తి అధికారిక నివాస గడువు ముగిసినా కెనడాను వీడరని ఎవరైనా అధికారి భావిస్తే అలాంటి వ్యక్తి వీసాను రద్దు చేస్తారు. పత్రాలు పోయినా, చోరీ అయినా, పరిపాలనా లోపంతో జారీ అయినా వీసా రద్దు చేస్తారు.

లోకం తీరు



ఉద్యోగాల ఊచకోతకు ట్రంప్ మెమో

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: అవసరానికి మించిన ఉద్యోగులతో ప్రభుత్వం కిక్కిరిసిపోయిందని.. తాను అధ్యక్షుడైతే అలాంటివారందరినీ తొలగించి ప్రభుత్వ పరిమాణాన్ని తగ్గిస్తానని ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పిన ట్రంప్ ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. పది రోజుల క్రితమే వివిధ ప్రభుత్వ విభాగాల్లో దాదాపు 9,500 మందిని (వారిలో అత్యధికులు ప్రొబేషన్‌లో ఉన్న తాత్కాలిక ఉద్యోగులే) తొలగించిన ఆయన.. తాజాగా సివిల్ సర్వీస్ రక్షణ ఉన్న ఫెడరల్ ఉద్యోగులపై గురిపెట్టారు. ఉద్యోగులను తగ్గించాలని.. ఉద్యోగులను తొలగించడమే కాక, ఆయా పొజిషన్లను కూడా తొలగించాలని పేర్కొంటూ వైట్‌హౌస్ 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' డైరెక్టర్ రస్సెల్ వాట్ ఒక మెమో జారీ చేశారు. పెద్ద ఎత్తున ఉద్యోగులను తగ్గించాలని ప్రెసిడెంట్ ట్రంప్ కోరుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు. "ఫెడరల్ ప్రభుత్వం ఖరీదుగా.. అదే సమయంలో అసమర్థంగా మారింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. అమెరికన్ ప్రజలకు కావాల్సిన ఫలితాలను అందించట్లేదు" అని ఆయన ఆ మెమోలో వివరించారు. కాబట్టి, అన్ని ఫెడరల్ విభాగాల అధిపతులూ.. పెద్ద ఎత్తున సిబ్బంది తగ్గింపునకు (రిడక్షన్ ఇన్ ఫోర్స్- రిఫ్) తక్షణ సన్నాహకచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలి దశ ప్రణాళికల వివరాలను మార్చి 13కల్లా.. రెండో దశ ప్రణాళికలను ఏప్రిల్ 15కల్లా తమకు సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇప్పటికే కొన్ని కార్యాలయాలు సిబ్బంది తొలగింపు ప్రక్రియను చేపట్టినట్టు సమాచారం. ఫెడరల్ రియల్ ఎస్టేట్ వ్యవహారాలు చూసే 'జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్' విభాగం ఇప్పటికే తమ సిబ్బందికి.. ఈ విషయాన్ని వెల్లడించింది. ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ మొదలైందని పేర్కొంది.

నేర చరితులపై జీవితకాల నిషేధం..
పార్లమెంట్ పరిధిలోని అంశం

- న్యాయ సమీక్ష పరిధిలో ఉండదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: కోర్టుల్లో శిక్షలు పడి, నేరచరితులుగా ఉన్న చట్ట సభ్యులపై జీవితకాల నిషేధం విధించాలా? వద్దా? అనే అంశం పూర్తిగా పార్లమెంట్ పరిధిలోనిదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ వేసిన పిటిషన్‌పై కేంద్రం ఈ మేరకు సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. ఈ పిటిషన్‌పై ఈనెల 10న విచారణ జరగ్గా.. కేంద్రాన్ని, భారత ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) అఫిడవిట్ సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్లు 8, 9 రాజ్యాంగ చెల్లుబాటుపై స్పందన తెలియజేయాలని సూచించింది. దీనిపై అఫిడవిట్ సమర్పించిన కేంద్రం.. వివిధ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నేతలపై జీవితకాలం నిషేధం విధించాలనే అభ్యర్థనను కేంద్రం వ్యతిరేకించింది. "ఇలాంటి అంశాల్లో నిర్ణయాధికారం పూర్తిగా పార్లమెంట్ పరిధిలో ఉంటుంది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలు కూడా విస్తృత కోణాలను కలిగి ఉన్నాయి. జీవితకాల నిషేధం సరైందా? లేదా? అనే ప్రశ్న కూడా పార్లమెంట్ పరిధిలోకే వస్తుంది. ఈ తరహా అంశాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావు" అని స్పష్టం చేసింది. కాగా.. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 8(1) ప్రకారం.. చట్టసభ సభ్యులు దోషులుగా తేలినప్పటి నుంచి ఆరేళ్లపాటు వారిపై ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం ఉంటుంది.

తమిళంలో మాట్లాడలేకపోతున్నా..
క్షమించండి: అమిత్ షా



చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రం అమలును డీఎంకే నేతలు వ్యతిరేకిస్తున్న వేళ.. తమిళ భాషపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో అతి ప్రాచీన భాష తమిళం అని, అటువంటి భాషలో మాట్లాడలేకపోతున్నందుకు తనను క్షమించాలని తమిళనాడు ప్రజలను కోరారు. మూడు రోజుల పర్యటన కోసం మంగళవారం రాత్రి కోయంబత్తూరుకు వచ్చిన ఆయన.. బుధవారం ఉదయం ఇక్కడ బీజేపీ శాఖ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గే ప్రసక్తి లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తమిళనాడు 8 సీట్లు కోల్పోతుందంటూ ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఒక్క లోక్‌సభ సీటు కూడా తమిళనాడు కోల్పోదని, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. కేంద్రం నుంచి నిధుల కేటాయింపులోనూ తమిళనాడుకు ఏవిధమైన అన్యాయం జరగలేదన్నారు. 2014-24 మధ్య కాలంలో కేంద్రం తమిళనాడుకు రూ.5.08 లక్షల కోట్లు ఇచ్చిందని వివరించారు. గతంలో ఎప్పుడూ లేనంత ఎక్కువగా రాష్ట్రంలో దేశ వ్యతిరేక ధోరణి ప్రబలిందని విమర్శించారు.

భూకంప తీవ్రత పెరుగుతోందా?

ఎక్కడో పాక్‌లో భూమి కంపిస్తే..
న్యూఢిల్లీ వరకు ప్రకంపనలు
తక్కువ లోతులో భూకంప కేంద్రమే సమస్య

(సెంట్రల్‌డెస్క్)

ఇండోనేషియాలోని సుమత్రా దీవుల్లో భూకంపం వస్తే.. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల్లో ప్రకంపనలు ఎందుకొస్తాయి? పాకిస్థాన్‌లో భూకంప కేంద్రం ఉంటే.. న్యూఢిల్లీలో 5.1 తీవ్రతతో ప్రకంపనలు ఎందుకొస్తాయి? నేపాల్‌లో భూకంపానికి ఉత్తరాది రాష్ట్రాలకు లింకేమిటి? ఈ ప్రశ్నలకు భూకంప(సెస్మిక్) జోన్‌తోపాటు.. భూగర్భంలోని ఫలకాలు.. వాటిల్లో పగుళ్ల(ఫాల్ట్స్), థ్రస్ట్‌లు ప్రధాన కారణమని భూభౌతిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉంటే.. సుదూర ప్రాంతాల వరకూ ప్రకంపనలకు ఉంటాయని వివరిస్తున్నారు. ఫలకం లోపలి పగుళ్లతో తక్కువత తీవ్రత ఉంటుందని, ఫలకం సరిహద్దుల్లో, అంతర్-ఫలకాల పగుళ్ల ప్రాణ, ఆస్తినష్టాన్ని కలిగించే స్థాయిలో భూకంపాలను సృష్టిస్తాయని పేర్కొంటున్నారు.

ప్రధాన ఫాల్ట్స్ ఇక్కడే..

భూగర్భంలోని ఫలకాలు ఒకదానికొకటి ఢీకొన్నప్పుడు భూకంపాలు వస్తాయనే విషయం తెలిసిందే.! భారతదేశం భారత ఫలకంపై ఉండగా.. అది ఏడాదికి 5 సెంటీమీటర్ల చొప్పున ఎగువకు కదులుతుంది. ఈ క్రమంలో పైన ఉండే యురేషిన్ ఫలకం కిందకు దూసుకుపోతోంది. ఈ కారణంగానే ఈ ప్రాంతంలో హిమాలయాలు ఏర్పడ్డాయి. అయితే.. ఫలకలపైన పలుచోట్ల పగుళ్లు ఏర్పడుతుంటాయి. థ్రస్ట్‌లు ఏర్పడుతాయి. వీటి వల్ల కూడా భూకంపాలు వస్తుంటాయి. వీటి కారణంగా గడిచిన శతాబ్దికాలంలో 8 అంతకంటే ఎక్కువ తీవ్రత ఉన్న



ఇటీవల ఢిల్లీలో భూకంపం సమయంలో ఇళ్ల బయట ప్రజలు

నాలుగు భూకంపాలు సంభవించి, భారీగా ఆస్తి, ప్రాణనష్టం సంభవించాయి. 2004లో సముద్ర గర్భంలో 9.3 తీవ్రతతో వచ్చిన భూకంపం భారీ సునామీని సృష్టించి.. చరిత్రలోనే అతిపెద్ద విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఇక 5-8 తీవ్రతతో ఈ శతాబ్దకాలంలో 650కి పైగా భూకంపాలు వచ్చాయి. వీటన్నింటికీ భూఫలకాల్లో క్రియాశీల లోపాలే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇండో-యురేషియన్ ఫలకాల మధ్య హిమాలయాల తూర్పు అంచుల్లో ఇండో-బర్మీస్-అండమాన్ ఫాల్ట్‌లో తీవ్ర స్థాయిలో ఘర్షణ జరుగుతుందని వివరిస్తున్నారు. ఇక ద్వీపకల్ప భాగంలో నర్మద-సోన్-తపతి చీలికలు, దక్కన్ పీఠభూమిలో గోదావరి చీలిక ఫాల్ట్స్‌గా ఉండగా.. అండమాన్ సబ్‌డక్షన్ జోన్‌లో రెండు ఫాల్ట్స్ ఉన్నాయి. ఉత్తరాదితో పోలిస్తే.. ద్వీపకల్ప భాగంలో భూకంప తీవ్రతలు తక్కువ అని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఫాల్ట్స్‌కు ఉండే లింకుల కారణంగా ఢిల్లీ లాంటి నగరాల్లో ముప్పు ఎక్కువ అని పేర్కొంటున్నారు. హిమాలయన్ సెస్మిక్ బెల్ట్, ఢిల్లీ-హరిద్వార్ ప్రాంతం, ఆరావళి ఫాల్ట్స్, ఇండో-గంగా మైదానంలో ఎక్కడ భూకంపం సంభవించినా.. ఢిల్లీలో ప్రకంపనలు రావడానికి ఇదే కారణమన్నారు. ఇదిలా ఉండగా, ఇండోనేషియాలో బుధవారం ఉదయం భూకంపం సంభవించింది. ఉత్తర సులవేసి ప్రావిన్స్ వద్ద భూకంప కేంద్రం ఉండగా.. రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రత నమోదైంది. కాగా.. మంగళవారం ఉదయం పశ్చిమబెంగాల్, ఒడిసాల్లో 5.1 తీవ్రతతో భూమి కంపించిన విషయం తెలిసిందే.! దీని ప్రభావం హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో కూడా కనిపించడం గమనార్హం.!

సాధారణమే.. ఇప్పుడు ఎక్కువగా గుర్తిస్తున్నారు



ఒక చోట భూకంప కేంద్రం ఉంటే.. పదులు, వందల కిలోమీటర్ల వరకు ప్రభావం కనిపించడం సాధారణమే. ఇది కొత్తేమీ కాదు. ఇలా సుదూర ప్రాంతాల వరకు భూకంప ప్రభావం ఉండడానికి భూకంప కేంద్రం లోతును ప్రధాన కారణంగా చెప్పవచ్చు. లోతు ఎంత ఎక్కువగా ఉంటే.. భూకంప తీవ్రత అంత తక్కువగా ఉంటుంది. అదే 5-10 కిలోమీటర్ల లోతులో కేంద్రం ఉంటే.. సుదూర ప్రాంతాల్లోనూ భూములు కంపిస్తాయి. ఢిల్లీ వంటి నగరాలు జోన్-4లో ఉన్నాయి. భారత ప్రమాణాల విభాగం(బీఐఎస్) సూచించిన జోన్-4, జోన్-5 ప్రాంతాల్లో భూకంపాల ముప్పు, ఆస్తి/ప్రాణనష్టం అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు అనుగుణంగా ఈ ప్రాంతాల్లో ఇళ్లను నిర్మిస్తే.. నష్టాన్ని అరికట్టవచ్చు.

- రామన్‌చర్ల ప్రదీప్‌కుమార్, సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్

ఆ జిల్లాలో రొట్టెల వల్లే బట్టతల!

- మహారాష్ట్రలోని బుల్ధానాలో 300 మందికి వారాల వ్యవధిలో బట్టతల
- వారు వాడే గోధుమపిండిలో అధిక మోతాదులో సెలీనియం.. అదే సమస్య

ముంబై, ఫిబ్రవరి 26: మహారాష్ట్రలోని బుల్ధానా జిల్లా వాసులకు ఈ మధ్య ఈ విచిత్ర సమస్య ఎదురైంది. దాదాపు 300 మంది.. వారిలో చాలామంది యువతీ యువకుల్లో అకస్మాత్తుగా జుట్టు ఊడటం మొదలైంది. చూస్తుండగానే బట్టతల వచ్చేసింది. దీంతో పలువురు కాలేజీ విద్యార్థులు, యువతులు ఇల్లు దాటి బయటకు వెళ్లలేదు. ఈ సమస్యపై ఎంతోమంది డాక్టర్లను సంప్రదించినా వారు తగిన పరిష్కారం చూపలేకపోయారు. చివరికి, పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన వైద్యుడు హిమ్మత్‌రావ్ బవాస్కర్.. దీని గురించి పరిశోధించి.. బుల్ధానా జిల్లా వాసులు రొట్టెల తయారీకి వాడుతున్న గోధుమ పిండిలో సమస్య ఉందని గుర్తించారు. సదరు గోధుమ పిండిలో సిలీనియం అధికస్థాయిలో ఉంటోందని, దాని వల్లే అలోపిసియా అనే సమస్య తలెత్తి వెంట్రుకలు ఊడటం మొదలైందని తేల్చారు. పంజాబ్, హరియాణాల నుంచి సరఫరా అయిన ఆ గోధుమపిండిని బుల్ధానాలో రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేశారు. సాధారణంగా పర్వతప్రాంతాల్లోని నేలల్లో సిలీనియం అధికస్థాయిలో ఉంటుంది. పంజాబ్, హరియాణాల్లో విస్తరించిన శివాలిక్ పర్వతశ్రేణుల్లో కూడా ఇది సహజం. వర్షాకాలంలో ఈ సిలీనియం నీటిలో కలిసి పంటభూములకు చేరినప్పుడు.. పండించే పంటల్లో కూడా ఎక్కువ మోతాదులో కనిపిస్తుంది. అంతేగాక, ఫాస్ఫేట్ ఎరువులతోనూ సిలీనియం సమస్య పెరుగుతుంది. వాస్తవానికి మన శరీరంలో థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి సిలీనియం అవసరం. కానీ, మోతాదు మించితే జుట్టు ఊడటం, చర్మ సమస్యలు వంటివి తలెత్తుతాయి.

ఆహార వ్యర్థాలతో నిర్మాణాలు మరింత దృఢం!

ఇండోర్: ఆహార వ్యర్థాలను కాంక్రీట్‌లో కలపడం వల్ల నిర్మాణాలు మరింత దృఢంగా ఉంటాయని ఐఐటీ ఇండోర్ పరిశోధకులు తెలిపారు. హాని కలిగించని బ్యాక్టీరియాతో కూడిన వ్యర్థాలను కలపడం ద్వారా సదరు కాంక్రీట్ దృఢత్వం మరింత మెరుగుపడిందని పరిశోధకులు గుర్తించారు. దీనివల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని తాజా అధ్యయనంలో పేర్కొన్నారు. ఆహార వ్యర్థాలు కుళ్లిన తరువాత వాటిలో నుంచి కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుంది. హాని కలిగించని ఈ- కొలి బ్యాక్టీరియాతో కూడిన వ్యర్థాలను కాంక్రీట్‌తో కలపగానే పరస్పరం చర్య మొదలవుతుంది. ఫలితంగా కార్బొనేట్ స్ఫటికాలు ఏర్పడి అవి కాంక్రీట్‌లో ఉన్న రంధ్రాలు, పగుళ్లల్లో చేరుతాయి. దీంతో నిర్మాణాలు మరింత బలంగా ఉంటాయని ఐఐటీ ఇండోర్ ప్రొఫెసర్ సందీప్ తెలిపారు. ప్రయోగంలో భాగంగా కాలీఫ్లవర్ రెమ్మలు, బంగాళదుంప, నారింజ తొక్కలు వంటి వ్యర్థాలను కాంక్రీట్‌లో కలిపినట్లు ఆయన చెప్పారు. అయితే వ్యర్థాలను పొడి చేసి తగినంత నీరు కలిపి కాంక్రీట్‌ను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వేం నరేందర్‌రెడ్డికి మండలి లేదా రాజ్యసభ?

ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు.. వాటిల్లో నాలుగు కాంగ్రెస్ ఖాతాలోకే!

- మజ్లిస్‌కు సిటింగ్ స్థానాన్ని ఇచ్చేస్తారా?
- అధిష్ఠానం అందుకు అంగీకరిస్తుందా??
- సీపీఐకి ఒకస్థానంపై అధిష్ఠానం హామీ
- ఒక స్థానానికి మాదిగ వర్సెస్ మాల
- ఎంబీసీలకు ఒక సీటిచ్చే అవకాశం
- ఆర్గనైజేషన్ కోటాలో ఒకరికి చాన్స్
- కమ్మ సామాజికవర్గానికి సన్నగిల్లిన ఆశలు



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్ఎస్‌కు వెళ్లే అవకాశముండగా.. నాలుగింట్లో కాంగ్రెస్ పాగా వేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, సలహాదారుడు వేంనరేందర్ రెడ్డికి ఈ సారి ఎమ్మెల్సీ పదవి దక్కుతుందనే అంచనా లున్నా.. ఒకవేళ సామాజికవర్గాల కూర్పులో ఇబ్బందులు ఎదురైతే.. వచ్చే ఏడాది ఖాళీ కానున్న రాజ్యసభ సీటుకు ఎంపిక చేసే అవకాశాలున్నాయి. అయితే.. వేం నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వంపై తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.

మజ్లిస్‌కు అవకాశమిస్తారా?

ఐదు ఎమ్మెల్సీ సీట్లలో ఒకటి మజ్లిస్ సిటింగ్ స్థానం. ఇటీవలికాలంలో మజ్లిస్ పార్టీ కాంగ్రెస్ సర్కారుకు శాసనసభలో, బయట అన్ని విధాలుగా సహకరిస్తోంది. ఈ నేపథ్యంలో సిటింగ్ సీటును తమకే కేటాయించాలని మజ్లిస్ అధినాయకత్వం కోరుతున్నట్లు తెలిసింది. అయితే.. కాంగ్రెస్ అధిష్ఠానంలో మాత్రం మజ్లిస్‌పై వ్యతిరేకత ఉండడంతో ఆశలు గల్లంతయ్యే అవకాశాలున్నాయి. ఒకవేళ టీపీసీసీ ప్రత్యేకంగా ప్రతిపాదించినా.. అధిష్ఠానం ఓకే చెబుతుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న..! ఈ క్రమంలో తమకు మద్దతుగా ఉంటున్న మజ్లిస్‌కు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటాలో సీఎం రేవంత్‌రెడ్డి సహకరించే అవకాశాలున్నాయి. రేవంత్‌రెడ్డి పట్టుబడితే.. ఎమ్మెల్యే కోటాలోనే మజ్లిస్‌కు చాన్స్ రావొచ్చని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

సీపీఐకి ఒక సీటు!

ఒప్పందంలో భాగంగా ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని తమకు కేటాయించాలని సీపీఐ నేతలు కోరుతున్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఈ విషయమై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో చర్చలు జరిపారు. దీనికి అగ్రనేతలిద్దరూ సానుకూలంగా స్పందించారంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో సీపీఐకి ఒక సీటు దాదాపుగా ఖాయమేనని స్పష్టమవుతోంది.

రెడ్డి, బీసీ వర్గాలకు లేనట్లేనా?

ముఖ్యమంత్రిది రెడ్డి సామాజికవర్గమే. మంత్రివర్గ విస్తరణలోనూ రెడ్లకు కచ్చితంగా బెర్త్ దక్కే అవకాశాలున్నాయి. దీంతో.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ సారి రెడ్లకు అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఒకవేళ రెడ్లకూ అవకాశం ఉంటే.. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితోపాటు..టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి పేరును కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ నేతలు హరివర్ధన్‌రెడ్డి, సామా రామ్మోహన్‌రెడ్డి, మద్ది శ్రీనివాస్ రెడ్డి తదితరులూ ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ రెడ్లకు చాన్స్ లేకుంటే.. వేం నరేందర్‌రెడ్డికి వచ్చేఏడాది ఖాళీ కానున్న రాజ్యసభ సీటు ఇచ్చే అవకాశాలున్నాయి. రెడ్లను పరిగణనలోకి తీసుకోకుంటే.. ఆ ఎమ్మెల్సీ స్థానాన్ని అత్యంత వెనకబడిన కులాల(ఎంబీసీ)కు కేటాయించే అవకాశాలున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఎంబీసీలకు కాకుండా.. బీసీలకు మాత్రం సీటు దక్కే అవకాశాలు కనిపించడం లేదు. ఇందుక్కారణం.. టీపీసీసీ చీఫ్‌గా బీసీ ఉండడం.. మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ సామాజికవర్గానికి అవకాశం దక్కనుండడమే.! అయితే యాదవ సామాజిక వర్గం నుంచి ఇప్పటికే డిమాండ్లు ఉన్నాయి. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్‌యాదవ్, ప్రధానకార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ తదితరులు ఎమ్మెల్సీ పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మాజీ ఎంపీ వి.హన్మంతరావు పేరు కూడా ప్రస్తావనకు వచ్చినా.. ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ పోస్టుపైనే ఆయన ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది.

సంస్థాగత కోటా ఎవరికి?

4 సీట్లలో ఒక స్థానాన్ని పార్టీ సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న వారిలో ఒకరికిచ్చే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ కోటాలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

మాదిగకా? మాలకా?

ఎస్సీ సామాజికవర్గం నుంచి ఒకరు ఎమ్మెల్సీ అవ్వడం దాదాపుగా ఖాయమైంది. అయితే.. మాదిగ వర్గానికి కేటాయించాలా? మాల వర్గానికా? అన్న దానిపై చర్చలు నడుస్తున్నాయి. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌కు సీటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి వివాదం నడుస్తున్న నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి సీటు కేటాయించాలన్న అభిప్రాయాన్ని మరి కొందరు పార్టీ ముఖ్యులు తెరపైకి తెచ్చారు. మాదిగ సామాజిక వర్గం నుంచి ప్రధానంగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు కూడా వినిపిస్తోంది. అలాగే పార్టీ నేతలు దొమ్మాటి సాంబయ్య, రాచమళ్ల సిద్దేశ్వర్ కూడా రేసులో ఉన్నారు.

ముస్లింలలో పోటీ ఉన్నా..

ముస్లిం కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలనే డిమాండ్‌లు కూడా రాష్ట్ర కాంగ్రెస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, పార్టీ నేతలు ఫిరోజ్‌ఖాన్, అజ్మతుల్లా తదితరులు రేసులో ఉన్నారు. అయితే.. గవర్నర్ కోటాలో ఆమెర్ అలీఖాన్‌ను ఎమ్మెల్సీని చేసినందుకు.. ఈ సారి ముస్లింలకు చాన్స్ ఉండకపోవచ్చని పార్టీవర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక మహిళా కోటాలో కూడా డిమాండ్లు ఉన్నాయి. గతంలో మహేశ్వరం, వైరా సీట్లను ఆశించి టిక్కెట్లు దక్కని పారిజాత నర్సింహా రెడ్డి, బాణోతు విజయాబాయి రేసులో ఉన్నారు. వీరితో పాటుగా పార్టీ గడ్డుకాలంలో ఉన్నప్పుడు కూడా క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా పనిచేస్తూ.. గత అధికార పార్టీపై పోరాటాలు కొనసాగించామని, కేసులనూ ఎదుర్కొన్నామని, ఈ దఫా ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని జిల్లా స్థాయి నేతల నుంచి రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞాపనలూ అందుతున్నాయి.

మీనాక్షీ నటరాజన్‌తో భేటీ తర్వాతే..



ఈ వారంలోనే ఎమ్మెల్సీ అభ్యర్థుల చిట్టా ఖరారయ్యే అవకాశాలున్నాయి. ఒక్కో సీటుకు ఇద్దరు లేదా ముగ్గురి పేర్లను టీపీసీసీ అధిష్ఠానానికి పంపనుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమై.. అభ్యర్థుల ఎంపికపై తుది కసరత్తు చేయనున్నారు. సీపీఐ, మజ్లిస్ పార్టీల ప్రతిపాదనలు, అధిష్ఠానం సూచనలు, సోషల్ ఇంజనీరింగ్, పార్టీ పట్ల అంకిత భావం తదితరాలను పరిగణనలోకి తీసుకుని, కసరత్తును ఒక కొలిక్కి తీసుకురానున్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరగనున్న టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు మీనాక్షీ నటరాజన్.. హైదరాబాద్‌కు రానున్నారు. అదే రోజు ఆమె ఢిల్లీకి వెళ్లి పోతారని, మరుసటి పర్యటనలో కసరత్తు పూర్తవుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎలాంటి హంగూ.. ఆర్భాటాలు వద్దు : మహేశ్‌గౌడ్



గాంధీభవన్‌లో శుక్రవారం జరగనున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం.. అత్యంత నిరాడంబరంగా జరుగుతుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి హోదాలో మీనాక్షీ నటరాజన్ తొలిసారిగా వస్తున్నందున.. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు ఉండవని స్పష్టంచేశారు. ఆమెకు స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం, బొకేల అందజేత, శాలువలు కప్పడం వంటి కార్యక్రమాలు వద్దని బుధవారం ఓ ప్రకటనలో సూచించారు.

కమ్మ సామాజికవర్గానికి లేనట్లే?

కమ్మ సామాజిక వర్గం నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జెట్టి కుసుమ్‌కుమార్ పేరు పరిశీలనలో ఉంది. అయితే కమ్మ సామాజిక వర్గం కోటాలో రేణుకాచౌదరికి రాజ్యసభ సీటు ఇప్పటికే ఇచ్చేశామన్న వాదనను కొందరు నేతలు తెరపైకి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కమ్మ సామాజికవర్గానికి అవకాశం సన్నగిల్లినట్లేనని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కమ్మ సామాజిక వర్గానికి సీటు కేటాయించని పరిస్థితుల్లో జెట్టి కుసుమ్‌కుమార్‌కు ఏఐసీసీ కార్యదర్శి పదవిపై హామీ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు.



రంగనాయక్ సాగర్ నుంచి నీటిని విడుదల చేశాక కాలువ వద్ద సెల్ఫీ దిగుతున్న హరీశ్‌రావు

కాంగ్రెస్ మూర్ఖుల్లారా కళ్లు తెరిచి చూడండి

- కాళేశ్వరం నీటితోనే రాష్ట్రంలో రెండు పంటలు
- మేడిగడ్డలో పిల్లర్ కూలితే రాజకీయం చేశారు
- మీరు వచ్చాక 4 ప్రాజెక్టులు కుప్పకూలాయి
- రేవంత్.. దోఖేబాజ్ మాటలు మానుకో: హరీశ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని ప్రచారం చేసిన కాంగ్రెస్ మూర్ఖుల్లారా.. సిద్దిపేటతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గలగల పారుతున్న గోదావరి జలాలను కళ్లు తెరిచి చూడండి" అని ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలంలోని విఠలాపూర్, రంగాయపల్లి గ్రామాల వద్ద రంగనాయక సాగర్ నుంచి కాలువలోకి నీటి విడుదలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ గాంధీభవన్‌లో కూర్చొని మాట్లాడటం కాదని, గ్రామాల్లోకి వచ్చి పారుతున్న గోదావరి జలాలను చూసి మేల్కోవాలని సూచించారు. తెలంగాణకు కాళేశ్వరం వరప్రదాయిని అని, ప్రాజెక్టు ద్వారా సిద్దిపేట, యాదాద్రి, మెదక్ సహా పలు జిల్లాల్లో బంగారం లాంటి పంటలు పండుతున్నాయని చెప్పారు. కాళేశ్వరమే లేకుంటే ఈ ప్రాంతమంతా ఎడారేనని, బోరుబావుల్లో చుక్క నీరు ఉండేది కాదని, కాలువల ద్వారా ఒక్క పంట పండేది కాదని తెలిపారు. రాష్ట్రంలో రెండు పంటలు పండుతున్నాయంటే కాళేశ్వరం వల్లేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం కూలిందంటూ కాంగ్రెస్ నాయకులు దొంగ మాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రంగనాయక్‌సాగర్, కొండ పోచమ్మసాగర్, మల్లన్నసాగర్, అనంతగిరి.. ఇవన్నీ కాళేశ్వరంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాలో పెద్దవాగు, నల్లగొండ జిల్లాలో సుంకిశాల, పాలమూరులో వట్టెం పంప్ హౌస్, నిన్న ఎస్ఎల్‌బీసీ కలిపి నాలుగు ప్రాజెక్టులు కుప్పకూలాయని ధ్వజమెత్తారు. మేడిగడ్డలో ఒక్క పిల్లర్ కుంగితే బీఆర్ఎస్ నాయకులు తప్పుచేశారంటూ రాజకీయ లబ్ధి కోసం పాకులాడిన సీఎం రేవంత్.. ఈ నాలుగు ప్రాజెక్టులపై ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. కాళేశ్వరం పిల్లర్ కుంగితే బీఆర్ఎస్ తప్పేనని నిందించిన రేవంత్‌రెడ్డి.. వారి పాలనలో నాలుగు ప్రాజెక్టులు కూలితే ప్రకృతి వైపరీత్యం అనడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా దోఖేబాజ్ మాటలు బంద్ చేయాలని హితవు పలికారు. 15 నెలలు గడుస్తున్నా కుంగిన పిల్లర్‌ను సరిచేయలేదని, ఇప్పటికైనా బాగుచేసి యాసంగికి సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేడే

(మొదటి పేజీ తరువాయి)

జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు, ఇతర పోలింగ్ సామగ్రితో పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు బుధవారమే చేరుకున్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో 3,55,159 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రులు ఓటు వేసేందుకు 499, ఉపాధ్యాయులకు 274 కలిపి మొత్తం 773 కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులోని 93 కామన్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మరోపక్క, నల్లగొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో మొత్తం 25,797 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ నియోజకవర్గం 12 జిల్లాల్లోని 191 మండలాల్లో విస్తరించగా మొత్తం 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, ఓటింగ్ నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



కరీంనగర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది

మూడు స్థానాలు.. 90 మంది అభ్యర్థులు

రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల కలిపి మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో మొత్తం 90 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ సహా 56 మంది బరిలో ఉన్నారు. ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జాక్టో అభ్యర్థి ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి సహా 15 మంది పోటీ చేస్తున్నారు. ఇక, నల్లగొండ -వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 19 మంది పోటీ పడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి (టీఎస్‌యూటీఎఫ్), పింగిళి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్), గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి (టీపీఆర్‌టీయూ), పులి సర్వోత్తంరెడ్డి (బీజేపీ), పూల రవీందర్ (మాజీ ఎమ్మెల్సీ, బీసీ జేఏసీ), సుందర్‌రాజ్‌యాదవ్, మరో 13మంది పోటీలో నిలిచారు.

ఒక్క ఓటరు.. ఎనిమిది మంది సిబ్బంది

మహదేవ్‌పూర్ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో ఒకే ఒక ఓటరు కోసం ఓ పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులకు ఎనిమిది మంది సిబ్బందిని కూడా కేటాయించారు. పలిమెల మండలంలో పదికి పైగా ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. పంకెన గ్రామంలో మాత్రమే ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు చెందిన ఒకేఒక్క ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదయ్యారు. ఆ ఉపాధ్యాయుడి కోసం పలిమెలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ఐదుగురు పోలింగ్ సిబ్బంది, ఒక రూట్ ఆఫీసరు, ఇద్దరు పోలీసులు బుధవారం సాయంత్రమే అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ ఉపాధ్యాయుడు ఓటు హక్కును వినియోగించుకుంటారో? లేదో ? చూడాలి మరి..!!

ఏపీ నీటి తరలింపును అడ్డుకోండి

శ్రీశైలం నుంచి చుక్క నీరూ ఇవ్వొద్దు.. సాగర్ కుడి కాల్వకు విడుదలయ్యే నీటిని 7వేల నుంచి 5వేల క్యూసెక్కులకు తగ్గించాలి

- కృష్ణా బోర్డు ఎదుట తెలంగాణ వాదన
- అత్యవసర భేటీకి ఏపీ మళ్లీ డుమ్మా
- నేటి ఉదయానికి సమావేశం వాయిదా
- నీటి కేటాయింపులపై నేడు బోర్డు నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): "శ్రీశైలం జలాశయం నుంచి ఇప్పటి దాకా 240 టీఎంసీల నీటిని ఏపీ తరలించింది. ఇక ముందు చుక్క నీటిని తరలించకుండా ఏపీని అడ్డుకోవాలి. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాల్వ ద్వారా ఆ రాష్ట్రం తీసుకుంటున్న 7వేల క్యూసెక్కులను తక్షణమే 5వేల క్యూసెక్కులకు తగ్గించేలా నిర్ణయం తీసుకోవాలి" అని తెలంగాణ డిమాండ్ చేసింది. ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, సాగర్‌లో మిగిలి ఉన్న నీటి నిల్వలను ఏపీ, తెలంగాణకు పంపిణీ చేసే అంశంపై బుధవారం జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) రెండో అత్యవసర సమావేశం జరగాల్సి ఉండగా ఏపీ గైర్హాజరైంది. ఏపీ విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం 11 గంటలకు భేటీ నిర్వహిస్తామని కృష్ణా బోర్డు పేర్కొంది. దీనిపై తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, అంతరాష్ట్ర నీటి వనరుల విభాగం డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, నల్లగొండ సీఈ వి.అజయ్‌కుమార్, వనపర్తి సీఈ సత్యనారాయణరెడ్డి తదితరులు కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌తో సమావేశమై తీవ్ర నిరసన తెలియజేశారు. ఇప్పటికే వాటాకు మించి కృష్ణా జలాలను ఏపీ వాడుకుందని, ఇంకా అనధికారికంగా నీళ్లను తోడుకోవడానికే సమావేశానికి గైర్హాజరైందని రాహుల్ బొజ్జా మండిపడ్డారు. ఒంగోలు సీఈ జలసౌధలోనే ఉన్నా... ఈ సమావేశానికి రాలేదని తప్పుబట్టారు. శ్రీశైలం జలాశయం నుంచి నీటి తరలింపును తక్షణమే నిలిపివేయాలని ఈనెల 24న(సోమవారం) జరిగిన మొదటి అత్యవసర సమావేశంలో ఏపీని కృష్ణా బోర్డు ఆదేశించినా.. మల్యాల నుంచి 660 క్యూసెక్కులు, ముచ్చుమర్రి నుంచి 1600 క్యూసెక్కులు కలిపి మొత్తం 2260 క్యూసెక్కులను ఏపీ తరలించిందని రాహుల్‌బొజ్జా ఫిర్యాదు చేశారు. అయితే, గురువారం జరిగే సమావేశానికి హాజరయ్యేలా ఏపీకి ఇంకో అవకాశం ఇద్దామని తెలంగాణ అధికారులకు కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్ సర్దిచెప్పారు. ఆ భేటీలో రెండు రాష్ట్రాలు పరస్పర అంగీకారంతో ఒక నిర్ణయానికి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక వేళ సయోధ్య కుదరకపోతే ఈ అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖకు నివేదిస్తామని భరోసా ఇచ్చారు.

తెలంగాణకి 63... ఏపీకి 55 టీఎంసీలు

కృష్ణా బోర్డు తొలి అత్యవసర సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ తరఫున నల్లగొండ చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్, ఏపీ తరఫున ఒంగోలు చీఫ్ ఇంజనీర్ బి.శ్యామ్‌ప్రసాద్ బుధవారం జలసౌధలో సమావేశమై ప్రస్తుత రబీలో ఇరు రాష్ట్రాలకు అవసరమైన సాగు నీటి ప్రణాళికలను సిద్ధం చేశారు. కనీస నిల్వ మట్టానికి ఎగువన శ్రీశైలంలో 36.51 టీఎంసీలు, సాగర్‌లో 30.57 టీఎంసీలు కలిపి మొత్తం 67 టీఎంసీలు లభ్యతగా ఉన్నట్టు నిర్ధారించారు. అయితే, శ్రీశైలం నుంచి ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 13 టీఎంసీలు, సాగర్ నుంచి ఏపీకి 45 టీఎంసీలు, తెలంగాణకు 50 టీఎంసీల నీళ్లు అవసరమని అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఏపీకి 55 టీఎంసీలు, తెలంగాణకు 63 టీఎంసీలు అవసరమని సీఈల కమిటీ నిర్ణయించింది. గురువారం జరగనున్న రెండో అత్యవసర సమావేశంలో ఈ ప్రణాళికపై చర్చించి.. నీటి కేటాయింపులపై కృష్ణా బోర్డు తుది నిర్ణయం తీసుకోనుంది.

ఉపాధ్యాయుల ఓటుకు రేటు!

- వెయ్యి నుంచి 3 వేల చొప్పున పంపిణీ!

వరంగల్ ఎడ్యుకేషన్/ఖమ్మం/నల్లగొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మరికొద్ది గంటల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుండగా కొందరు అభ్యర్థులు బుధవారం రాత్రి ఓటర్లకు గప్‌చుప్‌గా డబ్బు పంపిణీ చేశారు. నల్లగొండలో ఓ అభ్యర్థి తరఫున అనుయాయులు ఒక్కో ఓటరు ఇంటికి వెళ్లి రూ.2 వేలు అందజేయగా, మరో ఇద్దరు అభ్యర్థులు రూ.1,000 నుంచి రూ.1,200, రూ.2500 ఇచ్చారని సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సామాజిక సంఘాల మద్దతు ఉన్న ఓ అభ్యర్థి ఓటుకు రూ.2 వేలు, ఉపాధ్యాయ సంఘాల్లో కీలకంగా చెప్పుకుంటున్న మరో అభ్యర్థి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు పంపిణీ చేశారని తెలిసింది. మరో పార్టీ మద్దతుతో బరిలో ఉన్న అభ్యర్థి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి అధికార పార్టీ మద్దతు ఉందని చెప్పుకుంటున్న అభ్యర్థి కూడా ఓటుకు రూ.1,000 నుంచి రూ.1,500 పంపిణీ చేశారని సమాచారం. కొందరు సంఘాల నాయకులు, మరికొందరు పార్టీల నాయకుల ద్వారా డబ్బు పంపిణీ చేస్తే, మరికొందరు ఫోన్‌పే వంటి మాధ్యమాల ద్వారా నగదు బదిలీ చేసినట్లు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఉపాధ్యాయులకు దావత్‌లతో పాటు డబ్బులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. నలుగురు ప్రధాన అభ్యర్థులు ఇప్పటికే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సెలవు దినమైన ఆదివారం పార్టీలు ఇచ్చారు. ఇందుకు వరంగల్, హనుమకొండ తదితర ప్రాంతాల్లోని ఫంక్షన్ హాళ్లు వేదికయ్యాయి. సంఘాలు, సామాజిక వర్గాల వారీగా ఈ పార్టీలు ఏర్పాటు చేశారు.

ఖాతాలోకి కాదు.. చేతికే డబ్బులు!

'ఓటుకు నోటు తీసుకుంటున్నారా? తస్మాత్ జాగ్రత్త!', 'ఓటును నమ్ముకోవాలి.. అమ్ముకోవద్దు' అంటూ ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో మంగళవారం సాయంత్రం నుంచి మెసేజ్‌లు చక్కర్లు కొడుతున్నాయి. అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకుని పంపిణీ చేసినా, ఓటుకు డబ్బులు తీసుకున్నా చర్యలు తప్పవని ఆ మెసేజ్‌లు హెచ్చరిస్తున్నాయి. ఉపాధ్యాయుల ఖాతాల్లో జమవుతున్న డబ్బులపై నిఘా ఉందని పేర్కొంటున్నాయి. ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదవుతున్న ఘటనలు ఉన్నాయని పలువురు చెబుతున్నారు. దీంతో కొందరు ఆన్‌లైన్‌లో నగదు బదిలీలు చేయకుండా నేరుగా చేతికి డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది.

నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేను.. కాంగ్రెస్ ఫ్లెక్సీలలో నా ఫొటో వాడుతున్నారు

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): "నేను బీఆర్ఎస్ టికెట్‌తో గెలిచిన ఎమ్మెల్యేను. ఆ పార్టీలోనే ఉన్నాను. నా ఫొటోను కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలలో వాడుకొని ప్రజలను గందరగోళపరుస్తున్నారు. నా ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి" అంటూ గద్వాల జోగుళాంబ జిల్లా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీఆర్ఎస్ తరఫున గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఆవరణలోని బీఆర్ఎస్ చాంబర్‌లో ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన దృశ్యాలు బయటకు వచ్చాయి. ఆ తర్వాత మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాలలోని ఎమ్మెల్యే స్వగృహానికి వచ్చి కృష్ణమోహన్ రెడ్డిని తన వెంట పెట్టుకొని సీఎం దగ్గరకు వెళ్లి మాట్లాడించడం వంటి సంఘటనలు వెంటవెంటనే చోటుచేసుకున్నాయి. ఇదిలాఉండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ పది మంది ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా ఉన్నారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిశీలనలో ఉన్నది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కాంగ్రెస్ ఫ్లెక్సీలలో తన ఫొటోను వాడుకొని తనను అప్రతిష్ఠపాలు చేస్తున్నారని ఈ నెల 11వ తేదీన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

సీఎంకు సిగ్గనిపించడం లేదా..?

- హస్తిన యాత్రలు కాదు.. కార్మికులను కాపాడండి: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'ప్రధాన ప్రతిపక్షంపై సాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చాలదన్నట్లు.. ఇప్పుడు అధికార యంత్రాంగంపై కూడా వేధింపులకు దిగడానికి సీఎం రేవంత్ రెడ్డికి సిగ్గనిపించడం లేదా..?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్) రిపోర్టుతో బీఆర్ఎస్ దార్శనిక పాలనకు, కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న తేడా బట్టబయలు కావడంతో సీఎంకు మింగుడుపడటం లేదని విమర్శించారు. వెబ్‌సైట్ నుంచి రిపోర్టును తొలగించి సంబంధిత అధికారులపై వేధింపులకు దిగడాన్ని ఖండిస్తున్నామని బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను సురక్షితంగా కాపాడే విషయాన్ని విస్మరించి హస్తిన పర్యటనలతో హడావుడి చేస్తున్నారన్నారు. ఎన్నికలు, ఢిల్లీ టూర్లు అని తిరిగే రేవంత్‌కు పాలన అంటే ఏమిటో తెలుసా అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ ఒక డిజైన్ ఫెయిల్యూర్ అని కేసీఆర్ గతంలోనే చెప్పారని.. ఇన్‌స్టా రీల్స్ కాకుండా సీఎం ఆ వీడియో చూస్తే కొంచెమైనా విషయ పరిజ్ఞానం వస్తుందంటూ ఎద్దేవా చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని తమిళనాడు సీఎం స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ మద్దతు ప్రకటించారు. దేశానికి అవసరమైనప్పుడు కుటుంబ నియంత్రణను సమర్థంగా పూర్తి చేసిన దక్షిణాది రాష్ట్రాలను అన్యాయం చేయడం తగదన్నారు. దేశానికి రాష్ట్రాలు అందించే ఆర్థిక సహకారం ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, దేశంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ టెక్, ఇన్నోవేషన్ సదస్సు ఈ ఏడాది బెంగళూరులో జరగనుంది. గురువారం ప్రారంభం కానున్న ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరుకానున్నారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వ్యాఖ్యలకు సీపీఎం ఖండన

ఇస్లాం మతం స్వీకరించిన బీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేయడానికి వీల్లేదని బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. దూదేకులు, అత్తర్‌సాహెబ్‌లు, పాకీ పని చేసేవారు, రాళ్లు కొట్టి జీవనం సాగించే కుటుంబాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ అణచివేతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ తరగతుల ప్రజలకు ఇస్లాం మతం స్వీకరించినంత మాత్రాన రిజర్వేషన్లు అమలు చేయడానికి వీల్లేదనడం సరికాదన్నారు.

ఏపీలో ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం?

సర్కారు యోచన.. సర్వే తర్వాత యాజమాన్యాలతో సంప్రదింపులు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఐటీ, ఐటీ ఆధారిత ప్రైవేటు రంగంలో వర్క్ ఫ్రమ్ హోంను ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రానికి చెందిన యువత ఐటీ ఉద్యోగాల కోసం కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు వలసపోవడాన్ని నివారించి స్వగ్రామాల్లో ఇంటి వద్ద నుంచే పనిచేసేందుకు అవకాశం కల్పించాలని ఐటీ శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అదేవిధంగా విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో పనిచేస్తున్న వారికీ సొంతూళ్లలో సదుపాయాలు కల్పించాలని సర్కారు యోచిస్తోంది. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేస్తే..? రవాణా, ఇంటి అద్దె, ఇతర ఖర్చులు...కంపెనీలకు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఐటీ ఉద్యోగుల సేవలను రాష్ట్రానికీ ఉపయోగించుకోవచ్చు. కూటమి ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తూ, మొదట వర్క్ ఫ్రమ్ హోం చేయడంపై పొరుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. ఉద్యోగుల ఆసక్తిని తెలుసుకునేందుకు రాష్ట్ర ఐటీ శాఖ సర్వే నిర్వహిస్తోంది. ఆ తర్వాత ప్రైవేటు ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల యాజమాన్యాలతో సంప్రదింపులు జరపనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తెలివైన వ్యాపారి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను నియంత అనకూడదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రశంసాపత్రం ఇవ్వడానికి కొద్దిగాముందు, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా దురాక్రమణదారు కానేకాదని ఐక్యరాజ్యసమితిలో అమెరికా నిర్ధారించింది. అమెరికా, రష్యా ఒకేమాటమీదకు రావడం, ఏకరీతిన ఓటుచేయడం ఎన్నడైనా చూశామా? యుద్ధానికి సంబంధించిన రెండు తీర్మానాల్లో రష్యాతో కలసి అమెరికా ఓటుచేయడం వందరోజుల ట్రంప్ ఏలుబడిలో వచ్చిన సమూలమైన మార్పుకు నిదర్శనం. ఉక్రెయిన్‌కీ, పాశ్చాత్య మిత్రదేశాలకు ద్రోహం చేస్తూ, ట్రాన్స్ అట్లాంటిక్ బంధాన్ని తీసిపారేస్తూ అమెరికా తీసుకున్న ఈ వైఖరికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఎంతగానో సంతోషిస్తున్నారు.

యుద్ధానికి మూడేళ్ళయిన సందర్భంలో, తక్షణమే దానిని ముగించాలంటూ భద్రతామండలిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానంలోని భాష చైనా రష్యాలకు తెగనచ్చేసింది. ఉక్రెయిన్ పక్షాన, యూరోపియన్ దేశాలను కూడా కలుపుకొని రష్యాను ఒంటరిచేయడం లక్ష్యంగా ఇంతకాలమూ అమెరికా ఉపయోగించిన భాషకు ఇది పూర్తి భిన్నం. యుద్ధంతో ముడిపడిన అన్ని పాపాలకూ, ప్రపంచం ఎదుర్కొంటున్న సర్వ సమస్యలకు రష్యాయే కారణమంటూ నిందిస్తూ వచ్చిన అమెరికా ఇప్పుడు యూరప్ దేశాల అండదండలతో ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానాల్లో గతంలో వాడిన పదాలకు అభ్యంతరం చెబుతోంది. సర్వప్రతినిధి సభలో తగ్గాల్సి వచ్చినందుకు, భద్రతామండలిలో తన మాట నెగ్గించుకుంది. ఉక్రెయిన్‌నూ, ఐరోపాదేశాలను పక్కనబెట్టి, రష్యాతో నేరుగా అమెరికా చర్చలు ఆరంభించిన నేపథ్యంలో, ఈ తీర్మానాలు ఆత్మీయుల మధ్య ఒక్కసారిగా పెరిగిన ఉద్రిక్తతలకు సూచికలు.

ఉక్రెయిన్ కారణంగానే యుద్ధం మొదలైందనీ, తెలివితక్కువ జెలెన్‌స్కీ వల్లనే ఆ దేశం ఆర్థికంగా పతనమైందనీ, రష్యా శక్తిసామర్థ్యాలు తెలిసి కూడా ఈ నియంత మొండిగా యుద్ధానికి దిగాడని ట్రంప్ ఇటీవల నోరుపారేసుకున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో ట్రంప్ అతిఖరీదైన బేరం కుదుర్చుకోబోతున్నాడని, రెండువందల బిలియన్ డాలర్ల ఆయుధ సాయం చేసినందుకు ప్రతిఫలంగా ఓ ఐదువందల బిలియన్ డాలర్ల విలువైన అరుదైన ఖనిజాలను అమెరికన్ కంపెనీలు కొల్లగొట్టబోతున్నాయని అంతా అనుకుంటున్నదే. జెలెన్‌స్కీని దారికితేవడానికి ఆయన చేసిన ప్రయత్నం ఫలించినట్టే. ఉక్రెయిన్ అమ్మకానికి సిద్ధంగా లేదంటూ మొదట్లో ఏవో గంభీరమైన మాటలు వినబడ్డాయి కానీ, రేపోమాపో ఉక్రెయిన్ అధినేత సంతకాలు పెట్టడానికి అమెరికా రావచ్చు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో భేటీ సందర్భంలో ట్రంప్ గౌరవంగా వ్యవహరించలేదని, తీసిపారేసినట్టు మాట్లాడారన్న విశ్లేషణలను అటుంచితే, ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టి యుద్ధాన్ని ముగించడం సరికాదని మాక్రాన్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఎంత పెడసరంగా మాట్లాడారో చూశాం. మనం స్మార్ట్ కాకపోతే యుద్ధం కొనసాగుతూనే ఉంటుందన్న ట్రంప్ వ్యాఖ్యలో యుద్ధం నుంచి అనేకరెట్లు దండుకోబోతున్న సందేశం ఉంది. రష్యా ఆక్రమించుకున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం సులువు కాదని అంటూనే, జెలెన్‌స్కీ వచ్చి ఒప్పందంమీద సంతకాలు చేస్తారన్న ఆశనీ ప్రకటించారు. మరోపక్క రష్యాతో కూడా తాను వ్యాపారం చేయబోతున్నానని, ఒప్పందాలు కుదుర్చుకోవచ్చునని ట్రంప్ అంటున్నారు. ఈయన ఈ మాట అన్న రెండుగంటల్లోనే పుతిన్ అన్ని లెక్కలూ వేసుకొని, మా దగ్గర కూడా అరుదైన ఖనిజాలు, లోహాలు ఉన్నాయి, మాస్కోతో మెరుగైన సంబంధాలు కొనసాగిస్తే చక్కగా వ్యాపారం చేసుకోవచ్చునని ప్రకటించారు. తాను ఆక్రమించుకున్న ఉక్రెయిన్ భూభాగాలను కూడా ఆయన ఈ ఆఫర్‌లో ట్రంప్‌కు అమ్మకానికి పెట్టేశారు.

యుద్ధానికి ముగింపు పలికే పేరిట అమెరికా–రష్యా స్నేహం బలపడుతోంది, ఉప్పు–నిప్పులా ఉండే ఈ రెండుదేశాలు ఏకంగా ఇచ్చిపుచ్చుకోవడానికి సిద్ధపడుతున్నాయి. సౌదీ చర్చలు త్వరలోనే కొలిక్కివస్తాయని, పుతిన్–ట్రంప్ కరచాలనం కూడా సమీపంలోనే ఉందని విశ్లేషకులు అంటున్నారు. పరిష్కారం పేరిట ట్రంప్ ఆధ్వర్యంలో జరిగే ఆస్తిపంపకాల్లో అంతిమంగా జెలెన్‌స్కీకి దక్కే వాటా ఎంతో తెలియదు కానీ, ట్రంప్ వ్యాపారదక్షత చూసిన తరువాత చాలామందికి రెండు పిల్లులు–రొట్టెముక్క–కోతి కథ గుర్తుకువస్తోంది.

హిందీ పెత్తనం కాదు, భాషా వైవిధ్యం కావాలి

త్రిభాషా సూత్రంపై మరోసారి విస్తృత రాజకీయ చర్చకు పరిస్థితులు పక్వమవుతున్నాయి. విద్యారంగ వాస్తవాలను నిశితంగా పరిశీలిస్తే ఏక భాషా విధానమే అమలవుతున్నట్లు స్పష్టమవుతుంది. ఆంగ్ల భాషలోనే విద్యా బోధన జరగాలన్న నిశ్చిత భావన సహజ వివేకానికి, విద్యపై విజ్ఞుల దార్శనికతకు విరుద్ధంగా ఉన్నది. మరింత ఘోరమైన విషయమేమిటంటే భాషా వైవిధ్యం నుంచి ఏక భాషా స్వామ్యానికి తిరోగమించడాన్ని రాజ్యవ్యవస్థే ప్రోత్సహించడం, పైగా ఆ తిరోగతిని ఆధునికతగా ప్రస్తుతించడం జరుగుతోంది!

పాఠశాల బాలలకు మూడు భాషలు బోధించాలన్న విధానం అధికారికంగా త్రిభాషా సూత్రంగా సుప్రసిద్ధమయింది. 1968లో ఈ సూత్రానికి సర్వజనామోదం లభించింది. ఈ ప్రకారం పాఠశాల బాలలకు 'హిందీ భాషా రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లీషు, ఆధునిక భారతీయ భాష (ఏదైనా ఒక దక్షిణాది భాష)ను బోధించాలి; హిందీయేతర రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లీషు ప్రాంతీయ భాషను బోధించాలి'. దక్షిణ భారతావనిలో హిందీ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ త్రిభాషా సూత్రం ఆమోదం పొందింది. తొలుత రాధాకృష్ణన్ కమిషన్ (1948) ప్రతిపాదించిన ఈ త్రిభాషా సూత్రాన్ని విద్యావేత్త కొఠారి నేతృత్వంలోని తొలి విద్యా కమిషన్ అంగీకరించింది. దరిమిలా 1960లు, 1980ల్లో కేంద్రం రూపొందించిన ప్రథమ, ద్వితీయ జాతీయ విద్యా విధానాలలో ఈ త్రిభాషా సూత్రం భాగమయింది.



త్రిభాషా సూత్రానికి హేతుబద్ధమైన ప్రాతిపదికలు ఉన్నాయి. భారత్‌లో అనేక భాషలు మాట్లాడతారు. ఒకటి కంటే ఎక్కువ భాషలలో మాట్లాడే వ్యక్తులు, జన సముదాయాలు అనేకమున్నాయి. సమున్నతమైన బహు భాషా సంస్కృతి వర్ధిల్లుతున్న దేశం మనది. భారతీయ అస్తిత్వంలో భాగమై భారతీయతను విశిష్టంగా నిర్వచిస్తున్న భాషా వైవిధ్యం కొనసాగేందుకు, ఆ భాషా బాహుళ్యాన్ని ప్రోత్సహించేందుకు మన విద్యా వ్యవస్థ ఒక ప్రధాన ఆలంబన కావాలి. బహు భాషల్లో విద్యాభ్యాసం ఆలోచనాశీలతను, చింతనాశక్తిని, సృజనాత్మకతను, విద్యాభివృద్ధికి, సామాజిక సహనానికి విశేషంగా తోడ్పడగలదనేందుకు శాస్త్రీయ రుజువులు ఉన్నాయి. మరి బహుభాషా సంస్కృతిని ప్రోత్సహించేందుకు, పరిపుష్టం చేసేందుకు త్రిభాషా సూత్రంను అమలుపరచడం కంటే మరో మేలు మార్గం మరేముంది? బాలలు అంచెలంచెలుగా మూడు కంటే ఎక్కువ భాషలు నేర్చుకోవాలని, ఎన్ని భాషలు అదనంగా నేర్చుకుంటే మాతృభాష, ద్వితీయ భాషలో ప్రావీణ్యాలను పెంపొందించుకోవడం సులభతరమవుతుందని, అధ్యయన ప్రగాఢత సమృద్ధమవుతుందని భాషావేత్తలు, విద్యావేత్తల బృందం ఒకటి స్పష్టంగా చెప్పింది.

> త్రిభాషా సూత్రాన్ని అమలుపరచడంపై కేంద్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉన్నదా? హిందీ భాషను హిందీయేతర భాషీయులపై రుద్దకుండా ఉండడం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉన్నదా? ఉన్నట్లయితే రాష్ట్రాలకు విద్యారంగ సంబంధిత నిధులు మంజూరు చేసేందుకు త్రిభాషా సూత్రం అమలును ఒక షరతుగా నిర్దేశించకూడదు. 1968లో వలే సమస్త రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని నిర్వహించి పాఠశాల విద్యలో భాషా వైవిధ్యంపై ఒక జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించాలి.

మరి ఇప్పుడు త్రిభాషా సూత్రం ఎందుకు వివాదాస్పదమవుతోంది? జాతీయ విద్యా విధానం–2020ని అమలుపరిచేందుకు తమిళనాడు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో ఆ రాష్ట్రానికి సర్వ శిక్షా అభియాన్ కింద ఇవ్వవలసిన నిధుల విడుదలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. జాతీయ విద్యా విధానాన్ని అమలుపరిచి తీరాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాన్ని పాటించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ నిరాకరిస్తున్నారు. తమ పార్టీ మొదటి నుంచీ త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తూ వస్తోందని స్టాలిన్ అంటున్నారు.. తమ రాష్ట్రం ఎప్పుడూ పాఠశాల బాలలకు రెండు భాషల– తమిళం, అంగ్లం– బోధిస్తుందని ఆయన అన్నారు. త్రిభాషా సూత్రం ప్రకారం పాఠశాల విద్యలో మూడో భాషను కూడా బోధించి తీరాలన్నది హిందీ భాషను తమపై రుద్దేందుకు ఒక సాకు మాత్రమేనని ఆయన విమర్శించారు. స్టాలిన్‌తో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విభేదిస్తూ తమిళనాడు ప్రభుత్వం రాజ్యాంగానికి నిబద్ధమై ఉండాలని స్పష్టం చేశారు. త్రిభాషా సూత్రం విషయంలో తాము కట్టుబడి ఉండాల్సిన యుక్తమైన రాజ్యాంగ అధికరణ, నిబంధన ఏమిటో చెప్పాలని కేంద్రమంత్రిని తమిళనాడు ముఖ్యమంత్రి అడిగారు. భావోద్వేగపూరితమైన వాద ప్రతివాదాలివి. అందునా వచ్చే ఏడాది తమిళనాడు శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు పునః ప్రారంభమయినప్పుడు ఈ భాషా ఘర్షణ పార్లమెంటు లోపల, బయటా మరింత తీవ్రమయ్యే అవకాశమున్నది.



■ యోగేంద్ర యాదవ్

త్రిభాషా సూత్రాన్ని ఆక్షేపించేందుకు, అనుమానించేందుకు డీఎంకె ప్రభుత్వానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం సమాఖ్య పాలనా విధానాన్ని తరచు ఉల్లంఘిస్తోంది. తమిళనాడు రాష్ట్ర గవర్నర్ భారతీయ జనతా పార్టీ పక్షాన నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను మోదీ సర్కార్ పదే పదే అక్రమంగా వినియోగించుకుంటుంది. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకాలకు యూజీసీ కొత్త మార్గదర్శక సూత్రాలు ఇందుకొక తాజా ఉదాహరణ. విద్యా విధానాల అమలు విషయంలో, అందునా బోధనా మాధ్యమం వంటి సున్నితమైన విషయమై రాష్ట్రాలు తమ నిర్దేశాలను పాటించేలా కేంద్ర నిధుల మంజూరును ఒక సాధనంగా ఉపయోగించుకోవడమనేది సమంజసమైన పాలన కాదు, కాబోదు. ఎందుకంటే అది రాజ్యాంగ విరుద్ధమైనది. సమాఖ్య స్ఫూర్తిని ఉల్లంఘించేది.

సరే, మోదీ ప్రభుత్వ జాతీయ విద్యా విధానంతో అనేక సమస్యలు ఉన్నాయి. త్రిభాషా సూత్రం వాటిలో ఒకటి మాత్రమే. ప్రథమ, ద్వితీయ జాతీయ విద్యా విధానాలలో భాగంగా ఉన్న త్రిభాషా సూత్రాన్ని జాతీయ విద్యా విధానం–2020 కూడా పునరుద్ఘాటించింది. వాస్తవానికి మోదీ సర్కార్ జాతీయ విద్యా విధానం హిందీని ప్రస్తావించకపోవడం ద్వారా త్రిభాషా సూత్రాన్ని అస్పష్టపరిచింది. ఈ ప్రకారం ఒక రాష్ట్ర ప్రభుత్వం తాను ఎంపిక చేసిన ఏ మూడు భాషలనైనా పాఠశాల బాలలకు బోధించవచ్చు. అయితే ఆ మూడు భాషలలో రెండు తప్పనిసరిగా దేశీయ భాషలు అయివుండాలి. ప్రాచీన భాషలు అయిన సంస్కృతం, తమిళంను ఆ రెండు దేశీయ భాషలలో భాగంగా పరిగణించవచ్చు. ఈ దృష్ట్యా తమిళనాడు ప్రభుత్వం కోరుకుంటే, తమిళంతో పాటు మళయాళం, తెలుగు, కన్నడ భాషలలో ఒకదాన్ని, ఆంగ్ల భాషను బోధించవచ్చు. త్రిభాషా సూత్రం ప్రకారం తమిళం, ప్రాచీన తమిళం, ఆంగ్ల భాషను బోధించవచ్చు. హిందీ భాషను రుద్దుతారనే భయం లేకుండా తమిళనాడు ప్రభుత్వం నిరాటంకంగా త్రిభాషా సూత్రాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.

ఈ వాస్తవాల దృష్ట్యా తమిళనాడు ముఖ్యమంత్రి త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకించడానికి బదులు (అన్ని రాష్ట్రాలలోను దానిని ఒకే విధంగా అమలుపరిచిన పక్షంలో) ఆమోదించాలి. హిందీ భాషా రాష్ట్రాలలో మూడో భాషగా తమిళం లేదా మరేదైనా దక్షిణాది భాషను బోధించేందుకు సిద్ధమైతే తమిళనాడు పాఠశాలల్లో కూడా హిందీని ప్రవేశపెట్టేందుకు స్టాలిన్ అంగీకరించాలి. అట్లా కాకపోతే ఆంగ్లం, తమిళంతో పాటు (హిందీ రాష్ట్రాలు మూడో భాషగా సంస్కృతంను బోధిస్తున్నట్టు) ప్రాచీన తమిళంను మూడో భాషగా ప్రవేశపెట్టవచ్చు.

అటువంటి చర్య త్రిభాషా సూత్రానికి సంబంధించిన ఒక వాస్తవాన్ని తేటతెల్లంగా ప్రకటిస్తుంది. ఆ సూత్రం నిర్దేశిస్తున్న భాషా వైవిధ్యాన్ని ఉద్దేశపూర్వకంగా ఉపేక్షిస్తుంది హిందీరాష్ట్రాలే కానీ, తమిళనాడు కాదన్నదే ఆ వాస్తవం. 1960ల్లో త్రిభాషా సూత్రంపై తొలి ఏకాభిప్రాయం కుదిరింది. హిందీ భాషా రాష్ట్రాలు మరో ఆధునిక భారతీయ భాష, ముఖ్యంగా ఏదైనా ఒక దక్షిణ భారతీయ భాషను బోధించాలన్నదే ఆ సార్వత్రిక సమ్మతి. ఆ ప్రకారం తొలుత ఉత్తర్‌ప్రదేశ్‌లో తమిళం, హర్యానాలో తెలుగు, బిహార్, రాజస్థాన్ మొదలైన ఉత్తరాది రాష్ట్రాల్లో ఇతర దక్షిణాది భాషలను బోధించేందుకు గట్టి ప్రయత్నాలే జరిగాయి. అయితే కొద్ది కాలానికే హిందీ రాష్ట్రాలు మూడో భాష నిబంధన అమలుకు ఒక దగ్గరి దోవను కనుగొన్నాయి. అది సంస్కృత భాషా బోధన! చాల ప్రాథమికంగా, యాంత్రికంగా బట్టీ వేయించడం ద్వారా ఆ పురా భాషను 'మూడో భాష'గా నేర్పించడం ప్రారంభమయింది అలా మరో ఆధునిక భారతీయ భాషను బోధించే అవసరాన్ని పూర్తిగా దాటవేశారు. నిజం చెప్పాలంటే త్రిభాషా సూత్రం ఒక అసమ ఒప్పందంగా పరిణమించింది: హిందీయేతర భాషీయులు హిందీని నేర్చుకోవడం తప్పనిసరి అయింది; అయితే హిందీ భాషీయులు దక్షిణాది భాష నొకదాన్ని నేర్చుకునేందుకు సుహృద్భావపూర్వకంగా ప్రతిస్పందించలేదు. దీంతో దక్షిణ భారతావనిలో త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా రాజకీయ ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. ఉత్తరాది వారి దబాయింపును సవాల్ చేయవలసిన సమయమాసన్నమయింది.

త్రిభాషా సూత్రాన్ని అమలుపరచడంపై కేంద్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉన్నదా? హిందీ భాషను హిందీయేతర భాషీయులపై రుద్దకుండా ఉండడం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉన్నదా? ఉన్నట్లయితే రాష్ట్రాలకు విద్యారంగ సంబంధిత నిధులు మంజూరు చేసేందుకు త్రిభాషా సూత్రం అమలును ఒక షరతుగా నిర్దేశించకూడదు. 1968లో వలే సమస్త రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని నిర్వహించి పాఠశాల విద్యలో భాషా వైవిధ్యంపై ఒక జాతీయ ఏకాభిప్రాయాన్ని రూపొందించాలి. మూడో భాషకు ప్రత్యామ్నాయంగా సంస్కృత భాషా బోధనతో తప్పించుకునేందుకు హిందీ భాషా రాష్ట్రాలను ఎట్టి పరిస్థితులలోను అనుమతించకూడదు. భాషా సమస్యపై రాజకీయ చర్చను కొత్త పుంతలు తొక్కించి హిందీ స్వామ్యం కాకుండా బహుభాషా సంస్కృతిని పెంపొందించేందుకు ప్రాధాన్యమివ్వాలి. మన విద్యా విధానంలో ఆంగ్ల భాష ఆధిపత్యం రాజ్యమేలుతుంది. విద్యా బోధనలో ఇంగ్లీషు భాష ప్రాబల్యాన్ని తొలగించడమనేది చాలా అవసరం. ఇది మన రాజకీయవేత్తల దీక్షాదక్షతలకు ఒక పరీక్ష, సందేహం లేదు. సర్వత్రా ముఖ్యంగా విద్యారంగంలో ఆంగ్ల భాషా ఆధిపత్యం నుంచి బయటపడడం కంటే రాజ్య వ్యవస్థ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడం, పారిశ్రామిక –సైనిక రంగాల భాగస్వామ్యాన్ని ఎదుర్కోవడం చాలా సులువు సుమా!

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

సరిదిద్దడమేనా, సంస్కరణలు లేవా?

ముక్కుసూటితనం కలిగిన మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆధ్వర్యంలో తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పడినప్పుడు తెలంగాణ విద్యాభిమానుల్లో ఒక భరోసా ఏర్పడింది. తెలంగాణ విద్యావ్యవస్థ, ముఖ్యంగా ప్రభుత్వరంగ పాఠశాల వ్యవస్థలో మౌలిక మార్పులు చూడవచ్చుననే ఆశలు కనిపించాయి. తీరా కొన్ని నెలలు తర్వాత తెలంగాణా విద్యా కమిషన్ అందజేసిన నివేదిక సారాంశం చూస్తే ఉన్న సమస్యలు తాత్కాలికంగా సరిదిద్దే విధంగా సిఫారసులు ఉన్నాయే తప్ప మొత్తం విద్యారంగం సంస్కరణ దిశగా లేవు.

మధ్యాహ్న భోజనం మెనూ, బిల్లులను వారం వారం చెల్లింపు, రెసిడెన్షియల్ పాఠశాలలలో స్నాక్స్ సిఫారసుతో పాటు, ప్రైవేటు విద్యా సంస్థలకు సంబంధించిన ఫీజుల నియంత్రణ, వాటి అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీల ఏర్పాటు వరకు కమిషన్ సిఫారసు చేసింది. అంటే– ఉన్న సమస్యల్లో తక్షణ సమస్యకు పరిష్కారం చూపిందే తప్ప, కీలకమైన నిర్ణయాల జోలికి వెళ్ళలేదని అర్థమవుతూంది. ప్రభుత్వ విద్యాసంస్థల పనితీరు మెరుగుపర్చడం; ప్రభుత్వ పాఠశాలలలో ఎన్‌రోల్మెంట్ ప్రక్రియ; అనేక రకాల యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు ఒకే క్యాచ్‌మెంట్ ఏరియాకు తేవడం; విద్యాహక్కు చట్టం అమలు; పరీక్ష విధానం; తెలంగాణలో అడుగంటుతున్న విద్యా ప్రమాణాలు; వెనుకబడిన విద్యార్థుల విద్యాబోధన... ఇలాంటి కీలక నిర్ణయాల జోలికి వెళ్ళాలనే ప్రయత్నం చేసినట్లు లేదు.



> తెలంగాణా విద్యా కమిషన్ అందజేసిన నివేదిక సారాంశం చూస్తే ఉన్న సమస్యలు తాత్కాలికంగా సరిదిద్దే విధంగా సిఫారసులు ఉన్నాయే తప్ప మొత్తం విద్యారంగం సంస్కరణ దిశగా లేవు.

మధ్యాహ్న భోజనం విషయంలో కమిషన్ సిఫారసు కొత్తదేమీ కాదు! అనేక ఏళ్ళుగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు చేస్తున్న డిమాండ్లనే కమిషన్ ప్రభుత్వానికి సూచనగా నివేదించింది. ఇక ప్రైవేటు విద్యా సంస్థలలో ట్యూషన్ ఫీజులు తప్ప ఇతరత్రా ఫీజులు వసూలు చేయకుండా నియంత్రించేందుకు రాష్ట్ర స్థాయిలోనూ జిల్లా స్థాయిలోనూ కమిటీలు వేయాలన్న సూచన, దాన్ని అమలుపరిచే యంత్రాంగ సూచన కూడా అరకొర సంస్కరణ రూపంగానే ఉంది. మళ్ళీ ప్రైవేటు విద్యా వ్యవస్థ నియంత్రణ కమిటీలు అని చెప్పి నామినేటెడ్ పదవుల పందేరం జరిగి, ప్రైవేటు స్కూల్ అనుయాయులకే ఈ పదవులు కట్టబెడితే ఆ సిఫారసు మూలంగా ప్రభుత్వానికి గానీ, ప్రజలకు గానీ ఒరిగేదేమీ ఉండదు. ప్రైవేటు విద్యాసంస్థల్లో భాగస్వామ్యం లేని విద్యారంగ ప్రముఖులు, సామాజిక సేవకులతో రాజకీయాలకు అతీతంగా ఈ కమిటీలు వేసినప్పుడు మాత్రమే కమిషన్ సిఫారసులు ఎంతోకొంత సజావుగా అమలు జరిగే అవకాశం ఉంది. వీటన్నింటికి మించి సమగ్ర శిక్షా అభియాన్ క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి ఆయా ఆవాస ప్రాంతాలలో ఉన్న ప్రైవేటు పాఠశాల రవాణా సౌకర్యాలు నిషేధిస్తే తప్ప విద్యావ్యవస్థ పూర్తి సంస్కరణ దిశగా పయనించదు.

ఇకపోతే గ్రామీణ ప్రాంతాల్లో ఎకరాలకు ఎకరాల విలువైన స్థలాలు, పాఠశాల భవనాలు ఉన్నప్పటికీ సరైన సంఖ్యలో విద్యార్థుల నమోదు లేదు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్న గురుకులాలలో సరైన బోధనా సిబ్బంది లేదు. తెలంగాణ విద్యా కమిషన్ ఈ రెండు వ్యవస్థలలో సమతౌల్యం కాపాడే సిఫారసులు చేస్తే బావుండేది. అనేక ఏండ్లుగా విద్యా బాధ్యతల నుండి వైదొలగుతూ వచ్చిన పాలకులు ప్రభుత్వ విద్యావ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ప్రైవేటు విద్యా వ్యవస్థను ప్రోత్సహించారు. దాని అత్యున్నత రూపమే ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇప్పటికే ఉచితాల ఊబిలో లక్షల కోట్లు అప్పు చేసిన పాలకులు ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కూడా అనేక ఏళ్ళుగా పెండింగ్‌లో పెట్టడంతో ఇంటర్మీడియట్ స్థాయి నుండి పీజీ స్థాయి వరకు ప్రైవేటు విద్యా వ్యవస్థ తెలంగాణా రాష్ట్రంలో కుప్పకూలింది. ఇక విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌నే ప్రభుత్వ కళాశాలలకు గ్రాంట్లుగా ఇవ్వగలిగితే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు పూర్వ వైభవం సంతరించుకొనే అవకాశం ఉంది.

తెలంగాణా విద్యా కమిషన్ ఇటీవల కార్పోరేట్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల బలవన్మరణాలు గురించి పరిశోధించాల్సిన అవసరం ఉంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో మరో దారుణమైన స్థితి ఏమంటే– ప్రభుత్వం సరైన నిర్మాణం లేని ఇంజనీరింగ్ కళాశాలల బిల్డింగులను అద్దెకు తీసుకుని గురుకులాల పేరుతో లక్షలాది రూపాయలను అద్దెల రూపంలో ఈ బిల్డింగ్ యజమానులకు ప్రతి నెలా చెల్లిస్తున్నది. దీనికి బదులు విశాలమైన స్థలం, ప్రాంగణాలు, బిల్డింగ్ సౌకర్యాలు పూర్తిగా ఉన్న, పెద్దగా పిల్లలు లేని సమీప ప్రభుత్వ పాఠశాల భవనాల లోనికి ఈ గురుకుల పాఠశాలలను మార్చి భారం దించుకోవచ్చు గదా? ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న వేలాది పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలపోతున్నాయి. వాటిని బలోపేతం చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఏకలవ్య, నవోదయ, సైనిక, స్పోర్ట్స్ ఇలా ఓ ఇరవై రకాల పాఠశాల వ్యవస్థలను వివిధ పేర్లతో పెంచి పోషించడం ఎందుకు? ఈ అన్నిరకాల పాఠశాలల్లో ఒకే రకమైన సిలబస్ అయినప్పుడు విద్యకు కుల మతాల రంగులు అవసరమా?

"ఒక దేశ భవిష్యత్ తరగతి గదిలో రూపుదిద్దుకుంటుంది" అన్న రజనీ కోఠారీ మాటల్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకొని, ఆ దిశగా విద్యా రంగంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు గాని, తెలంగాణా విద్యా కమిషన్ సిఫారసులు గానీ ఉండాలని ఆకాంక్షిద్దాం.

• ఎస్. తిర్మల్
సామాజిక కార్యకర్త

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

వర్ణరహిత సమాజంతోనే సమతాభారతి

కులవ్యవస్థ నశించిపోవాలనీ, ఆ మార్పు ద్వారా సమసమాజ స్థాపన జరగాలనీ, సామాజికన్యాయం సిద్ధించాలనీ ఉపన్యాసాలివ్వటం ఒక పెద్ద రాజకీయ మోసం. ఎందుకంటే కులం పుట్టింది వర్ణం వల్ల. వర్ణం పోనిదే కులం పోదు. సంస్థాగత వివక్షను తొలగిస్తే హిందూమతం ఉత్తమమైనదని ఒప్పుకోవటంలో సెక్యులరిస్టులకు కూడా అభ్యంతరం ఉండకపోవచ్చు. సంస్థాగత వివక్ష అంటే వర్ణవ్యవస్థ, దానివల్ల ఉద్భవించిన కులవ్యవస్థ.

చాతుర్వర్ణ వ్యవస్థలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనబడే నాలుగు వర్ణాల సోపాన క్రమం గురించి అందరికీ తెలుసు. ఈ క్రమానుగత శ్రేణికి బాహ్యులు, అంటే వర్ణబాహ్యులు, పంచములు– వీరు అంటరానివారు. శూద్రుల వృత్తిహక్కు క్షుద్రవృత్తులకే పరిమితం. పంచముల వాటాకు ఉన్నది హీన వృత్తులు. శూద్రవర్ణం విధి పైమూడు వర్ణాలవారికి సేవలు చెయ్యటం. ఇది సంస్థాగత వ్యవస్థ. సేవా వర్ణానికి పటిష్టమైన, మార్చుకోవీలులేని వృత్తి విభజన చాలా అవసరం. లేకపోతే, ఉదాహరణకు బట్టలుతకటం తేలికైన పని అయితే అందరూ ఆ వృత్తినే కోరుకుంటారు. కులాలున్నది శూద్రులూ, పంచముల్లోనే. వాటికి పైనున్న మూడూ కులాలు కాదు, వర్ణాలు. కాబట్టి హేతుబద్ధమైన వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ అనే అవ్యవస్థగా ఎవరి కుట్రవల్లో మార్పు చెంది హిందూమతానికి లేని కళంకం తెచ్చిపెట్టిందని ఎవరూ గుండెలు బాదుకోనక్కరలేదు. వర్ణవిభజనలోనే కులవిభజన మిళితమై ఉంది. అసలు వర్ణవిభజన లక్ష్యమే అది. శూద్రవర్ణం వృత్తిసమూహాలుగా విభజించటానికే ఏర్పాటు చేయబడింది. పంచములూ అంతే.

కులరహిత సమాజం అనటం ఎందుకు రాజకీయ మోసమో చూద్దాం. కులం నశిస్తే శూద్రులు శూద్రుల్లోనూ, పంచములు పంచముల్లోనూ – అంటే ఎవరి వర్ణంలో వాళ్ళు – పరస్పరం సమానులౌతారు. కానీ వర్ణవ్యవస్థలో అట్టడుగునే ఉంటారు. వర్ణవ్యవస్థ పటిష్టంగానే ఉండి, కులవ్యవస్థ మాత్రం నశిస్తే సంస్థాగత వివక్ష అలాగే ఉంటుంది. కనుక సామాజికన్యాయం కావాలనే సంస్కరణాభిలాషులకు ఒక మనవి ఏమిటంటే–మీ లక్ష్యం వర్ణరహిత సమాజం కావాలి, కులరహిత సమాజం కాదు. వృత్తిరహిత సమాజం ఎలాగూ ఉండదు.

హిందూమతంలో సంస్థాగత, వివక్షాభరిత వర్ణ సోపానక్రమం తొలగించి, మతాంతరీకరణ చట్టాలకు లోబడి, అన్యమతస్థులు సనాతనధర్మంలో చేరటానికి అవకాశం కల్పిస్తే సమతాభారతి సిద్ధించటానికి గట్టి పునాది పడుతుంది. కానీ, ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆర్థిక అసమానతలు తొలగకుండా సామాజిక అసమానతలు తొలగవు. అందువల్ల మన విధానాలు సామాజిక సంస్కరణలకూ, ప్రజలకు ఆర్థిక అవకాశాలు కల్పించటానికీ మధ్య సమతూకంగా ఉండాలి.

– కొమ్మన పట్టాభిరామయ్య

'కోనేరు' కమిటీ నేటికీ ఆచరణీయమే!

పేదలకు భూములను పంచడం అనేది నాడు స్వాతంత్ర్య పోరాటంలోని అనేక అంశాలలో ఒకటి. స్వాతంత్ర్యం రాకముందు భూములన్నీ భూస్వాములు, జమీందారులు, జాగీర్దారులు, దొరలు... ఈ ఫ్యూడల్స్ అధీనంలో ఉన్నాయి. బ్రిటిష్ పాలన ముగిసిన తర్వాత అన్ని జాగీర్లు రద్దు అయినప్పటికీ భూములు వాళ్ళ అధీనంలోనే ఉండిపోయాయి. బెంగాల్ కరువును దృష్టిలో పెట్టుకొని భారతదేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులు పెంచాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ చట్టం తెచ్చింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా జమీందార్లు కోర్టును ఆశ్రయించారు. ఆస్తి హక్కు ప్రాథమిక హక్కులలో ఆర్టికల్ 31లో పొందుపరచబడి ఉన్నందున కోర్టు తీర్పు భూస్వాములకు అనుకూలంగా వెలువరించింది. ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేస్తూ ఆర్టికల్ 31లో ఉన్న ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించింది. ఆస్తి అనేది కేవలం చట్టపరమైన హక్కుగా సవరణ చేసి ఆర్టికల్ 300ఏ లో పొందుపరిచింది. దీనిని 9వ షెడ్యూల్‌లో చేర్చారు.

1950 నుండి నాలుగు ఐదు దఫాలుగా చట్ట సవరణ జరిగి చివరకు 1973లో తీసుకురాబడిన భూ సంస్కరణల చట్టం ద్వారా– ఐదుమంది సభ్యులు ఉన్న కుటుంబానికి తరి గరిష్ఠంగా 27 ఎకరాలకు, ఖుష్కి 54 ఎకరాలకు పరిమితం చేసింది. అయినప్పటికీ భూస్వాములు ఎన్నో తప్పుడు లెక్కలు బినామీల పేర్లను రాయించి భూములన్నీ వాళ్ళ దగ్గరే ఉండేలా పైరవీలు చేసారు. ఆ రోజులలో ప్రభుత్వాలకు రెవెన్యూ రాబడులు భూమి కేంద్రంగా ఉండడం వలన భూములపై విధించిన పన్నులు కట్టలేక పేద, వెనుకబడిన కులాల వారు భూములకు యజమానులు కాలేకపోయారు.


వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు భూములు పంచమని భారతదేశంలోని కమ్యూనిస్టు ఉద్యమాలు భూమి కేంద్రంగానే ముందుకు సాగాయి. భూ పంపిణీ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు నడిచాయి. ఎమర్జెన్సీ తరువాత వచ్చిన హక్కుల ఉద్యమాలు, ఆయా హక్కుల సంఘాలు కూడా కొంచెం ఆలస్యంగా అయినా భూమిని పంపిణీ చేయాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అప్పటి నక్సలైట్లతో జరిగిన చర్చల ఫలితంగా, భూ సమస్యలు పరిష్కరించడానికి 2004 డిసెంబర్ 23వ తేదీన ఎనిమిది మందితో కూడిన ఒక అధ్యయన కమిటీని నియమించింది. అందులో ఇద్దరు మంత్రులు, ఒక మాజీ ఐఏఎస్ అధికారి, ముగ్గురు అనుభవజ్ఞులైన సీనియర్ ఐఏఎస్ అధికారులు, కొంత మంది సీనియర్ స్థాయి అధికారులు నియమితులయ్యారు. వీరు అందుబాటులో ఉన్న భూములను పరిశీలించి సూచనలు చేయాలి. వీరిలో ఒకరు పురపాలక శాఖ మంత్రి కోనేరు రంగారావు. ఈ కమిటీకి కోనేరు రంగారావు కమిటీగా నామకరణం చేశారు.

కోనేరు రంగారావు కమిటీ క్షేత్రస్థాయి అధ్యయనం చేసి 2006 చివరలో ఫైనల్ రిపోర్ట్ అందజేసింది. అక్టోబర్ 6, 2007న మొదటి సర్క్యులర్ జారీ అయింది. నివేదికను బయట పెట్టమని విపక్షాలు, వామపక్షాలు, ప్రజా సంఘాలు, రైతుల నాయకులు ఆందోళనలు చేశారు. చివరకు అందులోని 104 అంశాలలో 74 సిఫార్సులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొద్ది రోజుల తర్వాత 2007లో జీవోఎంఎస్ నెంబర్ 1049ను విడుదల చేసింది. వాటి అమలు కోసం మరో కమిటీని వేసింది. దీనికి అనుగుణంగా కింది స్థాయిలో పనులు జరగటానికి ఎన్నో జీవోలు, మెమోలు, సర్క్యులర్లు, కార్యనిర్వాహక ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ కమిటీ నివేదికలో ప్రధానంగా 12అంశాల మీద అధ్యయనాలు ఉన్నాయి. ఇనాం భూములు, భూమి హక్కుల రికార్డులు, నివాస స్థలాలు, భూసేకరణ, టెనెంట్ భూములు, ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు, ఆదివాసీల భూములు, కౌలు రైతులకు సంబంధించి ఋణ అర్హత కార్డులు, సాదా బైనామాలు, ఇవన్నీ భూమిలేని వారికి భూములు పంచేలా చేయడానికి తీసుకోబడిన నిర్ణయాలు. ముఖ్యంగా గిరిజనుల భూములు గిరిజనేతరులు కొనకుండా సూచన చేసింది. గిరిజనులకు వ్యతిరేకంగా పోలీసుల జోక్యం ఉండరాదని తెలిపింది. ల్యాండ్ ట్రిబ్యునల్ ద్వారా స్వాధీనం చేసుకున్న భూములను వెంటనేపంచాలని ఆదేశాలు జారీచేసింది. ఇట్టి విషయంలో భూస్వాములు కోర్టుకు వెళ్లి ఎలాంటి ఉత్తర్వులు తీసుకోక ముందే భూ పంపిణీ చేసి వారికి పట్టాలు జారీచేసి రికార్డులలో నమోదు చేసేలా చూడమంది. వారికి పట్టాదారు పాసుపుస్తకాలు టైటిల్ డీడ్స్ ఇవ్వమని ఆదేశాలు జారీ చేసింది. ఆ పాస్ పుస్తకాలకు జిల్లాల వారి కోడ్ నెంబర్లు ఇచ్చి ఎలాంటి నకిలీ పాస్ పుస్తకాలు రాకుండా చూడమని సిఫారసు చేసింది. ఎన్ని సూచనలు చేసినప్పటికీ 48శాతం భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

భూ సేకరణ చట్టం ద్వారా సేకరించిన భూములు భూ సేకరణ పూర్తయిన మూడు సంవత్సరాల లోపు ప్రభుత్వం వినియోగించకపోతే ఆ భూములను తిరిగి భూమి యజమానులకు ఇవ్వమంది. పేదలకు ఇచ్చిన అసైన్మెంట్ పట్టా భూముల చట్టం 9/77ను యధాతథంగా అమలు చేయమని కమిటీ సూచించింది. ఈ చట్టాన్ని రాజకీయ నాయకులు, అధికారులు పటిష్ఠంగా అమలు చేయలేదు. దురదృష్టవశాత్తు కొన్ని సవరణలు తెచ్చి అసైన్మెంట్ భూములు కొనుగోలు చేసిన వారికి రెగ్యులరైజ్ చేసే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ భూములలో నిర్మించుకున్న ఇంటిని వారి సామాజిక ఆర్థిక స్థాయిని నిర్ణయించి వారికి ఇళ్ళ పట్టాలు జారీ చేసి న్యాయం చేసేలా చూడమని సిఫారసు చేసింది.

> కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు అన్నీ పారదర్శకత కలిగినవి, సమర్థమైనవి. తెలుగు రాష్ట్రాలలో ఇప్పుడు కూడా అమలుపరచడానికి ఆస్కారం ఉన్న ఒక ప్రగతిశీలమైన నివేదిక అది. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం అమలులుకు కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను గమనంలోకి తీసుకొని ముందుకు వెళితే బాగుంటుంది.



కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఒత్తిడి ఎక్కువైన ప్రతిసారి ప్రభుత్వం ఒక జీవో ఇస్తూ వచ్చింది. కమిటీ ఎన్నో మంచి సూచనలు చేసింది. కానీ రాజకీయ నాయకుల సంకల్పం అధికారుల చిత్తశుద్ధి కొరవడింది. అంతర్జాతీయ ప్రమాణాలు, శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం ఐదు మందితో కూడిన కుటుంబానికి మూడు ఎకరాల భూమి సరిపోతుందనే సూచనలను కమిటీ పరిగణనలోకి తీసుకుంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు విడతలుగా భూ పంపిణీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల భూమిని వాగ్దానం చేసింది. కానీ, గత ప్రభుత్వం భూమిని పంచలేదు. హైదరాబాద్ చుట్టూ ఉన్న చాలా విలువైన భూములను అమ్మి కొన్ని వేల కోట్లు ఖజానాకు రాబట్టగలిగింది.

తెలుగు రాష్ట్రాలలో ప్రజలకు మేలు చేయగలిగిన కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు అన్నీ పారదర్శకత కలిగినవి, సమర్థమైనవి. ఉమ్మడి రాష్ట్రాలలో ఇప్పుడు కూడా అమలుపరచడానికి ఆస్కారం ఉన్న ఒక ప్రగతిశీలమైన నివేదిక అది. రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తగు సూచనలతో కూడిన జీవోలను విడుదల చేయాలి.

ధరణి పోర్టల్ కారణంగా ఏ తప్పూ చేయని రైతులు వారి పట్టా భూముల విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ పరిష్కారం దొరుకుతుందని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారు. ఈ ప్రభుత్వం భూ భారతి పేరుతో మరో చట్టం తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టం అమలులుకు కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను గమనంలోకి తీసుకొని ముందుకు వెళితే బాగుంటుంది.

■ వి. బాలరాజు
రిటైర్డు తహసిల్దారు



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.2 కనిష్ఠం 20.4

సాంకేతికతే మంత్రం..
ఆరోగ్యమే లక్ష్యం!
ముగిసిన
బయోఆసియా సదస్సు

8

గండిపేట జలాశయానికి
105 ఏళ్లు
మూసీనదిపై 1920లో
ఆనకట్ట నిర్మాణం

ఓం నమో రుద్రాయ..

మహాశివరాత్రి నేపథ్యంలో శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువ జామునే ఆలయాలకు పోటెత్తారు. వైఎంసీఏ గణేష్ ఆలయం, హెచ్ఎంటీ హిల్స్ కాలనీ, కొత్తపేట భవానీమాత, అలకాపురి శివాలయం తదితర దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కూకట్‌పల్లి దీనబంధు కాలనీలోని ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు శివలింగాలను పాలతో అభిషేకం చేసి పూజలు నిర్వహించారు.



వైఎంసీ గణేష్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తురాలు





అలకాపురి కాలనీలో నంది కొమ్ముల నుంచి శివుడిని చూస్తున్న మహిళ



హెచ్ఎంటీ హిల్స్ కాలనీలో భక్తుల రద్దీ



కూకట్‌పల్లి దీనబంధు కాలనీలో శివపార్వతుల కల్యాణం

కొత్త రేషన్ కార్డులకు అర్హులు

29వేల మంది

- మీసేవ ద్వారా 1.2 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీకి హైదరాబాద్ జిల్లా పరిధిలో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, ఇటీవల చేపట్టిన కులగణన సమయంలో వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. వీటిలో హైదరాబాద్ పరిధిలో 29 వేల మంది అర్హులున్నట్లు గుర్తించామని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వీటితోపాటు మీసేవ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు జిల్లా పరిధిలో 1.2 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లా పరిధిలో 70 వేల నుంచి 80 వేల మంది అర్హులు ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. మార్చి 1 తర్వాత ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఆ దిశగా జీహెచ్ఎంసీ, పౌరసరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఈవోడబ్ల్యూకు ఏడాది పూర్తి

- ఆర్థిక మోసాల ఛేదనకు రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రత్యేక పీఎస్
- రూ. 4 వేల కోట్ల విలువగల మోసాలను వెలుగులోకి తెచ్చిన వైనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేయడానికి, ఘరానా నేరగాళ్లను కటకటాల్లోకి నెట్టడానికి రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవోడబ్ల్యూ(ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్)కు ఏడాది పూర్తయింది. ఈ విభాగానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్ హోదా లభించింది. స్టేషన్ హోదాకు తగ్గట్టుగా సీపీ అవినాష్ మహంతి ప్రత్యేక పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. కమిషనరేట్ పరిధిలో రూ. 3కోట్లకు పైబడిన ఆర్థిక మోసం కేసులను ఈవోడబ్ల్యూ నమోదు చేసి దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. బాధితులు ఎక్కువమంది ఉండి, కేసు ఇన్వెస్టిగేషన్‌లో స్థానిక పోలీస్టేషన్‌లో ఇబ్బందిగా ఉండే కేసులను సైతం సీపీ ఆదేశాలతో ఈవోడబ్ల్యూ పోలీసులు దర్యాప్తు చేసేలా నిర్ణయించారు. డీసీపీ కె. ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు కేసులను ఛేదిస్తున్నాయి. రూ. 4 వేల కోట్ల విలువగల ఆర్థిక మోసాలను వెలుగులోకి తీసుకొచ్చాయి. వాటిలో ఎక్కువగా చీటింగ్, ఆర్థిక మోసం, భూ దందాలు, ప్రభుత్వ ఆర్థిక వనరులను కాజేయడం, మల్టీలెవల్ మోసాలు ఉన్నాయి.

ఇటీవల వెలుగులోకి వచ్చిన మోసాలు

- ప్రభుత్వ భూమికి నకిలీ ఈ పాస్‌బుక్‌లు సృష్టించి అమ్మకానికి పెట్టిన నిందితులను అరెస్టు చేసిన ఈవోడబ్ల్యూ పోలీసులు రూ. 400 కోట్ల ప్రాపర్టీని కాపాడారు.
- నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని అమ్మకానికి పెట్టి రూ. 200 కోట్లు కొల్లగొట్టిన ఆర్థిక మోసగాళ్లను అరెస్టు చేసి ఆస్తులను కాపాడారు.
- ఓపెన్ ప్లాట్లు, బంగారంపై పెట్టుబడి పెడితే.. బై బ్యాక్ పాలసీ కింద ప్రతీ నెల రిటర్న్లు ఇవ్వడంతో పాటు.. 25 నెలల్లో రెట్టింపు లాభాలు ఇస్తామని, సుమారు 3,600 మందిని మోసం చేసి రూ. 300 కోట్లు కాజేసిన ముఠాను అరెస్ట్ చేశారు.
- ఇటీవల ఫాల్కన్ ఇన్వాయిస్ పేరుతో మల్టీలెవల్ మోసానికి తెరతీసి రూ.1,700 కోట్లు కొల్లగొట్టిన ముఠాలో ముగ్గురిని అరెస్టు చేశారు. ఇవి కేవలం మచ్చుకు కొన్ని మాత్రమే.

కేసులు, అరెస్టయిన నిందితుల వివరాలు

- ఇప్పటి వరకు ఈవోడబ్ల్యూ పోలీసులు నమోదు చేసిన కేసులు - 110
- అరెస్ట్ అయిన మోసగాళ్ల సంఖ్య - 210
- ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన మొత్తం - రూ. 40.77 కోట్లు
- మోసగాళ్ల నుంచి స్వాధీనం చేసుకొని అటాచ్ చేసిన ఆస్తుల విలువ - రూ. 6.10 కోట్లు

వేసవికి ముందే నీటికి కటకట



- ట్యాంకర్లకు భారీ డిమాండ్
- 37 శాతం పెరిగిన వైనం
- నీటి సఫరాలో పదేళ్ల పరిస్థితే

వేసవికి ముందే నీళ్ల కోసం నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో పెద్ద ఎత్తున ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. ట్యాంకర్ల డిమాండ్ 37 శాతం పెరిగినట్టు అధికారులు ప్రకటించారు.

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటడంతో వేసవికి ముందే నీళ్ల కోసం నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద ఎత్తున ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. గతేడాదితో పోల్చితే జనవరి నెలలో 50శాతం వరకు ట్యాంకర్ల డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం వేసవి ప్రారంభానికి ముందే 37శాతం ట్యాంకర్ల డిమాండ్ పెరిగిందని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. వాటర్‌బోర్డు పరిధి జీహెచ్ఎంసీ వరకు ఉండగా.. ఐదేళ్ల క్రితం ఔటర్ రింగ్‌రోడ్డు వరకు పరిధిని విస్తరించారు. అందుకనుగుణంగా నీటి సరఫరాను పెంచలేదు. పదేళ్ల క్రితం పరిస్థితే ఇప్పుడూ ఉంది. ఒక్క ప్రాజెక్టూ చేపట్టలేదు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తుండగా.. శివారు ప్రాంతాలకు మూడు నాలుగు రోజులకోసారి సరఫరా చేస్తున్నారు.

2021 నుంచి..

జీహెచ్ఎంసీ పరిధిలో 9.90 లక్షల నల్లా కనెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం ఔటర్ వరకు విస్తరణ నేపథ్యంలో 13లక్షలకు పైగా ఉన్నాయి. వాటర్ బోర్డు సరఫరా చేసే నీరు సరిపోకపోవడంతో ట్యాంకర్ల కోసం పెద్దఎత్తున బుకింగ్ చేస్తున్నారు. 2021 నుంచి ట్యాంకర్ల డిమాండ్ ప్రతీయేటా 10 నుంచి 15 శాతం పెరుగుతోంది. 2021-22 వరకు ట్యాంకర్ల డిమాండ్ 32శాతం పెరగ్గా.. 2022-23లో 19 శాతం, 2023-24లో 31శాతం, 2024-25లో ఫిబ్రవరి వరకు 37శాతం ట్యాంకర్ల డిమాండ్ పెరిగింది.

ఐదేళ్లుగా పెరిగిన ట్యాంకర్ల డిమాండ్ ఇలా..

సంవత్సరం	జనవరి	ఫిబ్రవరి
2021	52,778	55,175
2022	62,600	72,548
2023	74,870	86,497
2024	81,821	1,12,926
2025	1,19,752	1,50,000 (అంచనా)

వాటర్‌బోర్డు సమాయత్తం

ట్యాంకర్ల డిమాండ్‌ను అధిగమించేందుకు వాటర్‌బోర్డు చర్యలు చేపట్టింది. ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్ల ఏర్పాటుతోపాటు ట్యాంకర్ల సంఖ్య పెంచింది. 2024 జనవరి వరకు 69 ఫిల్లింగ్ స్టేషన్లు ఉంటే.. ఈ ఏడాది మరో పది పెంచారు. ఫిల్లింగ్ పాయింట్లు గతేడాది 93 ఉంటే ఈసారి వాటిని 123కు పెంచారు. ఇక సరఫరా చేసే ట్యాంకర్లు 2024 జనవరిలో 577 ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్యను 907కు పెంచారు. ట్యాంకర్లను బుకింగ్ చేసిన 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నామని, వేసవిలో కూడా ఇదే సమయంలో సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు.

ఒడిశా టు హైదరాబాద్

గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ● ముగ్గురి అరెస్ట్.. 41 కిలోల సరుకు, రూ. 40 లక్షలు స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 41కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి నగరానికి గంజాయి సరఫరా అవుతుందని నార్కోటిక్, మధురానగర్ పోలీసులకు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టారు. వెంగళరావునగర్ నలంద పాఠశాల వద్ద ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒడిశా కొరాపుట్‌కు చెందిన బాలహంతల్ గంజాయిని పలు రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడు. రెండు రోజుల క్రితం నగరానికి గంజాయి తీసుకొచ్చాడు. విక్రయించడానికి కూకట్‌పల్లికి చెందిన బుర్రా శ్రీనివాసులు అలియాస్ వాసు, గోనుగుంట అభిషేక్‌ను సమకూర్చుకున్నాడు. ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయి, రూ. 40 లక్షలు, స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న

8 మందికి పదేళ్ల జైలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న ఎనిమిది మందికి రంగారెడ్డి కోర్టు పదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. సురేష్ శ్యామ్‌రావ్ పవార్, విశాల్ రమేష్ పవార్, బాలాజీ రామ్‌దాస్ వారే, మనోజ్ విలాస్ థోత్రే, ధ్యానేశ్వర్ లాలాసాబ్ దేశ్‌ముఖ్, రామ్‌రాజి చత్రభుజ్ గుంజాలే, అక్షయ్ అనంత్ గాంధీ, సచిన్ దాగడు సనాప్ ముఠాగా ఏర్పడి గంజాయి సరఫరాతోపాటు విక్రయిస్తున్నారు. 2021 ఫిబ్రవరి 24న మూడు కార్లలో 681కిలోల గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరకు నుంచి విశాఖ, హైదరాబాద్ మీదుగా పుణెకు తరలిస్తున్నారు. సమచారం అందుకున్న నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు హయత్‌నగర్ ఔటర్ రింగ్‌రోడ్ వద్ద వారిని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకొని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



ఓఆర్ఆర్

- నానక్‌రాంగూడ ఇంటర్‌చేంజ్ వద్ద తగ్గనున్న ట్రాఫిక్ ఇబ్బందులు
- మార్చిలో ప్రారంభానికి సన్నాహాలు

ఓఆర్ఆర్‌పై కొత్త ఎగ్జిట్

నార్సింగ్ టోల్‌ప్లాజాకు ముందు నిర్మాణం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతుండడంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సూచన మేరకు కొత్త ఎగ్జిట్‌ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) నిర్మిస్తోంది. గచ్చిబౌలి నుంచి నార్సింగ్ వెళ్లే మార్గంలో నార్సింగ్ ఇంటర్‌చేంజ్ ఇరువైపులా రోటరీ వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీన్ని పరిష్కరించేందుకు నానక్‌రాంగూడ ఇంటర్‌చేంజ్ దాటిన తర్వాత నార్సింగ్ టోల్‌ప్లాజ్‌కు ముందు కొత్తగా ఎగ్జిట్‌ను నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు 90శాతం పూర్తయ్యాయి. మార్చిలో దీనిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కోకాపేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద కొత్తగా మరో ఇంటర్‌చేంజ్‌ను కోకాపేట ఓఆర్ఆర్ ట్రంపెట్ పేరుతో నిర్మిస్తున్నారు.

రూ. 70 కోట్లకు కుచ్చుటోపీ

- అధిక వడ్డీ, చిట్టీల పేరుతో వసూలు
- రాత్రికి రాత్రే కుటుంబ సభ్యులతో ఉడాయించిన తాపీమేస్త్రీ



నిందితుడు పుల్లయ్య

అమీర్‌పేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ, చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసి రూ.70 కోట్లకు కుచ్చుటోపీ పెట్టాడో తాపీమేస్త్రీ. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన పుల్లయ్య రెండు దశాబ్దాలుగా దాసారం గుడిసెల సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. ఎస్ఆర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. బీకేగూడ,ఎస్ఆర్ నగర్‌లో 15 ఏళ్లుగా చిట్టీ, ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అధిక వడ్డీ పేరు చెప్పి సుమారు 300 మంది నుంచి రూ. 70కోట్లు వసూలు చేశాడు. డబ్బు కోసం ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఈ నెల 24, 25, 26 తేదీల్లో చెల్లిస్తానని పుల్లయ్య నమ్మించాడు. 23వ తేదీ రాత్రి కారును ఇంట్లోనే వదిలేసి క్యాబ్‌లో కుటుంబ సభ్యులతో ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు బీకే గూడలో అతడి నివాసానికి చేరుకున్నారు. పుల్లయ్య బాధితులు నగరం, గుత్తి, కర్నూల్ జిల్లాలో కూడా ఉన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమయ్యారు.

‘ఇంటర్‌చేంజ్’లపై కసరత్తు

మెట్రో రైల్ రెండో దశ కనెక్టివిటీపై హెచ్ఏఎంఎల్ ప్రత్యేక దృష్టి

- ప్రయాణికులు సులువుగా వెళ్లేందుకు ప్రయత్నాలు
- ఒక స్టేషన్‌లో దిగి.. మరో స్టేషన్‌కు వెళ్లకుండా చర్యలు
- అమీర్‌పేట్‌లో మాదిరిగా ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో దశ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్టేషన్ల ఏర్పాటు, ఎలివేటెడ్ కారిడార్, ఎట్‌గ్రేడ్ (భూమిపై రైలు వెళ్లే మార్గం) అంశాలపై అధ్యయనం చేసేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. కేంద్రానికి పంపించిన పార్ట్-ఏ కారిడార్ల డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)కు ఆమోదం లభించేలోగా వివిధ రకాల పనులను పూర్తి చేస్తున్నారు. వేర్వేరు కారిడార్లలో రైలు ఎక్కిన వారు దూర ప్రాంతాలకు వెళ్తున్న సమయంలో మధ్యలో స్టేషన్ దిగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కేవలం రైలు మాత్రమే మారే విధంగా ఇంటర్‌చేంజ్ లను డిజైన్ చేస్తుండడం ఆసక్తికరంగా మారింది. పార్ట్-ఏ కింద నాగోల్- శంషాబాద్ ఎయిర్‌పోర్టు (36.8 కిలోమీటర్లు), రాయదుర్గ్-కోకాపేట్ నియోపోలీస్ (11.6 కిలోమీటర్లు), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కిలోమీటర్లు), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కిలోమీటర్లు), ఎల్‌బీనగర్-హయత్‌నగర్ (7.1 కిలోమీటర్లు) ప్రతిపాదించారు. పార్ట్-బీ కింద శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫోర్త్‌సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 40 కిలోమీటర్లు, జేబీఎస్-మేడ్చల్ (24 కిలోమీటర్లు), జేబీఎస్-శామీర్‌పేట్ (21 కిలోమీటర్లు) వరకు నిర్మించాలని భావిస్తున్నారు. పార్ట్-ఏలోని 5 కారిడార్లకు సంబంధించిన డీపీఆర్ నాలుగు నెలల క్రితమే కేంద్రానికి పంపించగా.. పార్ట్-బీలోని మూడు కారిడార్లపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. రెండో దశలోని వివిధ స్టేషన్లను కూడా అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్ లాగా అభివృద్ధి చేస్తే దాదాపు 40-50 కిలోమీటర్ల వరకు స్టేషన్ దిగకుండా ప్రయాణించే అవకాశం ఏర్పడుతోంది.

పలుచోట్ల స్కైవాక్‌లు

స్టేషన్‌కు స్టేషన్‌కు మధ్యలో తక్కువ దూరం ఉంటే వాటి మధ్య స్కై వాక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌లో భాగంగా నాగోల్, నాగోల్ క్రాస్‌రోడ్డు వద్ద రెండు స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండింటి మధ్యలో తక్కువ దూరం ఉండడంతో ప్రయాణికుల సౌకర్యార్థం స్కైవాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట కారిడార్‌లో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ స్టేషన్ల నుంచి ఆయా ప్రదేశాలకు వెళ్లే పర్యాటకుల కోసం స్కైవాక్‌లను నిర్మించాలని భావిస్తున్నారు.

ఐదుచోట్ల ఇంటర్‌చేంజ్ స్టేషన్లు

మొదటి దశ మెట్రోతో రెండో దశ మెట్రో మార్గాలను అనుసంధానం చేయాలంటే ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్ల నిర్మాణం తప్పనిసరి. జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట రెండు మెట్రో మార్గాలను ఒక ఇంటర్‌చేంజ్ స్టేషన్‌గా నిర్మిస్తుండగా, రెండో ఇంటర్‌చేంజ్ స్టేషన్‌ను చాంద్రాయణగుట్ట చౌరస్తాలో.. నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌ను కలుపుతూ నిర్మించనున్నారు. మూడోది ఎల్‌బీనగర్ చౌరస్తాలో రెండు మెట్రో కారిడార్లను కలుపుతూ ప్లస్ (+) ఆకారంలో చేపట్టనున్నారు. 4వ ఇంటర్‌చేంజ్ స్టేషన్‌ను రాయదుర్గం వద్ద, ఐదవది శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని కార్గో టెర్మినల్ వద్ద నిర్మించేందుకు మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నారు.



అమీర్‌పేట మెట్రోస్టేషన్

పట్టణాభివృద్ధిపై నేపాల్ ప్రజాప్రతినిధులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న నేపాల్ ప్రజాప్రతినిధులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌కు చెందిన పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులకు బుధవారం శిక్షణ ప్రారంభమైంది. 10 రోజులపాటు పట్టణాభివృద్ధిపై రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో నిర్వహించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మును మహావర్ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్-నేపాల్ దేశాల మధ్య బలమైన భాగస్వామ్యం ఉందన్నారు. ఉద్యానవనం, మురుగునీరు, పట్టణ వ్యర్థాల నిర్వహణ, పర్యావరణం, పర్యాటకం గురించి శిక్షణలో వివరిస్తామని ఎన్ఐఆర్‌డీపీఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజన్‌కుమార్ తెలిపారు. రిజిస్ట్రార్ మనోజ్‌కుమార్, నేపాల్‌లో పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు, మేయర్లు, చైర్ పర్సన్‌లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పాస్ ఉన్నా ఫుల్ చార్జీనే!

- నిరుపయోగంగా టీజీఎస్ ఆర్టీసీ రాయితీ పాస్‌లు
- రాయితీ ఎలా అమలు చేయాలో తెలియదంటున్న సిబ్బంది
- టిమ్స్ యంత్రాల మీద నెపం
- పూర్తి చార్జీలు వసూలు చేసే టికెట్ జారీ
- ప్రశ్నిస్తే వాగ్వాదం.. బస్సు దిగమంటూ హుకుం
- కొన్ని బస్సుల్లో అధిక చార్జీల వసూలు
- పట్టించుకోని టీజీఎస్ ఆర్టీసీ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన రవి పది రోజుల క్రితం బెంగళూరు వెళ్లేందుకు తనకు సమీపంలోని బస్టాండ్‌కు వెళ్లాడు. టీజీఎస్ ఆర్టీసీకి చెందిన ఏసీ స్లీపర్ బస్సు ఎక్కాడు. టికెట్ ధరపై రాయితీ పొందేందుకు టీజీఎస్ఆర్టీసీ తనకు జారీ చేసిన పాస్‌ను.. ఆ బస్సులో టికెట్లు జారీ చేస్తున్న డ్రైవర్‌కు రవి చూపించాడు. అయితే, ఈ బస్సుకు రాయితీ పాస్‌లు పని చేయవని కాసేపు.. టిమ్స్ యంత్రంలో రాయితీ ఎలా అమలు చేయాలో తనకు తెలియదని కాసేపు చెప్పిన ఆ డ్రైవర్ చివరికి సాధారణ చార్జీ వసూలు చేసి టికెట్ చేతిలో పెట్టాడు. దీంతో రవికి ఉన్న రాయితీ పాస్ నిరుపయోగం అయింది. రవి మాత్రమే కాదు.. టీజీఎస్ ఆర్టీసీ నుంచి రాయితీ పాస్‌లు పొందిన చాలా మంది తమ ప్రయాణాల్లో ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, స్వచ్ఛంద సంస్థలు, అమరవీరులు, జర్నలిస్టులు, కిడ్నీ రోగులకు ఆర్టీసీ రాయితీ పాస్‌లు జారీ చేస్తోంది. పాస్‌లు ఉన్న వారికీ వారి జిల్లాల పరిధిలోని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో అయితే టికెట్ ధరలో 50-60శాతం దాకా రాయితీ ఇస్తారు. ఈ రాయితీలకు సంబంధించిన సొమ్మును ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. పాస్‌లు చూపిస్తున్నా రాయితీని వర్తింపజేసేందుకు టికెట్ ఇష్యూ మిషన్ల (టిమ్స్)లో ఆప్షన్లు తమకు తెలియవని పూర్తి చార్జీ చెల్లించే టికెట్ తీసుకోవాలని టికెట్లు జారీ చేసే కండక్టర్లు/డ్రైవర్లు తెగేసి చెబుతున్నారు. ఈ బస్సుకు పాస్ వర్తించిందనీ కొందరు చెబుతున్నారు. దీంతో రాయితీ అంశంలో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది మధ్య వాగ్వాదాలు జరిగిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌ల్లోని అధికారులు వచ్చి డ్రైవర్లు, కండక్టర్లకు నచ్చజెప్పితే తప్ప రాయితీ లభించని పరిస్థితులు నెలకొన్నాయి. టీజీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి.. పాస్‌ల అంశంలో కండక్టర్లు, డ్రైవర్లకు అవగాహన కల్పించాలని, టిమ్స్ యంత్రాల ద్వారా రాయితీని ఎలా వర్తింప జేయాలో నేర్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

నిర్ణీత ధర కంటే అధిక మొత్తం వసూళ్లు !

రాయితీల సంగతి ఇలా ఉంటే కొన్ని బస్సుల్లో సాధారణ ప్రయాణీకులు కూడా దోపిడికి గురవుతున్నారు. ఆర్టీసీ నిర్ణయించిన టికెట్ ధర కంటే అధిక మొత్తాన్ని పలువురు కండక్టర్లు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లేందుకు ఇటీవల ఎల్‌బీనగర్‌లో బస్సు ఎక్కిన తమ వద్ద నుంచి ఒక్కొక్కరికి రూ.523కు బదులుగా రూ.600 చొప్పున అదనపు చార్జీని డ్రైవర్ వసూలు చేశాడని ఆరుగురు ప్రయాణీకులు ఆరోపించారు. తాము ఇదేమని అడిగితే.. మిమ్మల్ని ఇక్కడ ఎక్కించుకోవడమే ఎక్కువ.. వెళ్లి కూర్చోండి లేదంటే దిగిపొండి అని డ్రైవర్ దురుసుగా బదులిచ్చాడని వారు వాపోయారు. ఇదేకాదు.. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా టికెట్ల జారీ అంశంలోనూ పలు బస్సుల్లోని సిబ్బంది ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఆయా సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్

సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ వెబ్‌సైట్

- ప్రారంభించిన తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టులో ఏర్పాటు చేసిన ఏసీ హాల్‌ను, అధికారిక వెబ్‌సైట్‌ను తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ బుధవారం ప్రారంభించారు. సిరిగ్రూప్ సీఈవో విజయ్ కుమార్‌రెడ్డి సహకారంతో న్యాయవాదులు చర్చలు నిర్వహించుకునేందుకు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అధునిక సదుపాయాలతో ఏసీ హాల్‌ను నిర్మించారు. అంతేకాకుండా ప్రస్తుతం అందుబాటులోకి తెచ్చిన తెలంగాణ సిటీ సివిల్ కోర్ట్ వెబ్‌సైట్ ద్వారా కోర్టు నిర్వహణ, వాయిదాల తేదీ తదితర అంశాలను అధికారికంగా తెలుసుకోవచ్చని సిటీ సివిల్ కోర్టుబార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

భక్తిభావం పెంపొందినప్పుడే సమాజంలో శాంతి : కేంద్రమంత్రి

- అఖండ జ్యోతియాత్రను ప్రారంభించిన కిషన్‌రెడ్డి
- మార్చి 1 యాదగిరిగుట్టలో యాత్ర ముగింపు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆధ్యాత్మిక భావన పెంపొందించడానికి అఖండ జ్యోతియాత్ర దోహదపడుతుందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని యాదాద్రి భవన్ వద్ద మహాశివరాత్రి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి 31వ అఖండ జ్యోతియాత్రను.. అఖండ జ్యోతియాత్ర చైర్మన్ సద్ది వెంకటరెడ్డి, యాదాద్రి శాశ్వత ఫౌండర్ బి.నర్సింహమూర్తి, అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రావు, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులతో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 31 ఏళ్లుగా అఖండ జ్యోతియాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తిభావం పెంపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని, ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుస్తారని అన్నారు. అఖండ జ్యోతియాత్ర కమిటీ చైర్మన్ ఎస్.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ యాత్ర నగరంలోని ముషీరాబాద్, ఉప్పల్, మేడిపల్లి, నారాపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి మీదుగా మార్చి 1న యాదగిరిగుట్టకు చేరుకుంటుందన్నారు. అఖండ జ్యోతి యాదాద్రీ ఆలయ అధికారులకు అప్పగిస్తామని ఆ తర్వాత వైష్ణవ సమాఖ్య కార్యాలయం వద్ద వేదఘోష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖండజ్యోతి యాత్ర కమిటీ వైస్ చైర్మన్ ఎంఎన్ ధరణి. గౌరవ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు మారం లక్ష్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి ఎస్‌పి. ఉపేందర్‌రావు, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్ కుమార్, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, ఎక్కాల నందు. నందకిషోర్ యాదవ్, చిట్టి శ్రీధర్, సుబాష్‌పటేల్, క్షీరసాగర్, అరవింద్ పాల్గొన్నారు.



యాదాద్రి భవన్ వద్ద అఖండ జ్యోతియాత్రను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి

అనంతగిరికి అందాల భామలు!

- మేలో హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీలు

వికారాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను వివిధ దేశాల అందాలభామలు సందర్శించనున్నారు. పచ్చని చెట్లు.. చుట్టూ ఎత్తయిన కొండలు, లోతైన వంపులతో చూడగానే మనసు ఝుమరిచిపోయే ప్రకృతి సౌందర్యానికి నిలయమైన అనంతగిరి కొండల అందాలను ఆస్వాదించనున్నారు. మే నెలలో హైదరాబాద్ వేదికగా జరగనున్న మిస్‌వరల్డ్ పోటీలకు వివిధ దేశాల నుంచి సుందరీమణులు హాజరుకానున్నారు. ప్రపంచ నలుమూలల నుంచి సుందరీమణులు పాల్గొనే మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణలోని పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పర్యావరణ పర్యాటక కేంద్రం (ఎకో టూరిజం)గా అనంతగిరిని అభివృద్ధి పరచాలన్న సంకల్పంతో ఉన్న ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులతో పాటు ఆయా దేశాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులను అనంతగిరి కొండలకు తీసుకువచ్చి వారు ఇక్కడి పర్యావరణ అందాలను ఆస్వాదించే అవకాశం కల్పించనున్నారు. ఈ పోటీల్లో 140 దేశాల నుంచి సుందరీమణులు పాల్గొననున్నారు. సుందరీమణుల పర్యటించే ప్రాంతాలు నేడు ఖరారు కానున్నాయి. అనంతగిరి కొండలను సందర్శించి ఇక్కడి ప్రకృతి అందాలు ఆస్వాదించడం వరకే పరిమితం చేస్తారా? లేక మిస్‌వరల్డ్ పోటీలకు సంబంధించి ఏదైనా ఒక థీమ్‌తో ఈవెంట్ నిర్వహణకు అనంతగిరి కొండలు వేదిక కానున్నాయా అనేది గురువారం నాటికి స్పష్టత రానుంది.

నిజాం కళాశాలను సందర్శించిన యూజీసీ-న్యాక్ బృందం

ఉస్మానియా యూనివర్సి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల పనితీరును- నాణ్యత ప్రమాణాలను అంచనా వేసి గుర్తింపును ఇచ్చేందుకు యూజీసీ- న్యాక్ బృందం నిజాం కళాశాలను సందర్శించింది. ఈ నెల 24, 25 తేదీలలో యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్)కు చెందిన న్యాక్(నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్) సభ్యులు నిజాం కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయంతోపాటు ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఈటీసీ, పరీక్షల విభాగం, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, క్రీడా విభాగం, ఆర్ట్స్, సోషల్ సైన్సు, కామర్స్, సైన్సు, మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన డిపార్టుమెంట్‌లను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారని నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక అంశాలపై న్యాక్ బృంద సభ్యులు అడిగిన ప్రశ్నలకు తాము వివరణ ఇచ్చామని, వారు సంతృప్తి చెందారని పేర్కొన్నారు. యూజీసీ- న్యాక్ నుంచి ఉన్నతమైన గ్రేడ్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు

- 285 స్పెషల్ బస్సులు నడిపిన ఆర్టీసీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి కీసరగుట్టకు గ్రేటర్ ఆర్టీసీ 285 ప్రత్యేక బస్సులను నడిపింది. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్, అమ్ముగూడ, ఉప్పల్‌ఎక్స్ రోడ్ నుంచి ప్రత్యేక బస్సుల్లో భక్తులు కీసరగుట్టకు తరలివెళ్లారు. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపినట్లు తెలిపారు. కీసరగుట్టలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసిన అధికారులు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీబీఎస్ నుంచి ఎడుపాయలకు, పటాన్‌చెరువు నుంచి బీరంగూడ జాతరకు 155 ప్రత్యేక బస్సులు నడిపారు.

పీడీఎస్‌ఎఫ్ ఇక నుంచి పీఎస్‌యూ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్(పీడీఎస్ఎఫ్) ఇక నుంచి ప్రొగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్(పీఎస్‌యూ)గా కొనసాగుతుందని ఆ సంస్థ పేర్కొంది. ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని న్యూసెమినార్ హాల్‌లో రాష్ట్రస్థాయి సాధారణ సమావేశం బుధవారం జరిగింది. పలు అంశాలపై వారు చర్చించారు. భావసారుప్యత కలిగిన విద్యార్థులతో ఐక్యమై ఇక మీద పీఎస్‌యుగా కొనసాగాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆవుల నాగరాజు, ఉపాధ్యక్షులుగా యన్. రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కోట ఆనందరావు, సహాయ కార్యదర్శిగా జీ పవన్, కోశాధికారిగా ఎం హరీష్, సభ్యులుగా ఏ విశాల, వీ వెన్నెల, కుమార్, నవీన్‌లను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. అధిక ఫీజుల దోపిడిపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేయాలని పిలుపు నిచ్చారు. నూతన విద్యా విధానం వెనక్కి తీసుకోవాలని, తీవ్రమవుతోన్న విద్య కాషాయీకరణ, కేంద్రీకరణకు వ్యతిరేకంగా పోరాడనున్నట్టు వారు పేర్కొన్నారు.

ఆయుర్వేద దుకాణాలపై దాడులు

- పలు రకాల మందులను సీజ్ చేసిన డీసీఏ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మధుమేహాన్ని నియంత్రిస్తాయని తప్పుడు ప్రకటనతో ఆయుర్వేద మందులు విక్రయిస్తున్న దుకాణాలపై బుధవారం డ్రగ్స్ కంట్రోల్ అధికారులు(డీసీఏ) దాడులు చేసి పలు రకాల మందులను సీజ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి ప్రాంతంలో జైవిఫార్మాలో విక్రయిస్తున్న ఫెర్రస్, ఫోలిక్ యాసిడ్, జింక్ ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. మధుమేహం నియంత్రణకు పొడపత్రి పొడి, కిడ్నీలో రాళ్ల కరిగించేందుకు స్టోన్‌గో అల్కైజర్ సిరప్‌లు అంటూ ప్రచారం చేసుకుంటూ విక్రయిస్తున్న మందులను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నకిలీ ప్రచారం చేస్తూ ఔషధాలను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని డీసీఏ అధికారులు హెచ్చరించారు.


రాంబాగ్ శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు


పబ్లిక్‌గార్డెన్‌లోని శివమందిరంలో పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా, కైలాష్ కెడియా, కిషన్‌బాయ్, సునీతాగుప్తా, అశోక్‌గుప్తా, గోవింద్ అగర్వాల్, సంగీత అగర్వాల్, రేఖాజైన్, రాజు మహారాజ్


చిన్న అనంతగిరి శివాలయంలో భక్తులు

శివోహం.. భజోహం..

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయాలతోపాటు ఇతర ఆలయాల్లో ఉదయం తెల్లవారుజాము నుంచే శివ పార్వతుల కల్యాణాలు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి.

- ఆంధ్రజ్యోతి, జోన్‌బృందం


రాంబాగ్‌లో సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు


పుచ్చపండుపై శివుడి ఆకారాన్ని చెక్కిన రాజేంద్రనగర్‌కు చెందిన శిల్పకారుడు కె.రామకృష్ణరాజు


చిన్న అనంతగిరి శివాలయంలో పూజలు చేసిన ప్రణవభక్త సమాజం సభ్యులు


రాజేంద్రనగర్ హరిహరక్షేత్రం ఆవరణలో హిందువులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ మైనారిటీ విభాగం నాయకులు నయీం, మహ్మద్ గౌస్‌అలీ, ఉమర్, మహ్మద్ అన్వర్, అఫ్రోజ్, అమిత్ అయాన్


బాబుల్‌రెడ్డినగర్‌లోని ఉమ్మడి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్


గన్‌ఫౌండ్రీలోని శివాలయంలో జరిగిన పూజలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంతోష్‌గుప్తా


కట్టెలమండిలోని కాశీ విశ్వనాథ ఆలయంలో కాంగ్రెస్ నేతలు ధన్‌రాజ్, రాజ్‌కుమార్ పూజలు


గౌలిపురా మురాద్ మహల్ సోమేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజలో మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర దంపతులు


గోషామహల్‌లోని శివాలయంలో మహా రుద్రాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తమరావు దంపతులు


పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేత రాజు యాదవ్, లక్ష్మణేశ్వరస్వామి ఆలయం అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, తదితరులు


మహాశివరాత్రి వేడుకల్లో బీజేపీ గోషామహల్ నేత జక్కుల మహేశ్‌కుమార్ యాదవ్


శివుడికి అభిషేకం చేస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్


శ్రీరామ్‌కాలనీలోని శివాలయంలో భక్తులు

శివలింగానికి వెండి కిరీటం బహూకరణ


వెండి కిరీటం బహూకరిస్తున్న మెట్టు సాయికుమార్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్‌లోని శివబాగ్ మహా శివాలయాన్ని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన శివలింగానికి కిలో వెండి కిరీటాన్ని ఆయన బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రఘుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, చారి పాల్గొన్నారు.

108 జంటల ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు

గోషామహల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రహీంపురాలోని బాబా గోవింద్ దాస్ మఠ్‌లో బుధవారం మహారుద్రాభిషేకం నిర్వహించారు. హిందూ వంశ్, అభినవ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 108 జంటలు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ కూడ పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దీపక్ కోల, సోమ్‌రాజ్‌సింగ్, మోహన్‌గౌడ్, సిద్ధార్థ, నరహరి, ఆదిత్య గోయెల్ పాల్గొన్నారు.


లాల్‌దర్వాజలోని శ్రీ పిచ్చేశ్వరనాగేశ్వర శివపంచాయన ఆలయంలో జరిగిన పూజలో ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి దంపతులు, నాయకులు కె.వెంకటేశ్, వెంకటేశ్వర్‌రావు


ఛత్రినాక శివాలయంలో జరిగిన శివపార్వతుల కల్యాణంలో గౌలిపురా గౌడ సంఘం అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ తదితరులు

మచిలీశ్వరుడి ఆలయానికి భారీగా భక్తులు


మచిలేశ్వరస్వామి ఆలయంలో మహాశివుడికి అద్భుత అలంకరణ


మచిలీశ్వరుడిని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దంపతులు


మచిలీశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

నార్సింగ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలోని చారిత్రక శ్రీ మచిలేశ్వర వీరభద్రస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దాదాపు రెండు లక్షల మంది మహాశివుడిని దర్శించుకున్నారు. మహాశివుడికి ప్రత్యేక శివరాత్రి పూజలతో బ్రహ్మోత్సవాలు, అంకురార్పణ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మద్దూరి రాజ్యశ్రీ, కస్తూరి వీరరాఘవరావులు పుణ్యదంపతులు


రాజ్యశ్రీ, వీరరాఘవరావు దంపతులను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్ర భారతి, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): స్వామి పరమార్థానందజీ బోధనల స్ఫూర్తితో ప్రస్థానత్రయ మహాగ్రంథములను ప్రచురించి ప్రచార సేవలందిస్తున్న మద్దూరి రాజ్యశ్రీ, కస్తూరి వీరరాఘవరావులు పుణ్యదంపతులని వక్తలు అభివర్ణించారు. తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో అజో-విభక్త-కందాళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మద్దూరి రాజ్యశ్రీ, కస్తూరి వీరరాఘవరావుల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త, తెలుగు వర్సిటీ పూర్వ వీసీ ఆచార్య అనుమాండ్ల భూమయ్య హాజరై రాజ్యశ్రీ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్మాతిక సాహిత్య సేవలో నిమగ్నమవడం సంతోషకరమని అన్నారు. ప్రస్థానత్రయ మహాగ్రంథాలను తీసుకురావడం భవిష్యత్తు తరాలకు మన సంస్కృతిని అందించనివారమవుతామని అన్నారు. ఇలాంటి గ్రంథాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డా.ఎం.వి.ఆర్.శర్మ, డా.బుర్రా రామచంద్రశాస్త్రి, రావులపర్తి రాజేశ్వరి, వెలువోలు నాగరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొని రాజ్యశ్రీ, వీరరాఘవరావులను ఘనంగా సన్మానించారు.

నైజీరియన్ల గొడవ.. అదుపులోకి తీసుకున్న పోలీసులు..!

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లిలోని ఓ ఇంట్లో గొడవపడుతోన్న నైజీరియన్లను రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని ఓ ఇంట్లో భారీ శబ్దాలు రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఇంట్లోకి వెళ్లగా.. అద్దెకుంటోన్న నైజీరియన్లు గొడవపడుతున్నట్టు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నైజీరియన్ల వద్ద డ్రగ్స్ ఉన్నాయేమో అని స్థానికులు అనుమానం వ్యక్తం చేయగా.. ఇంట్లో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో వారి వద్ద హోమియోపతి మాత్రలు, రెండు ప్యాకెట్ల పౌడర్‌ను పోలీసులు సీజ్ చేశారు. నైజీరియన్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రయాణికురాలి పుస్తెలతాడు చోరీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గుర్రంగూడకు చెందిన లోకేష్‌చారి కుటుంబసభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వెంకట్రాది ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. గద్వాల రైల్వే స్టేషన్ వద్ద తన భార్య మెడలోని 23 గ్రాముల బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని దొంగలు తస్కరించారు. దీంతో లోకేష్‌చారి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

బతుకుదెరువు కోసం వచ్చి చోరీలు

- జైలుకెళ్లొచ్చినా మారని తీరు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 57 గ్రాముల బంగారం స్వాధీనం



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మెరుగు పెడతామంటూ మహిళల దృష్టిమరల్చి బంగారం అపహరించిన ముగ్గురు నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన మహ్మద్ సత్తార్ అలీ, ఉత్తర బెంగాల్‌కు చెందిన మహ్మద్ అమీర్, ఎండీ రియాజ్ మాలిక్ బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చారు. బంగారు నగలు, వెండి వస్తువులకు పాలిష్ (మెరుగు పెట్టడం) చేసే పని చేసేవారు. సంపాదన సరిపోకపోవడంతో కాలనీలు, శివారు ప్రాంతాల్లో తిరుగుతూ బంగారు నగలకు మెరుగుపెట్టే దందాకు తెరతీశారు. మెరుగు పెట్టడానికి బంగారు నగలు ఇచ్చిన మహిళల దృష్టి మరల్చి నగలు కాజేసి ఉడాయించేవారు. 2018లో మలక్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నేరచరిత్రను పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సొంత రాష్ట్రాలకు వెళ్లిపోయారు. గత ఏడాది తిరిగి నగరానికి వచ్చారు. ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో తిరుగుతూ బంగారు ఆభరణాలకు మెరుగు పెడతామంటూ నమ్మించి బంగారంతో ఉడాయించారు. సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, ఛత్రినాక పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 57 గ్రాముల బంగారం, 3 ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zUd09t9లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


ఇబ్రహీంబాగ్ పెద్దచెరువు అభివృద్ధి కోసం తయారు చేసిన చిత్రం

పీపీపీ పద్ధతిన ఇబ్రహీంబాగ్ పెద్దచెరువు అభివృద్ధి

నార్సింగ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం నెక్నాంపూర్‌లోని ఇబ్రహీంబాగ్ పెద్దచెరువు అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. పీపీపీ పద్ధతిలో ఈ చెరువు అభివృద్ధిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ఒక ప్రణాళిక సిద్ధం చేసింది. గండిపేట మండలంలోని అతిపెద్ద చెరువైన ఈ ఇబ్రహీంబాగ్ పెద్దచెరువు అభివృద్ధి కోసం పదేళ్లుగా ప్రణాళికలను రూపొందించినప్పటికీ ప్రాథమికంగానే నిలిచిపోయాయి. చుట్టూ జనాలు పెరగడం, పర్యాటక ప్రాంతం అవసరం ఏర్పడడంతో ఇక చెరువును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రాథమిక నివేదిక తయారు చేసింది. ఇందుకు చెరువులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కూడా నిర్ణయించింది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పొందిన తర్వాత అభివృద్ధి పనులను ప్రైవేట్ సంస్థకు అప్పగించే అవకాశం ఉంది. చెరువు అభివృద్ధి ఎలా ఉంటుందో అన్న ఛాయాచిత్రాలు నెట్టింట్లో తిరుగుతున్నాయి.

ఓయూ వీసీకి సర్ సీవీ రామన్ ఎక్స్‌లెన్సీ అవార్డు


ప్రొఫెసర్ కుమార్ మొలుగారం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం సర్ సీవీ రామన్ ఎక్స్‌లెన్సీ అవార్డు-2025కు ఎంపికైనట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఈనెల 28వ తేదీన అవార్డును ఉస్మానియా యూనివర్సిటీలో ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.


పురస్కారగ్రహీతలను సత్కరిస్తున్న అతిథులు


ఘనంగా కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కొలకలూరి కుటుంబ సభ్యుల పేరిట ప్రతి ఏటా ప్రదానం చేసే పురస్కారాలను ఈ సారి పలువురు సాహితీవేత్తలను అందజేశారు. బుధవారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో జ్యోతి గ్రంథమాల ఆధ్వర్యంలో కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలకలూరి భాగీరథి కవితా పురస్కారం- జూకంటి జగన్నాథం, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం- టేకుమళ్ల వెంకటప్పయ్య. కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం- గడ్డం మోహనరావులకు ప్రదానం చేశారు. వీటితో పాటు డా.పి.వాసు, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, డా.ఎ.అనురాధ, ఆచార్య టి.రాంప్రకాష్, సుబ్బరాజు తదితరులకు పరిశోధన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ హాజరై పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొలకలూరి కుటుంబసభ్యుల పేరిట ప్రదానం చేస్తున్న పురస్కారాలను స్వీకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ సాహిత్య ప్రపంచాన్ని కుటుంబానికి పరిచయం చేసిన కుటుంబసభ్యుల గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న అతిథులు

డా.మాడభూషి రంగాచార్య సార్మక పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా ఏటా పదివేల రూపాయల పురస్కారంతో ఉత్తమ కథా సంపుటికి ప్రదానం చేస్తున్న డా.మాడభూషి రంగాచార్య స్మారక పురస్కారాన్ని 2024 సంవత్సరానికిగాను పి.శ్రీనివాస్‌గౌడ్ రచించిన మార్జినోళ్ల కథాసంపుటికి ప్రదానం చేశారు. రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త విహారి హాజరై కవి పి.శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాళేశ్వరం శంకరంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


పిగ్మాలియన్ నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

రంజింపజేసిన పిగ్మాలియన్ నాటకం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఐరిష్ నాటక రచయిత జార్జ్ బెర్నార్డ్ షా రచన చేసిన పిగ్మాలియన్ నాటకాన్ని చక్కగా ప్రదర్శించి రంజింపజేశారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిషుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో పిగ్మాలియన్ నాటకాన్ని ప్రదర్శించారు. జార్జ్ బెర్నార్డ్ షా రచించిన ఈ నాటకానికి ప్రముఖ రంగస్థల దర్శకుడు డా.రామ్ హోలగుండి దర్శకత్వం వహించారు. చక్కటి నటనతో నటీనటులు ఆకట్టుకున్నారు. మానవీయ కోణంలో సాగిన ఈ నాటకం ప్రేక్షకుల్ని ఆలోచింపజేసింది. చక్కటి ఆహార్యం అద్భుతమైన నటనతో కళాకారులు మైమరిపించారు. జర్మన్, వియన్నాలోని ప్రదర్శింపబడిన ఈ నాటకాన్ని హైదరాబాద్ వేదికగా ప్రదర్శించి భళా అనిపించారు. ఒక భాషాశాస్త్ర ప్రొఫెసర్, పూల అమ్మాయి మధ్య జరిగే సన్నివేశాలతో నాటకం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. అతిథులుగా డా.ఫిలోమినా, చిన్నమ్మ, రేవతిదేవి తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ హోలగుండిని సన్మానించారు. దర్శకుడి ప్రతిభకు ఈ నాటకం నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి అంతర్జాతీయ స్థాయి నాటకాలు మరిన్ని ప్రదర్శింపబడాలని ఆకాంక్షించారు.

సాంకేతికతే మంత్రం.. ఆరోగ్యమే లక్ష్యం!

ముగిసిన బయో ఆసియా సదస్సు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో జరుగుతున్న బయో-ఆసియా సదస్సు ముగిసింది. దాదాపు 125కు పైగా వైద్య, సాంకేతిక రంగాల్లోని స్టార్టప్స్‌తో పాటుగా 70కి పైగా పేరొందిన ఫార్మా, బయో టెక్నాలజీ కంపెనీలు ఏర్పాటుచేసిన స్టాల్స్ బయో ఆసియా సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి. క్యాన్సర్‌లను ముందుగానే గుర్తించే సాంకేతికత, రోజుల తరబడి పట్టే డీఎన్ఏ పరీక్షలను కూడా గంటలలో చేసే విజ్ఞానం, దంతక్షయం ముందుగా గుర్తించడం, పొడి కళ్ల బారిన పడితే హెచ్చరించడం... ఒకటేమిటి ప్రతి ఒక్కటీ అబ్బురపరిచేదే. ఈ ఆవిష్కరణల్లో కొన్ని మీకోసం..

నోటి సమస్యలను గుర్తించడానికి..

తాము దంత క్షయం సహా పలు రకాల సమస్యలను గుర్తించడానికి ప్రత్యేక పరికరం ఆవిష్కరించామని స్టార్టప్ ఓరల్‌విస్ సంస్థ ప్రతినిధి ప్రకాష్ తెలిపారు. కృత్రిమ మేధస్సు సహాయంతో పనిచేసే తమ ఇంట్రా ఓరల్ కెమెరా ద్వారా వచ్చే చిత్రాల ద్వారా దంతక్షయం, నోటి క్యాన్సర్‌లు, ఇతర అనారోగ్య పరిస్థితులను ముందుగానే గుర్తించవచ్చని వివరించారు. డెంటిస్ట్‌లకు రూ.50వేలకు ఈ పరికరం అందిస్తామని ఆయన తెలిపారు.

అవయవాలు మొదలు ఔషధాల వరకూ...



అవయవాలు, మాలిక్యుల్స్, కొన్ని రకాల ఔషధాలను నిర్ధిష్టమైన ఉష్ణోగ్రతలో నిల్వ చేసేందుకు బ్యాటరీ సహాయంతో పనిచేసే యాక్టిపాడ్‌లను తీసుకువచ్చింది జెడ్ బ్లాక్స్ సంస్థ. దాదాపు ఐదేళ్ల పాటు పునర్వినియోగించుకునే రీతిలో తయారుచేయబడిన ఈ బాక్స్‌లు- 10 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 25 డిగ్రీల సెంటిగ్రేడ్‌లో ఉష్ణోగ్రతలను 8 గంటల పాటు కరెంట్, ఐస్ అవసరం లేకుండా నిల్వ చేస్తాయి. ఈ బాక్స్ ఎక్కడ ఉంది, వాటిలో ఉన్న మెటీరియల్ పరిస్థితిని ఎక్కడి నుంచైనా తెలుసుకునే అవకాశం కూడా ఉందట.

జబ్బుల గుట్టు విప్పే 'మినీ డీఎన్ఏ ల్యాబ్'



'మినీ డీఎన్ఏ ల్యాబ్... 300కుపైగా రోగనిర్ధారణ పరీక్షలు చేయగల ఈ యంత్రం బరువు నాలుగు కేజీలు. ఒక విధంగా లగేజీ సంచి అంత ఉన్న దీన్ని మూరుమూల పల్లెలకు కూడా సులువుగా వెంట తీసుకెళ్లచ్చు. యంత్రం ద్వారా కేన్సర్లు, మధుమేహం, ఊపరితిత్తులు, కాలేయ సమస్యలు వంటి జన్యుపరంగా తలెత్తే జబ్బులను డీఎన్ఏ రక్తనమూనా పరీక్ష ద్వారా ముందుగానే తెలుసుకోవచ్చు. రోగ లక్షణాలు కనిపించక ముందే, అంటే వైరస్ (హెచ్ఐవీ, ఎయిడ్స్, హెపటైటిస్ వంటివి) సోకిన వెంటనే, డీఎన్ఏ రక్త నమూనా పరీక్ష ద్వారా జబ్బును గుర్తించవచ్చు అని యంత్ర రూపకర్తలు డాక్టర్ దాస్, పావని చెబుతున్నారు. జబ్బు ఏదైనా, మూడు గంటల్లో ఫలితాలు వస్తాయి. దీని వెల రూ.2.5లక్షలు. ఆసక్తిగల వారు 30ఎం జినోమిక్స్ డాట్ కామ్ ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు" అని డాక్టర్ డేవిడ్ చెప్పారు.

కోళ్లకు వ్యాక్సిన్



ఇండోనేషియాకు చెందిన జాప్ఫా సంస్థ కోళ్లకు వచ్చే పలు ఆరోగ్య సమస్యలను నివారించేందుకు వ్యాక్సిన్‌లను రూపొందించింది. కోళ్లకు అన్ని వయస్సుల్లో వచ్చే వ్యాధులను రాకుండా కాపాడేందుకు వివిధ రకాల వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తెచ్చింది. బయో ఏషియా సదస్సులో హేచరీస్ నుంచి 50 వారాల వరకు కోళ్లకు వచ్చే పలు వ్యాధులు, వాటిని నివారించే వ్యాక్సిన్‌లను స్టాల్స్‌లో ప్రదర్శించారు

వైరస్‌ను చంపే యూవీ లైట్



కరోనా వైరస్‌తోపాటు మనకు హాని కలిగించే వైరస్‌లను నిర్వీర్యం చేయగల యూవీ లైట్‌లను రే ఫ్యూర్ సంస్థ రూపొందించింది. ఎల్ఈడీ లైట్లతో వైరస్‌ను చంపే విధానం ద్వారా పాఠశాలలు, కార్యాలయాలు, ఆస్పత్రులు, ఇళ్లలో సురక్షితంగా వినియోగించవచ్చని రే ఫ్యూర్ చిప్స్ సీఈఓ కె విజయ్‌కుమార్ గుప్తా తెలిపారు.

ఔషధాలపై టోల్ ఫ్రీ నెంబర్ ఉండాలి : సేఫ్ విగ్ సీఈఓ శ్రీవిద్య



మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చిన మందులను వినియోగించడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు వస్తాయి. వీటిని ఫార్మా విజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా (పీవీపీఐ)లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీని కోసం అన్ని ఫార్మా సంస్థలు తాము తయారు చేసిన టాబ్లెట్లు, లోషన్‌లు, సిరప్‌లపై లేబుల్, ఎక్స్‌పైరీ డేట్‌తో పాటు ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ తప్పనిసరిగా ప్రచురించాల్సి ఉంటుంది. వైద్యులు, నిపుణులు, ఫార్మాసిస్టులు, ప్రజలు ఔషధాల వినియోగంతో వచ్చే సైడ్ ఎఫెక్ట్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. దీనిపై ఎక్కువ మందికి అవగాహన లేదు. సేఫ్‌విజ్ ద్వారా ఔషధ దుష్ప్రభావాలను నియంత్రించడంతో పాటు సమర్థవంతమైన చికిత్స పద్ధతులను గుర్తించడంలో సహాయం చేస్తున్నాం. ఔషధాల వినియోగంతో వచ్చే దుష్ఫలితాలను గురించి పీవీపీఐలో నమోదు చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

అంకుర సంస్థల స్టాళ్లను సందర్శించిన సజ్జనార్



బయో ఆసియా సదస్సుకు బుధవారం టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ విచ్చేశారు. ఆ ప్రాంగణంలో కొలువుదీరిన అంకుర సంస్థల స్టాళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో సజ్జనార్ మాట్లాడారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే డ్రైవర్లు, కండక్టర్ల ఆరోగ్య స్థితిని మెరుగుపరిచేందుకు అవసరమైన గాడ్జెట్లు కూడా బయో ఆసియా అంకుర సంస్థల ప్రదర్శనలో చూశానని తెలిపారు.

గండిపేట జలాశయానికి 105 ఏళ్లు

● మూసీనదిపై 1920లో ఆనకట్ట నిర్మాణం ● నేటికీ నగరవాసుల దాహార్తిని తీరుస్తున్న జలాశయం

నార్సింగ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు వచ్చి సెటిల్ అయిన వారు కాస్త హుషారుగా చలాకీగా మాట్లాడితే ఏమ్రో.. గండిపేట నీళ్ల పడ్డయా ఏంటి? ఇంత హుషారుగా మాట్లాడుతున్నవ్.. అంటారు. అంటే గండిపేట నీళ్లకున్న మహత్యం అలాంటిది. భాగ్యనగరవాసుల దాహార్తిని తీరుస్తున్న ఉస్మాన్‌సాగర్‌గా పిలిచే గండిపేట జలాశయం నిర్మాణానికి శ్రీకారం చుట్టి 105 ఏళ్లు అయ్యింది. మూసీనది 1908లో వరదలతో భాగ్యనగరాన్ని ముంచెత్తింది. దీంతో అప్పటి హైదరాబాద్ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ వరదలకు అడ్డుకట్ట వేయడానికి గండిపేట గ్రామం వద్ద మూసీనదిపై 1920లో ఆనకట్ట(జలాశయం)ను నిర్మించారు. నీటిని అక్కడ నిల్వ చేసి జలాశయంగా మార్చి నగరవాసులకు నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ ప్రతిభతో నిర్మితమైన జలాశయానికి ఉస్మాన్‌సాగర్‌గా నామకరణం చేశారు.

న్యాచురల్ స్లోప్‌తో రాతి కాల్వ

గండిపేట జలాశయం నుంచి నగరవాసులకు నీటిని సరఫరా చేసేందుకు నాడు నిజాం షేక్‌పేట, ఆసిఫ్‌నగర్ (మెహిదీపట్నం) ఫిల్టర్‌బెడ్స్‌ను నిర్మించారు. దీంతో ఈ ఫిల్టర్‌బెడ్స్ వరకు గండిపేట నీటిని తరలించేందుకు న్యాచురల్ స్లోప్‌తో ఆనాడు రాతి కాల్వను నిర్మించారు. గండిపేట నుంచి కోకాపేట, నార్సింగ్, మణికొండ, షేక్‌పేట ఫిల్టర్‌బెడ్స్ వరకు, అక్కడి నుంచి టోలిచౌకి మీదుగా మెహిదీపట్నం ఫిల్టర్‌బెడ్స్ వరకు ఈ కాల్వను నిర్మించారు. జలమండలి భాషలో దీన్ని కాండ్యూట్ అంటారు. ఇప్పటికీ ఇదే కాల్వ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీన్ని వారసత్వ కట్టడంగా కూడా గుర్తించారు. గండిపేట జలాశయం పరిధిలోకి వచ్చే జీవో 111 నిబంధనలు ఈ కాండ్యూట్‌కు కూడా వర్తిస్తాయి. ఈ కాండ్యూట్ నుంచి 100 మీటర్లు ఇటు అటు ఎవరూ నిర్మాణాలు చేయకూడదని నిబంధన ఉంది.



గండిపేట జలాశయం నుంచి కిందికి వెళ్తున్న నీరు

నేటికీ గండిపేట జలాశయం నుంచి..

నేటికీ గండిపేట జలాశయం నుంచి నగరానికి నీటిని సరఫరా చేస్తున్నారు. గండిపేటకు జంట జలాశయం అయిన హిమాయత్‌సాగర్‌ను కూడా నిజాం ప్రభుత్వం నిర్మించింది. హిమాయత్‌సాగర్‌ను 1927లో నిర్మించారు. అయితే, ఈ రెండు జలాశయాలు నగరానికి నేటికీ నీటిని సరఫరా చేస్తున్నాయి. వీటితో పాటు కొన్నాళ్లు మంజీరా, సింగూర్ నీటిని నగరానికి సరఫరా చేశారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నీరు నగరానికి రావడంతో గండిపేట నీటిని తక్కువగానే వినియోగిస్తున్నారు. గత రెండేళ్లు నీటిని నిల్వ చేశారు. ఈ ఏడాది గండిపేట జలాశయం నీటిని పూర్తిగా వినియోగిస్తున్నారు.

జలాశయం గురించి..

- గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ వరకు మొత్తం 1,790 ఎకరాలు
- చుట్టు కొలత 46కిలో మీటర్లు
- పెరిమీటర్ ఎఫ్‌టీఎల్ 1,792 ఎకరాలు, 48.52 కిలోమీటర్లు బఫర్ జోన్ ఉంది.
- ఈ గండిపేట జలాశయం కట్ట పొడవు 1,850 మీటర్లు
- చెరువు మొత్తం నీటి నిలువ 1,790 అడుగులు, 3.9 టీఎంసీల నీటి సామర్థ్యం

ముందుకా.. వెనక్కా!

● జేఎన్‌టీయూలో మాజీ వీసీలు చేపట్టిన కార్యక్రమాలపై సందిగ్ధత
● ఇంజనీరింగ్ కాలేజీ విభజనపై ఆచార్యుల్లో భిన్నాభిప్రాయాలు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో మాజీ వైస్ చాన్స్‌లర్లు వారి హయాంలో చేపట్టిన సంస్కరణలు, కార్యక్రమాలు ఇకపైనా ముందుకు సాగుతాయా, లేదా అనే అంశంపై యూనివర్సిటీ వర్గాల్లో సందిగ్ధత నెలకొంది. ఈనెల 18న వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి.. యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి 4వ శనివారం సెలవుదినంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. 2008కంటే ముందు అమలులో ఉన్న 4వ శనివారం సెలవును అప్పటి వీసీ రద్దు చేయగా, 16ఏళ్ల తర్వాత కొత్తగా వచ్చిన వీసీ దానిని పునరుద్ధరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని యూనివర్సిటీ వర్గాలు స్వాగతించాయి. అయితే, ఇదే పంథాలో మాజీ వీసీలు కొందరు తీసుకున్న నిర్ణయాలను మార్చే విషయమై వర్సిటీ ఆచార్యులతో కొత్త వీసీ ఇటీవల జరిపిన సమీక్షలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం గమనార్హం.

విడివిడి సంస్థలను నాడు ఒకటిగా కలిపేశారు

ప్రధానంగా యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలను యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో రెండేళ్ల క్రితం అప్పటి వైస్‌చాన్స్‌లర్ విలీనం చేశారు. సదరు సంస్థలను కలిపే ఉంచాలా? లేదా గతంలో మాదిరిగా విడివిడిగా ఉంచాలా.. అనే ప్రతిపాదనను కొత్త వీసీ టీకేకే రెడ్డి వర్సిటీ తాజాగా ఆచార్యుల ముందుంచినట్లు తెలిసింది.

అవసరానికి మించి అదనపు డైరెక్టరేట్లు

మాజీ వీసీ ఒకరు తన హయాంలో అవసరం లేకున్నా అదనంగా డైరెక్టరేట్లను సృష్టించారన్న అభిప్రాయం యూనివర్సిటీ వర్గాల్లో ఉంది. ఆ డైరెక్టరేట్లను కొత్త వీసీ ఇకపైనా కొనసాగిస్తారా, వాటిని అవసరమైన మేరకు కుదిస్తారా అనేది తేలాల్సి ఉంది. అలాగే, మాజీ వీసీ హయాంలో అనుబంధ కళాశాలల నుంచి హైదరాబాద్ క్యాంపస్‌కు అవసరం లేకున్నా వందల సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలు జరగగా, ఆయా కాలేజీల్లో రెగ్యులర్ సిబ్బంది లేక కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ విషయంలో డిప్యుటేషన్లను కొత్త వీసీ కొనసాగిస్తారా ? లేక రద్దుకు ఉపక్రమిస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఆ భవనాన్ని ఇన్నోవేషన్ పార్కుగా మారుస్తారా?

ఏడాది క్రితం రూ.50కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవనం నిరుపయోగంగా ఉండడంతో ఆ భవనాన్ని ఇన్నోవేషన్ పార్కుగా మార్చాలని గత వారం వరకు ఇన్‌చార్జిగా ఉన్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రతిపాదించారు. అయితే.. కొత్త వీసీగా బాధ్యతలు చేపట్టిన టీకేకే రెడ్డి ఆ భవనాన్ని ఇన్నోవేషన్ పార్కుగా ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్తారా లేదా మరొక విధంగా వినియోగంలోకి తెస్తారా అనేదానిపై యూనివర్సిటీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. నూతన వీసీ తన మూడేళ్ల పదవీ కాలంలో యూనివర్సిటీలో కొత్తగా ఎటువంటి మార్పులు తీసుకు వస్తారో, ఆయన ఆలోచనల రోడ్ మ్యాప్ ఎలా ఉంటుందోనని వర్సిటీ సిబ్బంది ఎదురు చూస్తున్నారు.



సంగీతాలాపన చేస్తున్న కళాకారులు

శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనం

● మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం శివరాత్రి ఉత్సవాలలో భాగంగా భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో భాగంగా మహతి ఆర్ట్స్ వారిచే సంగీత కచేరీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత గురువు విజయమూరి లక్ష్మి నేతృత్వంలోని బృందం భక్తి గీతాలను ఆలపించారు. శివుడిని స్తుతిస్తూ సాగిన సంకీర్తనాలాపన శ్రోతలను మైమరిపించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ కళాకారులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కృష్ణకుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రయ్.. రయ్..



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఏడేళ్లుగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు బుధవారం ప్రారంభమయ్యాయి. దీంతో ఫ్లైఓవర్‌పై వాహనాలు రయ్.. రయ్‌మంటూ పరుగులు తీశాయి.

- గోల్నాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి)

రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా చేయాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ఎస్సీ వర్గీకరణ చట్టంలో అన్ని కులాలకు రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా జరిగేలా చూడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) సమావేశాన్ని ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షతన ఓయూ గెస్ట్‌హౌస్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదిక లోపభూయిష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఈ లోపాలను, పొరపాట్లను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

1న ఓయూలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభను మార్చి 1న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్నామని గోవిందు నరేష్ మాదిగ తెలిపారు. ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతారని, మాదిగ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి డాక్టర్ సుధాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు చిరంజీవి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి అనిల్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు



ఆస్ట్రేలియా స్విన్‌బర్న్ యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి పరిశోధన ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

ప్రపంచ సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యం

● ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): క్లిష్టమైన ప్రపంచ సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా స్విన్‌బర్న్ యూనివర్సిటీతో ఐఐటీ హైదరాబాద్(ఐఐటీహెచ్) భాగస్వామ్యం పెట్టుకుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. ఉమ్మడి పరిశోధనలు, పరిశ్రమల సహకారం కోసం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా బుధవారం పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించాయి. ఈ సందర్భంగా స్విన్‌బర్న్ యూనివర్సిటీ డిప్యూటీ వైస్ చాన్స్‌లర్ (పరిశోధన) ప్రొఫెసర్ కరెన్ హాప్‌గుడ్ మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌తో మా భాగస్వామ్యం ఇప్పటికే ఉమ్మడి పీహెచ్‌డీ శిక్షణలో అద్భుతమైన ఫలితాలను అందించిందని తెలిపారు. ఐఐటీహెచ్‌లో పరిశోధనాకేంద్రం స్థాపన తమ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ స్థాయిలో సంచలనాత్మక పరిశోధనలు, ఆవిష్కరణల కోసం కొత్త అవకాశాలను సృష్టించడానికి వీలు కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.

'గీతం'లో అనువాదంపై జాతీయ వర్క్‌షాప్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) లోని ఆంగ్ల, ఇతర భాషల విభాగం ఆధ్వర్యంలో 'అనువాదం: చరిత్ర, తేడాలు, పునరుద్ధరణలు' అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ వర్క్ షాప్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ జోస్ బుధవారం ప్రారంభించారు. హైదరాబాద్ వర్సిటీ నుంచి రిటైర్డ్ ప్రొఫెసర్లు అల్లాడి ఉమ, ఎం. శ్రీధర్, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ జె.బాలసుబ్రమణ్యం, పశ్చిమ బంగా వర్సిటీ నుంచి ప్రొఫెసర్ సిప్రా ముఖర్జీ, స్వతంత్ర స్కాలర్ అనువాదకురాలు వి.గీత తదితరులు ఈ వర్క్‌షాప్‌లో ప్రధాన వక్తలుగా పాల్గొననున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సన్నీ జోస్ తదితరులు

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్!

● రద్దీ జంక్షన్‌లపై ప్రత్యేక నియంత్రణకు చర్యలు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నలుదిక్కులా విస్తరించి ఉన్న హైదరాబాద్ మహానగరంలో వెస్ట్ హైదరాబాద్(ఐటీ కారిడార్) వైపే నిత్యం లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు, ఇతర కార్పొరేట్ సంస్థలు, భవన నిర్మాణరంగ సంస్థల్లో పనిచేసే వారంతా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఐటీ కారిడార్‌కు వచ్చే దారులన్నీ ట్రాఫిక్ జామై నిత్యం వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి. సైబరాబాద్ పోలీస్ కమిషరేట్ పరిధిలో 16 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేసి వాహనాల రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టినా తరచూ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కొత్తగా సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్)గా బాధ్యతలు చేపట్టిన గజరావ్ భూపాల్ సైబరాబాద్ పరిధిలో సమగ్ర అధ్యయనం చేపట్టారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల వారీగా, అత్యంత రద్దీ ఉండే జంక్షన్‌లు, నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండే మార్గాలు ఇలా రకరకాల అంశాలను పరిగణలోకి తీసుకొని అడిషనల్ ట్రాఫిక్ డీసీపీలు, ట్రాఫిక్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లతో సమీక్ష చేశారు. సైబరాబాద్‌లో సాఫీగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు ప్రతి రోజూ అనుసరించాల్సిన విధివిధానాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఇప్పటి వరకు అమలు చేస్తున్న విధానాలను పరిగణలోకి తీసుకుంటూనే సరికొత్త విధానాలను అమల్లో తీసుకువచ్చేలా ట్రాఫిక్ ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. మొత్తంగా సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ చిక్కులు లేకుండా సాఫీగా వాహనాల రాకపోకలు సాగిపోయేలా అవసరమైన చర్యలను ట్రాఫిక్ విభాగం అమలు చేయనుంది.

సమర్థవంతంగా ట్రాఫిక్ పల్స్...

సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కొన్ని నెలల పాటు అధ్యయనం చేసి, ప్రముఖ ఐటీ కంపెనీతో కలిసి రూపొందించిన సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్ ప్లాట్‌ఫామ్‌ను సమర్థవంతంగా నిర్వహించనున్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు, అక్కడి నుంచి వాహనదారులకు తెలిసేలా చేసే ఈ ప్లాట్‌ఫామ్‌ను ఐటీ కారిడార్‌లో నిత్యం రాకపోకలు సాగించే వారు వినియోగించేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ జామ్, ప్రమాదాలు జరిగినప్పుడు, ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్లింపు చర్యలు వంటి వివరాలను 'సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్' ద్వారా వాహనదారులకు ముందుగానే పంపించేందుకు ఈ ప్లాట్‌ఫామ్‌ను వినియోగించుకుంటున్నారు. ట్రాఫిక్‌కు సంబంధించిన తాజా సమాచారాన్ని వాహనదారులు ఆన్‌లైన్‌లో క్షణాల్లో తెలుసుకునేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఎంతో విలువైన సమయం ట్రాఫిక్‌లో వృథా కాకుండా ఉండాలంటే ఇటువంటి ప్లాట్‌ఫామ్‌ను ఐటీ కారిడార్‌లో నిత్యం రాకపోకలు సాగించేవారు వినియోగించేలా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

1న మజ్లిస్ 67వ వార్షికోత్సవం

హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) 67వ పునరుద్ధరణ వార్షికోత్సవాన్ని మార్చి 1న నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణలో బలమైన రాజకీయ శక్తిగా రూపుదిద్దుకున్న మజ్లిస్ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో రాజకీయంగా బలాన్నిపెంచుకుంది. ఆయా రాష్ట్రాల్లోనిపార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై పార్టీ పటిష్ఠతకు తీసుకోవలిసిన అంశాలపై చర్చించేందుకు పార్టీ పునరుద్ధరణ వార్షికోత్సవాల సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయం దారుల్ సలాం మైదానంలో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. జంటనగరాల్లోని శాసనసభ నియోజకవర్గాల వారీగా వేలాది మంది కార్యకర్తలతో మోటార్ బైక్‌లపై ర్యాలీగా శనివారం దారుల్ సలాం పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకోవాలని పార్టీ ప్రధాన కార్యదర్శి అహ్మద్ పాషా ఖాద్రీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్‌లను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి ర్యాలీలు దారుల్ సలాం మైదానానికి చేరుకోగానే పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు పాషా ఖాద్రీ తెలిపారు. ఈ సందర్భంగా దారుల్‌సలాం మైదానంలో ఏర్పాటయ్యే బహిరంగసభలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రసంగించిన అనంతరం పార్టీ అధినేతగా అసదుద్దీన్ ఒవైసీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

వేసవిలో వృద్ధులు ఇవి పాటించాలి!

వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతల కారణంగా వృద్ధులలో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవికాలాన్ని హాయిగా గడిపేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- తేలికగా, వదులుగా, మెత్తగా ఉండే నూలు దుస్తులు ధరించాలి. లేత రంగులు లేదా తెలుపు అయితే మంచిది.
- మధ్యాహ్న సమయంలో బయటికి వెళ్లకూడదు. సాయంత్రం నాలుగు గంటల తరవాత వాతావరణం చల్లబడినప్పుడు మాత్రమే వాకింగ్‌కు వెళ్లాలి.
- తరచూ ద్రవాహారం తీసుకుంటూ ఉండాలి. మంచి నీళ్లు, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు, రాగి జావ, బార్లీ నీళ్లు, సగ్గుబియ్యం జావ, పలుచని మజ్జిగ తాగడం మంచిది.



- తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. మసాలాలు, నూనె పదార్థాలు తినకూడదు.
- కాఫీ, టీ తాగకూడదు. వీటివల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది.
- ఇంట్లో కిటికీలు తెరచి ఉంచాలి. మధ్యాహ్న సమయంలో ఎండ ఎక్కువగా ఉన్న పక్షంలో కిటికీలకు కర్టెన్లు వేయాలి.
- బెడ్‌రూమ్‌లో పడుకునే సమయంలో ఫ్యాన్, ఏసీ, కూలర్ వినియోగించుకోవాలి.
- ఎండగా ఉన్నప్పుడు బయటికి వెళ్లాల్సి వస్తే హ్యాట్, గాగుల్స్, స్కార్ఫ్ ధరించాలి. మంచినీళ్లు తాగి వెళ్లాలి. తలకి తడి తువాలు కట్టుకోవాలి. ఎక్కువసేపు బయట ఉండాల్సి వస్తే ముఖాన్ని చల్లని నీళ్లతో కడుక్కుంటూ ఉండాలి.
- తరచూ బీపీ, షుగర్ స్థాయిలను పరీక్షించుకుంటూ ఉండాలి.
- నీరసం, బలహీనత, తలనొప్పి, కడుపులో తిప్పడం, వాంతులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రతించాలి.

గంజి తాగుదాం..!

గంజి సహజ ఔషధమని నిపుణులు చెబుతున్నారు. దీనిని తాగడంవల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

- గంజిలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. వ్యాయామం చేసిన తరవాత, నీరసంగా అనిపించినప్పుడు ఒక గ్లాసు గంజి తాగితే తక్షణ శక్తి లభిస్తుంది.
- ప్రతిరోజూ గంజి తాగడంవల్ల జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. మలబద్ధకం దూరమవుతుంది. పొట్ట సమస్యలు రావు.
- వేసవికాలంలో తరచూ గంజి తాగుతూ ఉంటే వడదెబ్బ తగలదు. ఒక గ్లాసు గంజిలో చిటికెడు ఉప్పు, కొద్దిగా నిమ్మరసం కలుపుకుని తాగితే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. డయేరియాను నిరోధిస్తుంది.
- గంజిలో బి 1, బి 2, బి 6 విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్ ఉంటాయి. ఇవి జీవక్రియలను వేగవంతం చేయడంతోపాటు మెదడు పనితీరుని క్రమబద్ధీకరిస్తాయి.
- గంజి తాగడం వల్ల చర్మానికి తేమ అంది ఆరోగ్యంగా కనిపిస్తుంది. మొటిమలు, గుల్లలు రాకుండా ఉంటాయి. శిరోజాలు చక్కగా పెరుగుతాయి.
- గంజిలో ఉండే పొటాషియం శరీరంలో సోడియం స్థాయిని నియంత్రిస్తుంది. దీనివల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.
- గంజిలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు అధికంగా ఉంటాయి. అనారోగ్యంతో ఉన్నప్పుడు గంజి తాగితే రోగనిరోధక శక్తి మెరుగవుతుంది.



బతుకు కథల రంగస్థలం.. ఫ్రీదా!



వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ. ప్రతి కథ లక్షలాది మహిళల జీవితాలకు ప్రతిబింబం. ఆ వెతలన్నిటినీ రంగస్థలం మీద ఆవిష్కరిస్తోంది ఫ్రీదా థియేటర్. ఈ నాటక సమాజంలో నాటకాలు రూపొందించేవారు, నటించేవారు... అందరూ దళిత మహిళలే. స్వయంగా ఎదుర్కొన్న లైంగికమైన, కులపరమైన హింసను వారు ప్రేక్షకుల ముందు ఆవిష్కరిస్తున్నారు. ఆలోచనలు రేకెత్తిస్తున్నారు. విషమ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, తలెత్తుకు బతకడం ఎలాగో చెబుతున్నారు.

మధ్యప్రదేశ్‌లోని ఒక చిన్న పల్లెటూరు. ఓ ఇంటి మేడ మీద వాడల్లోని మహిళలందరూ కూర్చున్నారు. వారి ముందు కొందరు అమ్మాయిలు నాటక ప్రదర్శన ప్రారంభించారు. తెరలు, లైట్లు, మేకప్ లాంటి హంగులూ, ఆర్భాటాలు లేకుండా... సాయంత్రపు వెలుతుర్లో సాగుతున్న ఆ ప్రదర్శన... ప్రేక్షకుల్లో భావోద్వేగాన్ని రేకెత్తిస్తోంది. చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు ఆవేశపడుతున్నారు, ఆగ్రహిస్తున్నారు, కన్నీరు పెట్టుకుంటున్నారు. ఎందుకంటే ప్రతి నిత్యం వారు ఎదుర్కొంటున్న కష్టాలన్నీ ఆ నాటకం వారికి కళ్లకు కట్టినట్టు చూపిస్తోంది. ప్రదర్శన పూర్తవగానే... అందరూ లేచి, ప్రదర్శనకారులైన మహిళల చుట్టూ మూగారు, వారిని హత్తుకున్నారు. 'మా బతుకుల్ని కళ్లకుకట్టారు' అంటూ ఉద్వేగం నిండిన గొంతులతో అభినందించారు. "అక్కడే కాదు. ఫ్రీదా థియేటర్ కళాకారులు ఎక్కడ ప్రదర్శన ఇచ్చినా ఇలాంటి దృశ్యాలు సాధారణం. ఎందుకంటే ఈ నాటకాలకు ఆధారం ఊహలు కావు, ఆ కళాకారుల జీవితాలు" అంటారు అంగారిక గుహా. 'ఫ్రీదా థియేటర్' ఆవిర్భావం వెనుక ఆమె పాత్ర కీలకం.

వాస్తవాలు తెలియాలని...

బెంగళూరుకు చెందిన 'మ్రా- మీడియా అండ్ ఆర్ట్స్ కలెక్టివ్' అనే ఎన్జీవోలో అంగారిక పని చేస్తున్నారు. కళలు, మీడియా అంశాలతో పాటు మురికివాడల్లో నివసించేవారిని, వీధి వర్తకుల్ని నిరాశ్రయులుగా చేయడం, పిల్లల్లో పోషకాహార లోపం, మహిళలపై హింస, అత్యాచారాలు తదితర అనేక సామాజిక సమస్యలపై ఆ సంస్థ వివిధ కార్యక్రమాలు చేపడుతూ ఉంటుంది. 2018లో... గ్రామీణ ప్రాంతాల్లో మహిళలపై కులతత్వంతో సాగుతున్న లైంగిక హింసకు బాధితులైన మహిళలను కలిసి, వారి వేదనలను తెలుసుకొని, నమోదు చేయడానికి ఆ సంస్థ తరఫున అంగారిక, ఆమె సహోద్యోగిని అనూషి అగర్వాల్ కలిసి 22 రాష్ట్రాల్లో పర్యటించారు. "పురుషాధిక్యత, కులాధిపత్యం, వ్యవస్థల నుంచి న్యాయం జరగకపోవడం, సామాజికంగా అవమానాలు, కుటుంబ సభ్యులే వెలివేయడం... ఇలాంటి ఎన్నో సమస్యలు హింసకు గురైన గ్రామీణ మహిళలు, ప్రధానంగా దళిత వర్గాలకు చెందినవారు ఎదుర్కొంటున్నారనీ, తప్పంతా వారిదేననే కళంకాన్ని మోస్తున్నారనీ తెలుసుకున్నాక... మాకు నిద్ర పట్టలేదు. మొదట ఇష్టపడకపోయినా... తరువాత ఒక్కొక్కరూ నోరువిప్పి వారికి జరిగిన అన్యాయాలను చెబుతూ ఉంటే... 'మనం మనుషులుగానే బతుకుతున్నామా?' అనిపించింది. ప్రధానంగా మధ్యప్రదేశ్‌లోని కొందరు దళిత మహిళలు, బాలికలు వివరించిన విషయాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. ఈ సంఘటనలను ప్రభుత్వ యంత్రాంగాల దృష్టికి తీసుకువెళ్ళినా న్యాయం జరగదనీ, పైగా వారిపై గ్రామాల్లో వేధింపులు మరింతగా పెరుగుతాయనీ వారు చెప్పారు. కానీ ఈ వాస్తవాలు సమాజానికి తెలియాలి. ఊరూరా సమావేశాలు పెట్టి చెప్పడంకన్నా... వారే పాత్రలుగా తమ కథలను ప్రదర్శిస్తే మరింత ప్రభావవంతంగా ఉంటుందనిపించింది" అని గుర్తు చేసుకున్నారు అంగారిక. 'మ్రా' సంస్థలో ఒక భాగంగా... 'ఫ్రీదా థియేటర్' ఏర్పాటుకు అది నాంది.

ఆత్మవిశ్వాసం పెరిగింది...

బెంగళూరులో నాటక ప్రయోక్త అనీష్ విక్టర్‌ను అంగారిక, అనూషి సంప్రతించారు. తాము మాట్లాడిన మహిళ అనుభవాల ఆధారంగా 'ఛు కర్ దేఖో' పేరుతో చిన్న ప్రదర్శనకు రూపకల్పన చేశారు. ఆ పాత్రలను మధ్యప్రదేశ్‌కు చెందిన బాధిత మహిళలతోనే నటింపజెయ్యాలనుకున్నారు. వారితో మాట్లాడారు. 2021 నవంబర్‌లో... ఇండోర్‌లో ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేసి, 11మంది మహిళలకు ప్రాథమికమైన శిక్షణ ఇచ్చారు. తొలి ప్రదర్శనను బాధితుల గ్రామాల్లోనే ఏర్పాటు చేశారు. "మేము కలిసిన మహిళల్లో ఒక్కొక్కరికీ ఒక్కో కథ. వారిలో ఒక మహిళను భర్త వదిలేస్తే... ఇళ్ళలో వంటలు చేస్తూ జీవిస్తూ ఉండేది. ఒక రోజు ఒక క్యాటరింగ్ ఆర్డర్ కోసం దూరంగా ఉన్న గ్రామానికి వెళ్ళింది. అక్కడ అగ్రకులాలకు చెందిన వ్యక్తులు ఆమెను బంధించి, రెండు రోజులపాటు అత్యాచారం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా మొదట్లో పట్టించుకోలేదు. చివరకు ప్రజాసంఘాల ఒత్తిడితో నిందితులను అరెస్ట్ చేశారు. వెంటనే వారు బెయిల్ మీద బయటికొచ్చారు. ఆమె మీద దుష్ప్రచారం మొదలెట్టారు. ఆమె జీవితం దుర్భరమైపోయింది. మా తొలి నాటకం ఆమె



కథే. మేము వారి గ్రామానికి వెళ్ళినప్పుడు ఇంట్లోంచి బయటకురావడానికి కూడా భయపడింది. కానీ మా ప్రదర్శనలో తన పాత్ర తనే పోషించింది. "నేను ఒంటరిదాన్ని కాదు. నాలాంటివాళ్ళు ఎంతో మంది ఉన్నారు. నా బాధను ఇన్నాళ్ళూ ఎవరూ అర్థం చేసుకోలేదు. ఇప్పుడు ప్రపంచం ముందు ధైర్యంగా నిలబడ్డాను. నా కథను నా వైపు నుంచి నేనే చెబుతున్నాను. మా ప్రదర్శనను చూశాక... వాళ్ళు ప్రవర్తనల గురించి తప్పకుండా ఆలోచించి తీరుతారు" అని ఆ మహిళ చెప్పినప్పుడు... మాకు ఎంతో గర్వంగా అనిపించింది అంటారు అంగారిక. అలాగే మరో మహిళని ఆమె ఇంటినుంచి అపహరించి, అత్యాచారం చేసి, డెహ్రాడూన్‌లో అమ్మడానికి ప్రయత్నించారు. అక్కడినుంచి ఆమె తప్పించుకొని పారిపోయి వచ్చింది. కానీ ఇంట్లోవాళ్ళు రానివ్వలేదు. ఆమె తమతో ఉండడం అవమానంగా భావించారు. ఇదంతా తన తప్పేననే అపరాధభావంతో, సిగ్గుతో ఆమె జీవిస్తూ వచ్చింది. ఇప్పుడు... 'తప్పు నాది కానప్పుడు ఎందుకు భయపడాలి?' అనే ఆత్మ విశ్వాసం పెరిగింది అని ఆమె చెబుతున్నారు.

బాధ్యతలన్నీ వారివే...

ఫ్రీదా థియేటర్ ప్రదర్శనలు విజయవంతం కావడంతో... రెట్టించిన ఉత్సాహంతో 'నజర్ కె సామ్నే' అనే నాటకాన్ని ఈ బృందం తయారు చేశారు. మహిళలపై లైంగిక హింస దీనిలో ప్రధానాంశం. ఈ నాటకాన్ని పంచాయతీ హాల్స్, సామాజిక కేంద్రాలు, గ్రామాల్లోని రచ్చబండలు, అవి అందుబాటులో లేనప్పుడు... పరిచయస్తుల ఇళ్ళలో ప్రదర్శించారు. "కులాధిపత్యంతో కూడిన హింస, పురుషాధిపత్య భావనలు నిత్య జీవితంతో విడదీయరానివిగా ఉన్న గ్రామాలనే ఎంచుకున్నాం. కొందరు ప్రదర్శనల్ని అడ్డుకున్నారు. దాంతో వాటిని వేరే చోటికి మార్చాల్సి వచ్చేది. కానీ నాటకం చూడ్డానికి మహిళలు తండోపతండాలుగా వచ్చేవారు. తమ బతుకుల్ని ఆ పాత్రల్లో చూసుకొనేవారు. పరిస్థితుల్ని ఎదిరించి నిలబడాలనే సంకల్పం, తప్పు చేయనప్పుడు దేనికీ భయపడనక్కర్లేదనే ధైర్యం వారిలో చూశాం. ఇప్పటివరకూ ఆ నాటకాన్ని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో, ఢిల్లీలో యాభైకి పైగా ప్రదర్శనలు ఇచ్చాం. బ్యాంకాక్‌లో కూడా ప్రదర్శించాం" అన్నారు అంగారిక. ఇప్పుడు 'మర్జు అండ్ మౌనికా కీ కహానీ' అనే కొత్త నాటకం ప్రదర్శిస్తున్నారు. తమ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న ఒక పలుకుబడి ఉన్న వ్యక్తితో ఇద్దరు బాలికలు చేసే పోరాటాన్ని చూపించే రాజకీయ వ్యంగ్య నాటకం అది. ఇక... ఈ బృందంలో ప్రధానపాత్రధారులు అయిదుగురున్నారు. "ఒకప్పుడు గ్రామం దాటని ఈ మహిళల్లో పలువురు... నెలకు 15 నుంచి 20 రోజులపాటు ప్రదర్శనల కోసం వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. నగరాల్లో, మహిళా సదస్సుల్లో, అంతర్జాతీయ వేదికల్లో తమ కథను పరిచయం చేస్తున్నారు. దీనివల్ల ఆర్థిక స్థిరత్వం కూడా వారికి కలుగుతోంది. క్రమంగా బాధ్యతలు వారికే అప్పగిస్తున్నాం. సొంతంగా ప్రదర్శనలు నిర్వహించడం, లెక్కలన్నీ చూసుకోవడం మొదలు రంగాలంకరణ, మేకప్ లాంటివన్నీ వారు స్వతంత్రంగా చేస్తున్నారు. దీనికి 'మ్రా' సంస్థ అన్ని సహాయాలు అందిస్తోంది. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఈ స్ఫూర్తిని వ్యాప్తి చేయాలన్నదే మా ఆశయం" అంటున్నారు అంగారిక.



కుటుంబ సభ్యులకు రసాయన రహిత ఆహారాన్ని వండి పెట్టాలనే కోరికతో ఇంట్లోనే కూరగాయలను పండించడం ప్రారంభించారు తమిళనాడుకు చెందిన ప్రియా రాజనారాయణన్. ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేసిన ఆమె... ఆరంకెల జీతం వదిలి వ్యవసాయం బాట పట్టారు. కూరగాయల విత్తనాలను సేకరించి నిల్వ చేయడంతోపాటు... వాటిని ఉచితంగా పంచుతున్నారు ఈ రైతు బిడ్డ.

కార్పొరేటు కొలువు వదిలి... వ్యవసాయం బాట పట్టి..!

"మాది తమిళనాడులోని పిలాతు గ్రామానికి చెందిన సాధారణ రైతు కుటుంబం. నాన్న వెంకీడు సామి, అమ్మ సుబ్బులక్ష్మి. మాకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులోనే మాకు కావాల్సిన కూరగాయలను సేంద్రియ పద్ధతుల్లో పండించుకునేవాళ్లం. బజార్లో కూరగాయలను కొనేవాళ్లం కాదు. నాకు పెళ్లయిన తరవాత భర్తతో కలిసి తిరుప్పూర్ వచ్చేశాను. ఇక్కడ కూరగాయలను మార్కెట్ నుంచి కొని తేవాల్సి వచ్చేది. వాటి నుంచి రసాయనాలు, పురుగు మందుల వాసనలు వచ్చేవి. ఇలాంటి వాటిని వండి కుటుంబ సభ్యులకు తినిపించాలంటే మనసుకి కష్టంగా అనిపించేది. దీంతో ఇంట్లోనే కూరగాయలను పెంచాలని నిర్ణయించుకున్నాను. స్థానికంగా మార్కెట్లో దొరికే విత్తనాలు తీసుకువచ్చి, ఇంటి వెనక ఉన్న స్థలంలో వంకాయలు, పాలకూర, ఇతర కూరగాయలు పెంచడం మొదలుపెట్టాను. ఈ క్రమంలోనే అనువంశిక విత్తనాల సంరక్షణ అనే ఆలోచన వచ్చింది.

వాటి కోసం అన్వేషణ

ఒకసారి అమ్మానాన్నలను చూడడానికి పిలాతు వెళ్లినప్పుడు అక్కడి నుంచి టమాటా, మిరపకాయ, వంకాయ విత్తనాలు తీసుకువచ్చాను. వీటితో పండించిన కూరగాయలు ఎంతో రుచిగా ఉండడంతో కుటుంబ సభ్యులందరూ ఇష్టంగా తినేవారు. దీంతో స్థానికంగా దొరికే అనువంశిక విత్తనాల కోసం వెతకడం మొదలుపెట్టాను. మా ఇంట్లో పాత యమహా మోటార్ సైకిల్ ఉండేది. దాని మీదనే మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలకు వెళ్లి అక్కడి రైతులతో మాట్లాడి వాళ్ల ఇప్పటికీ ఉపయోగిస్తున్న అనువంశిక, దేశీ విత్తనాలు సేకరించడం ప్రారంభించాను. ఇంత చిన్న గ్రామాల్లోని పేద రైతులు కూడా హైబ్రీడ్ రకాలు ఎంచుకోకపోవడం ఆసక్తిగా అనిపించింది. బంధువుల వివాహాల సందర్భంగా కేరళ, త్రిసూర్, మల్లాపురం వెళ్లాల్సి వచ్చింది. ఈ అవకాశాలను ఉపయోగించుకుని అక్కడి ప్రాంతాల్లో తిరిగి కంతారి మిరప, వంకాయ, బెండకాయ, పాలకూర లాంటి వివిధ కూరగాయలకు సంబంధించిన విత్తనాలు సేకరించాను.

వెయ్యి రకాలు...

ఇప్పుడు నా దగ్గర వంద రకాల టమాటా, దుంపలు, వంకాయలు, పొట్లకాయలతోపాటు నలభై రకాల బెండకాయ, బీన్స్, ఇతర కూరగాయలకు సంబంధించి మొత్తం వెయ్యి రకాల అనువంశిక విత్తనాలు ఉన్నాయి. వీటిని టెట్రా ప్యాక్‌లో జిప్‌లాక్ కవర్లో ఉంచి కోడ్‌తో లేబుల్ వేసి ఫ్రిజ్‌లో భద్రపరచి ఉంచుతాను. నా దగ్గరకు వచ్చి అడిగినవాళ్లకు వీటిని ఉచితంగానే ఇచ్చేస్తూ ఉంటాను.

విత్తన ద్వీపం...

మా వ్యవసాయ భూమిలోనే ఓ విత్తన ద్వీపాన్ని సృష్టించాను. ఇది స్వయం సమృద్ధితో రూపొందిన ఆహార అడవి. ఇక్కడ అన్ని రకాల కూరగాయలతో పాటు వంద రకాల మూలికలను కూడా పెంచుతున్నాను. వీటిని ఔషధంలా కాకుండా ఆహారంగా తినవచ్చు. పురుగు మందులు వాడకుండా సహజ వ్యవసాయ పద్ధతులతో పంటలు పండించడం, దేశీ విత్తనాల సంరక్షణ అంశాలకు సంబంధించి రైతులకు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం... ఇది నాకు నిత్యకృత్యం.

స్నేహితుల సహకారం

సేంద్రియ పద్ధతుల్లో స్థానిక రకాలు పండించే రైతులను కలవడానికి రాష్ట్రాలు దాటి వెళుతుంటాను. విత్తన ప్రదర్శనలు ఎక్కడ జరిగినా వాటికి హాజరవుతుంటాను. వివిధ ప్రాంతాల్లో ఉన్న నా స్నేహితులు స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందిస్తుంటారు. వాళ్ల కంట పడిన విత్తనాల ఫొటోలు నాకు పంపుతారు. నేను ఓకే అంటే వెంటనే వాటిని కొరియర్ చేస్తూ ఉంటారు

ప్రపంచ రైతులకు అవగాహన...

ఎన్జీఓలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే పలు కార్యక్రమాలను వేదికగా చేసుకుని స్థానిక విత్తనాల గురించి పలువురికి తెలియజేస్తూ ఉంటాను. ప్రపంచవ్యాప్తంగా సుమారు యాభై వేల మంది రైతులతో సమూహాలు కూడా ఏర్పాటు చేయగలిగాను. దేశంలో మరిన్ని ఆహార అడవులను పెంచడం, ప్రతి ఇంటికీ ఒక రైతు, ప్రతి గ్రామంలో ఒక విత్తన బ్యాంక్ ఉండాలన్నదే నా లక్ష్యం. ప్రస్తుతం దేశీ విత్తనాలు విరివిగా లభ్యం కావడంలేదు. శిక్షణ కార్యక్రమాలు, విత్తన మార్పిడి ఉత్సవాలు, దుంపల ఉత్సవాలకు హాజరయ్యే రైతులతో కలిసి విత్తనాలు మార్పిడి చేసుకుంటూ ఉంటాం. స్థానిక అనువంశిక విత్తనాలు.. రైతుల చేతుల్లో ఉండడం అత్యవసరం. సాంప్రదాయ విత్తనాలను సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలన్నదే నా కోరిక."

కౌన్సెలింగ్

ఆ మందులు సురక్షితమేనా?

డాక్టర్! మావారు కొత్తగా వయాగ్రా మందులు వాడుతున్నారు. వీటిని వైద్యులు సూచించకపోయినా, స్వయంగా కొనుక్కుని వాడుకోవడం సురక్షితమేనా?

- ఓ సోదరి, విశాఖపట్నం

వయాగ్రా అనేది అంగ స్తంభన సమస్యలున్నవారికి ఉద్దేశించిన మాత్రలు. అయితే ఈ టాబ్లెట్‌ను ప్లెజర్ డ్రగ్‌గా వాడేవారి సంఖ్య పెరుగుతోంది. ఈ మాత్ర వేసుకుంటే ఎక్కువ సామర్థ్యంతో, చురుగ్గా పాల్గొనగలుగుతామనీ ఎంతో మంది ఈ మాత్రలను ఎటువంటి వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో పనిలేకుండానే మెడికల్ షాపుల్లో కొని వాడేస్తూ ఉన్నారు. 25 మిల్లీగ్రాముల నుంచి 100 మిల్లీగ్రాముల మోతాదుల వరకూ మాత్రమే వైద్యులు సూచిస్తూ ఉంటే, అంతకుమించి 100 నుంచి 200 మిల్లీగ్రాములు మాత్రలనూ వాడుతూ ఉంటారు. యువత అలవరుచుకున్న ఈ వ్యసనాన్ని ఆధారంగా చేసుకుని కొన్ని మందుల కంపెనీలు నాణ్యత లేని, తక్కువ ధరకు దొరికే వయాగ్రాలను తయారు చేసి విక్రయిస్తున్నాయి. ఒరిజినల్ వయాగ్రా మాత్రతో పోలిస్తే, తక్కువ నాణ్యత కలిగిన మాత్ర చవకగా దొరుకుతోంది. పైగా అవసరం లేకపోయినా ఈ మాత్రలు వాడడంవల్ల కొన్ని దుష్ప్రభావాలకు గురికావలసి ఉంటుంది. అవేంటంటే...



- మాత్ర వేసుకున్నప్పుడు కలిగే అనుభూతి, సంతృప్తి, సామర్థ్యాలకు అలవాటు పడి, సెక్స్‌లో పాల్గొనే ప్రతిసారీ వయాగ్రా మీద ఆధారపడే పరిస్థితి నెలకొంటుంది. దాంతో వయాగ్రా వేసుకోనిదే సెక్స్ చేయలేని స్థితికి చేరుకుంటారు.
- తలనొప్పి, కంటిచూపు మందగించడం, కంటిచూపు నీలంగా మారడం, గుండె కొట్టుకునే వేగం పెరగడం, వాంతి అవుతున్న భావన కలగడం... వయాగ్రాకు ఉన్న ప్రధాన సైడ్ ఎఫెక్ట్స్.

కాబట్టి ఎటువంటి అంగస్తంభన సమస్యలు, శీఘ్రస్ఖలన సమస్యలు ఉన్నా వైద్యులను కలిసి చికిత్సలో భాగంగానే వయాగ్రా మాత్రలను వాడడం మేలు. ఎటువంటి సమస్యలూ లేనివారు వీటి జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం!

- డాక్టర్ రాహుల్ రెడ్డి,
ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్,
జూబ్లీహిల్స్ హైదరాబాద్.

కొబ్బరినూనెలో వీటిని కలిపి రాస్తే...

శిరోజాలకు తరచూ కొబ్బరినూనె రాసుకుంటే పోషణ అంది పొడవుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో దొరికే కొన్ని దినుసులను కలిపి రాస్తే మరింత ప్రయోజనం ఉంటుందని సూచిస్తున్నారు.

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక కప్పు కొబ్బరినూనె, రెండు చెంచాల మెంతులు వేసి బాగా మరిగించాలి. చల్లారిన తరవాత ఒక సీసాలో పోసి ఉంచుకోవాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని తలంతా పట్టించి పలుచని తువాలు కట్టుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే కురులు పొడవుగా పెరుగుతాయి. మెంతుల్లోని ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్‌వల్ల కురులు రాలడం తగ్గుతుంది.
- ఒక కప్పు కొబ్బరినూనెలో ఒక కట్ట కరివేపాకును తుంచి వేసి బాగా మరిగించాలి. గోరువెచ్చగా చల్లారిన తరవాత ఈ నూనెని వేళ్లతో తీసుకుంటూ మాడు మీద మర్దన చేయాలి. తల జిడ్డుగా అనిపిస్తే గంట తరవాత తల స్నానం చేయాలి. లేదంటే అలాగే ఉంచుకోవచ్చు. కరివేపాకులోని ఐరన్, కాల్షియం, బీటా కెరోటిన్ మూలకాలు వెంట్రుకల కుదుళ్లను గట్టి పరచి పొడవుగా పెరిగేలా చేస్తాయి. శిరోజాలు నెరవడాన్ని నిరోధిస్తాయి.



- ఒక గిన్నెలో మూడు చెంచాల కొబ్బరినూనె, ఒక చెంచా ఆముదం కలిపి గోరువెచ్చగా వేడిచేయాలి. రాత్రి పడుకునేముందు తలమీద వెంట్రుకల మొదళ్లకు పట్టించాలి. ఉదయాన్నే తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పొడవుగా పెరుగుతాయి. తలలో వేడి తగ్గి చుండ్రు రాకుండా ఉంటుంది.
- అరకప్పు కొబ్బరి నూనెలో గుప్పెడు వేపాకులు వేసి మరిగించాలి. తరవాత తలమీద వెంట్రుకలను పాయలుగా విడదీసి ఈ నూనెని పట్టించాలి. గంట తరవాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. వేపాకులోని యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల తలలో దురద, చుండ్రు, పేలు తొలగిపోతాయి. తల వెంట్రుకలు రాలడం తగ్గి పొడవుగా పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో కలబంద గుజ్జు కలిపి రాసుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది. శిరోజాల కొనలు చిట్లడం ఆగి చక్కగా పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో ఆవాల నూనె లేదా మందార నూనె కలిపి రాసుకుంటే కుదుళ్లు గట్టిపడి శిరోజాలు వేగంగా పెరుగుతాయి.

మన సంగతేంటి భయ్యా?

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితేంటి? తమ డబ్బు సంగతేంటి? అనే ఆందోళనలో ఉన్నారని సినీవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏడాది క్రితం హైదరాబాద్‌లోని ర్యాడిసన్ హోటల్‌లో బయటపడిన డ్రగ్స్ కేసు అంశంలో కేదార్ పేరు ప్రముఖంగా వినిపించింది. ఆ తర్వాత కేదార్ తన కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి పూర్తిగా మార్చుకున్నారు. అక్కడ అత్యంత ఖరీదైన జుమేరా లేక్‌టవర్స్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ వ్యాపారాలు చేస్తూ పలు లేక్‌వ్యూ ప్రాజెక్టులు చేపట్టారని సమాచారం. అలాగే, వందల కోట్ల రూపాయల విలువైన భూములు కలిగిన దుబాయ్‌లోని ఓ పెద్ద ల్యాండ్ డెవలపింగ్ కంపెనీలో కేదార్ కీలక వాటాదారుగా ఉన్నారని తెలిసింది. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు ఆ సంస్థ భూములను విక్రయిస్తుంటుంది. అయితే, టాలీవుడ్ ప్రముఖుల తరఫున కేదార్ ఆ కంపెనీలో భాగస్వామిగా ఉన్నారని దుబాయ్ వ్యాపార వర్గాల్లో ప్రచారం ఉంది. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ సమాచారం మేరకు సెలగంశెట్టి కేదార్ 9 కంపెనీల్లో డైరెక్టర్, చైర్మన్ వంటి కీలక హోదాల్లో ఉన్నారు. ఈ సంస్థలన్నీ చాలా వరకు కన్‌స్ట్రక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలకు సంబంధించినవే. అయితే, కేదార్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న అగ్ర హీరోలు, నిర్మాతలు, బడా దర్శకులతోపాటు కొందరు రాజకీయ నాయకులు కూడా ఆయా వ్యాపారాల్లో వందల కోట్లు పెట్టుబడిగా పెట్టారని తెలుస్తోంది. వీరందరికీ కేదార్ బినామీగా వ్యవహరించేవాడని చెబుతున్నారు. కేదార్‌ను కలిసేందుకే ఆయా ప్రముఖులు తరచూ దుబాయ్ వెళ్లేవారని, రెండు, మూడు రోజులు అతనితో ఉండి లావాదేవీలన్నీ పూర్తి చేసుకుని స్వదేశానికి వచ్చేవారని సినీ వర్గాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే, ఆ పెట్టుబడుల లెక్కలు, వివరాలన్నీ కేదార్‌కు మాత్రమే తెలియడంతో.. అతనిని నమ్మి డబ్బు ఇచ్చిన ప్రముఖుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారిందని అంటున్నారు. తమ పెట్టుబడి ఏ ప్రాజెక్టులో ఎంత ఉంది? ఎంత ఖర్చు అయ్యింది? ఆ ప్రాజెక్టులు ఎక్కడ ఉన్నాయి? అనే విషయాలు తెలియక.. ఇప్పుడేం చెయ్యాలో స్పష్టత లేక.. సదరు ప్రముఖులు కక్కలేక మింగలేక అవస్థలు పడుతున్నారని తెలుస్తోంది.

దుబాయ్‌లో లేను.. నేను ఇంట్లోనే ఉన్నా

» రోహిత్ రెడ్డి

కేదార్ చనిపోయిన సమయంలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అక్కడే ఉన్నారంటూ జరుగుతున్న ప్రచారంపై రోహిత్ రెడ్డి స్పందించారు. తాను దుబాయ్‌లో లేనని, హైదరాబాద్‌లోని తన నివాసంలోనే ఉన్నానని పేర్కొంటూ బుధవారం ఓ వీడియో విడుదల చేశారు. తనపై అసత్యప్రచారం జరుగుతోందని స్పష్టం చేశారు.

4 రోజులుగా ఆ మాజీ ఎమ్మెల్యే అక్కడే?

సినీ నిర్మాత కేదార్ మరణ వార్త బయటికొచ్చినప్పటి నుంచి అతనితో వ్యాపార సంబంధాలు పెట్టుకున్నారంటూ.. సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖుల పేర్లు బయటికొస్తూనే ఉన్నాయి. తాజాగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే పేరు బయటికొచ్చింది. కేదార్ మరణించినప్పుడు ఆయన అక్కడే ఉన్నట్టు సమాచారం. ఆయన మాత్రమే కాదు.. రాజకీయ, సినీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు నాలుగు రోజులుగా(కేదార్ మరణించక ముందు నుంచే) దుబాయ్‌లోనే ఉన్నట్టుగా తెలిసింది.

కేదార్‌ది అనుమానాస్పద మరణమేనా?

- » ఇంకా దొరకని దుబాయ్ పోలీసుల క్లియరెన్స్
- » సాధారణ మరణాల్లో 24 గంటల్లోనే ప్రక్రియ
- » అనుమానాస్పద మరణాల్లోనే ఆలస్యం
- » వరుస షెడ్యూల్స్‌తో నిద్ర లేని కేదార్?
- » మాజీ ఎమ్మెల్యేనూ ప్రశ్నించిన పోలీసులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సినీ నిర్మాత కేదార్ సెలగంశెట్టిది అనుమానాస్పద మరణమా? సాధారణ మృతి కాదా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు, దుబాయ్ నిబంధనలు అవుననే సమాధానం చెబుతున్నాయి. ఇలాంటి కేసుల్లో సాధారణంగా దుబాయ్ పోలీసులు సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు. కేసు తేలేదాకా వివరాలను బహిర్గతం చేయరు. కేదార్ కేసులోనూ.. ఆయన మరణానికి కారణాలను వెల్లడించలేదు. భారతీయ అధికారులకు, రాయబార కార్యాలయానికి కూడా.. ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.

సాధారణ మరణాలైతే..

దుబాయ్‌లో ఎవరైనా సాధారణంగా/సహజంగా మరణిస్తే.. పోలీసులు 24 గంటల్లోపు క్లియరెన్స్ ఇస్తారు. పోలీసు క్లియరెన్స్ అందగానే.. మృతదేహాన్ని ప్యాక్ చేసి, స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతాయి. కేదార్ విషయంలో మాత్రం రెండ్రోజులవుతున్నా.. ఈ ప్రక్రియ తుదిదశకు చేరుకోలేదు. కనీసం మరణానికి కారణాలను వెల్లడించలేదు. అనుమానాస్పద మరణాల విషయంలోనే పోలీసులు తమ దర్యాప్తును పూర్తి చేశాకే మృతదేహాలను అప్పగిస్తారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మరణించినా.. గల్ఫ్ దేశాల్లో పోలీసు నివేదిక తప్పనిసరి. మృతదేహానికి వైద్య పరీక్షలు పూర్తిచేశాకే బంధువులకు అప్పగిస్తారు. కేదార్ విషయంలో మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయినా.. వివరాలు వెలుగులోకి రాలేదు. పోస్టుమార్టం నివేదికను తదుపరి దర్యాప్తు నిమిత్తం తరలించారు. అయితే.. ఆ వివరాలను ఎక్కడికి పంపారనే విషయాన్ని బహిర్గతం చేయలేదు. అక్కడి నుంచి ప్రాథమిక నివేదిక వచ్చేవరకు మృతదేహాన్ని అప్పగించే అవకాశాలు లేవని తెలుస్తోంది. దుబాయ్ సహా.. గల్ఫ్ దేశాల్లో అనుమానాస్పద మరణాలు సంభవిస్తే.. బాధితుల దేశానికి చెందిన రాయబారులకు కూడా వివరాలు చెప్పరు. కేదార్ విషయంలోనూ అధికారవర్గాలకు సమాచారం లేదు. ఒకవేళ తమ దర్యాప్తు పూర్తయితే.. కాన్సులర్ ఎక్సెస్ అనుమతితో తొలుత భారత దౌత్య కార్యాలయానికి సమాచారం అందిస్తారు. ఆ తర్వాతే.. కేదార్ మృతికి కారణాలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

నిద్ర లేని కేదార్?

కేదార్ వరుస షెడ్యూళ్లతో మూడ్రోజులు నిద్రకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. శనివారం ఓ శుభకార్యానికి హాజరైన కేదార్.. ఆదివారం భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. సోమవారం సినీరంగ ప్రముఖులతో జరిగిన విందులో పాల్గొన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో తన ఫోన్‌ను వంటమనిషికి అందజేసి.. "11 గంటలకు మీటింగ్ ఉంది. అప్పటి వరకు నన్ను లేపొద్దు. ఒకవేళ అత్యవసర ఫోన్‌కాల్ వస్తే.. నిద్రలేపు" అని చెప్పి పడుకున్నారు. ఓ నంబర్ నుంచి వరుసగా ఫోన్‌కాల్స్ వస్తుండడంతో.. వంటమనిషి కేదార్‌ను లేపేందుకు ప్రయత్నించగా.. విగతజీవిగా కనిపించారు. సమాచారం అందుకుని, కేదార్ ఇంటికి వచ్చిన దుబాయ్ పోలీసులు వంటమనిషి సహా.. నలుగురిని విచారించారు. వారిలో ఓ మాజీ ఎమ్మెల్యే కూడా ఉన్నారు. సదరు మాజీ ఎమ్మెల్యే పోలీసులకు స్టేట్‌మెంట్ ఇవ్వగానే భారత్‌కు తిరుగుప్రయాణమైనట్లు తెలుస్తోంది.

చిత్రజ్యోతి

SINCE 1965

సరికొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నాం



- ఆది పినిశెట్టి

'కథాబలంతో పాటు బలమైన భావోద్వేగాలు ఉన్న హారర్ చిత్రం 'శబ్దం'. ఇప్పటివరకూ వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని హీరో ఆది పినిశెట్టి అన్నారు. 'వైశాలి' చిత్రం తర్వాత దర్శకుడు అరివళగన్, ఆది పినిశెట్టి కలయికలో వస్తున్న చిత్రమిది. సెవెన్ జీ ఫిల్మ్స్ శివ నిర్మించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్, ఎన్ సినిమాస్ ద్వారా ఈ నెల 28న 'శబ్దం' చిత్రం తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఆది పినిశెట్టి మీడియాతో పంచుకున్నారు. "ఇప్పటివరకూ ప్రేక్షకులకు తెలియని ఓ సరికొత్త ప్రపంచాన్ని 'శబ్దం' చిత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నాం. ఇందులో అతీత శక్తుల గురించి అన్వేషించే పరిశోధకుడి పాత్రలో కనిపిస్తాను. సాంకేతికంగా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. ఆత్మలకూ శబ్దానికి ఉన్న సంబంధం ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. 'వైశాలి' లానే 'శబ్దం' కూడా నిజాయితీగా చేసిన ప్రయత్నం. తప్పక ఫలిస్తుందనే నమ్మకం ఉంది. సిమ్రాన్, లైలా పాత్రలు సినిమాలో కీలకం. తమన్ నేపథ్య సంగీతం అద్భుతంగా కుదిరింది. ప్రస్తుతం 'అఖండ 2, మరకతమణి 2, మయసభ, డ్రైవ్' చిత్రాలు చేస్తున్నాను" అని ఆయన చెప్పారు.

మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు



'శివన్న' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే కన్నడ టాప్ స్టార్ శివ రాజ్‌కుమార్ క్యాన్సర్ నుంచి కోలుకున్నారు. మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు హాజరవుతానని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తనకు క్యాన్సర్ ఉన్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో తెలిసిందనీ, కుటుంబ సభ్యులు, వైద్యులు ఇచ్చిన ధైర్యంతో చికిత్స చేయించుకున్నాననీ శివ రాజ్‌కుమార్ ఆ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'కీమో థెరపీ చేయించుకుని షూటింగ్‌కు వెళ్లిన రోజులు ఉన్నాయి. మొత్తానికి క్యాన్సర్ నుంచి బయట పడ్డా. చికిత్స అనంతరం ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేస్తున్నా. ఆహార నియమాలు పాటిస్తున్నా. మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొంటున్నా. మార్చి 5న హైదరాబాద్ వెళ్లి రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటా. ఆ సినిమాలో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది' అని చెప్పారు శివ రాజ్‌కుమార్.



ప్రభాస్, ప్రశాంత్ వర్మ చిత్రం..
ఎప్పటినుంచి?




హీరో ప్రభాస్ స్పీడ్ పెంచారు. చేతిలో ఉన్న సినిమాలు చకచకా పూర్తి చేస్తూ కొత్త వాటి మీద కూడా దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన 'రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలు చేస్తున్నారు. ఇవి కాకుండా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందే 'స్పిరిట్' సినిమా చేయాలి. ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ నటించనున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా వీలైనంత త్వరలో ప్రారంభించాలని ప్రభాస్ ఆలోచన. ఇప్పుడు ఆయన మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారనీ, ఈ సినిమాకు సంబంధించి ప్రభాస్ లుక్ టెస్ట్ కూడా జరిగిందని సమాచారం. ఇవి కాకుండా 'కల్కి పార్ట్ 2', 'సలార్ 2' చిత్రాలను ప్రభాస్ చేయాలి. ఇన్ని సినిమాలు ప్రభాస్ ఎప్పుడు, ఎలా చేస్తారు, వీటిల్లో ఏది ముందు మొదలవుతుందనేదే ఆ చర్చ.

సందేశం, వినోదం అలరిస్తాయి



బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఆయన కథానాయకుడిగా మాధవ్ కోదాడ దర్శకత్వంలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించిన చిత్రం "నేనెక్కడున్నా'. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిమో చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ.. 'చిన్నప్పటి నుంచి దక్షిణాది చిత్రాలు చూస్తూ పెరిగాను. నాకు తెలుగు సినిమాలో అవకాశం వచ్చిందని తెలియగానే నాన్న సంతోషించారు. 'ప్రయత్నలోపం లేకుండా కష్టపడు, నిజాయితీగా పనిచెయ్యి' అని చెప్పారు. సందేశం, వినోదం కలబోతగా దర్శకుడు 'నేనెక్కడున్నా' చిత్రాన్ని తీర్చిదిద్దారు. యాక్షన్ సీక్వెన్స్‌లు, పతాక సన్నివేశాల్లో వచ్చే మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. ఈ చిత్రంతో హీరోగా తెలుగులో నిలదొక్కుకుంటాననే నమ్మకం ఉంది' అని చెప్పారు.

తెలుగులోకి 'ఛావా'



విక్కీ కౌశల్, రష్మిక జంటగా రూపుదిద్దుకున్న చారిత్రక చిత్రం 'ఛావా'. బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. పదకొండు రోజుల్లో ఈ సినిమా రూ. 417 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో బాలీవుడ్ సంబరాలు చేసుకుంటోంది. దక్షిణాది సినిమా వచ్చి తమని చావు దెబ్బ తీసిందని వాపోతున్న సినీ వర్గాలు 'ఛావా' విజయంతో ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఉత్తరాదిన విజయయాత్ర కొనసాగిస్తున్న ఈ సినిమా త్వరలో తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న తెలుగు ప్రేక్షకుల కోసం తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మార్చి 7న విడుదల చేస్తోంది.

పెళ్లి నేపథ్యంలో పీరియాడిక్ చిత్రం



పెళ్లి నేపథ్యంలో హాస్యం, వ్యంగం కలబోతగా రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించింది. 1980లో వరంగల్ జిల్లాలో జరిగిన సంఘటన ఆధారంగా అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత తెలిపారు.

రాక్షసుడు వస్తున్నాడు



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వంలో ఎంవీఆర్ కృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ఫిబ్రవరి 28కి బదులు మార్చి 7న 'రాక్షస' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ: జైబిన్ పి. జాకబ్

గుండెలోన గట్టి సప్పుడు



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, సవాళ్ల నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'నారి'. ఆమని ప్రధాన పాత్ర పోషించారు. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న ఈ చిత్రం విడుదలవుతోంది. మహా శివరాత్రి సందర్భంగా 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. రమణ గోగుల ఆలపించగా, వినోద్ కుమార్ విన్ను స్వరపరిచారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వి. రవికుమార్.

ఒగ్గు కళ నేపథ్యంలో



ఒగ్గు కళాకారుల జీవితాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, జయరామ్, ఛత్రపతి శేఖర్ కీలక పాత్రలు పోషించారు. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. దర్శకుడు చందు మొండేటి ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 'ఒగ్గు కళాకారుల జీవితాల్లోని ఒడిదొడుకులను వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం 'బ్రహ్మాండ' చిత్రం ద్వారా చేస్తున్నాం' అన్నారు. తెలంగాణ సంస్కృతి, పల్లె ప్రజల అనుబంధాలను దర్శకుడు తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, సినిమాటోగ్రఫీ: కాసుల కార్తీక్

శివుని పాటతో చంద్రేశ్వర



సురేష్ రవి, ఆశ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'చంద్రేశ్వర'. మన సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరిస్తూ దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ సినిమాను జీవా పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా సినిమాలోని శివుని పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఆర్కియాలజీ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. డివోషనల్ టచ్‌తో పాటు మంచి కామెడీ కూడా సినిమాలో ఉంది. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

కొత్తదనంతో క్రైమ్ కథ



ఊహించని మలుపులు, భయానక సంఘటనలతో రూపొందుతున్న చిత్రం 'బ్లడ్ రోజెస్'. ఎంజీఆర్ దర్శకత్వంలో హరీశ్ కే నిర్మించారు. సీనియర్ నటుడు సుమన్, రంజిత్‌రామ్, అప్సర రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా చిత్రబృందం బుధవారం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. భయపెట్టే కథనం, ఊపిరిసలపని ట్విస్టులతో మా క్రైమ్ కథా చిత్రం ఆద్యంతం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: పెద్దపల్లి రోహిత్, సినిమాటోగ్రఫీ: శివకుమార్ ఓగిరెడ్డి.



స్పోర్ట్స్

హైదరాబాద్ ● గురువారం 27 ఫిబ్రవరి 2025

చాంపియన్స్ ట్రోఫీలో నేడు | పాకిస్థాన్ X బంగ్లాదేశ్ | మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

టాప్-5లో కోహ్లీ



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌పై సూపర్ సెంచరీ కొట్టి ఫామ్‌లోకొచ్చిన విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశాడు. బుధవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో బ్యాటర్ల జాబితాలో విరాట్ ఓ స్థానం ఎగబాకి ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. శుభ్‌మన్ గిల్ నెంబర్ వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బాబర్ ఆజమ్ (770) రెండో ర్యాంక్‌లో ఉండగా.. రోహిత్ శర్మ (757) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. కేఎల్ రాహుల్ రెండుస్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్లలో తీక్షణ, రషీద్, కుల్దీప్ యాదవ్ వరుసగా 1, 2, 3 ర్యాంక్‌లను నిలబెట్టుకున్నారు.

ఆటగాళ్ల భద్రత విధులకు నిరాకరణ

పాక్ పోలీసులపై వేటు

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్‌లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈ మెగా టోర్నీ భద్రత కోసం నియమించిన పోలీసుల్లో దాదాపు వంద మందిపై ప్రభుత్వం వేటు వేసింది. పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ఈ పోలీసులు తమకు కేటాయించిన విధులను నిర్వర్తించేందుకు నిరాకరించడమే వేటుకు ప్రధాన కారణం. 'చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్‌లోని గడాఫీ స్టేడియం నుంచి జట్లు బస చేసే హోటళ్ల వరకు క్రికెటర్ల భద్రత కోసమని పోలీసులను కేటాయించాం. అయితే, వీరిలో కొందరు బాధ్యతలు స్వీకరించేందుకు నిరాకరించగా, మరికొందరు పూర్తిగా విధులకు హాజరుకాలేదు. భద్రత పరంగా ముఖ్యంగా విదేశీయులకు సంబంధించిన విషయంలో ఇలాంటివి జరిగితే సహించేదే లేదు. అందుకే వారికి వెంటనే విధుల నుంచి ఉద్వాసన పలికాం' అని పంజాబ్ ఐజీపీ ఉస్మాన్ అన్వర్ వెల్లడించారు.

జట్టుతో చేరిన మోర్నీ మోర్కెల్

దుబాయ్: వ్యక్తిగత కారణాల రీత్యా కొన్నిరోజుల క్రితం స్వదేశం వెళ్లిన టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మళ్లీ జట్టుతో కలిశాడు. బుధవారం ఇక్కడ జట్టు ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా చీఫ్ కోచ్ గంభీర్‌తో మోర్కెల్ మాట్లాడుతూ కనిపించాడు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆరంభ మ్యాచ్ బంగ్లాదేశ్‌తో పోరుకు ముందు మోర్కెల్ కుటుంబాన్ని కలిసేందుకు స్వదేశం దక్షిణాఫ్రికాకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.



ఇబ్రహీం జద్రాన్ (146 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్లతో 177)

ప్రపంచ క్రికెట్‌లో వేగంగా ఎదిగిన అఫ్ఘానిస్థాన్ మరోసారి తమ సత్తా ఏంటో చాటి చెప్పింది. చాంపియన్స్ ట్రోఫీలో తొలిసారి ఆడుతున్న అఫ్ఘాన్ సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించి టోర్నీలో ఆశలను సజీవంగా ఉంచుకుంది. మొదట ఇబ్రహీం జద్రాన్ రికార్డు శతకంతో భారీస్కోరు సాధించిన అఫ్ఘాన్.. ఆపై ప్రత్యర్థి ఛేదనలో ఎదురైన సవాల్‌ను దీటుగా అధిగమించి అద్భుత విజయాన్ని అందుకుంది. వరుసగా రెండో ఓటమితో బట్లర్ సేన నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది.

అఫ్ఘాన్ అదిరెన్

జద్రాన్ రికార్డు శతకం

ఇంగ్లండ్ అవుట్

ఒమర్జాయ్ ఆల్‌రౌండ్ షో

రూట్ సెంచరీ వృథా



రూట్ (120)

లాహోర్: చివరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో అద్భుత విజయంసాధించిన అఫ్ఘానిస్థాన్.. చాంపియన్స్ ట్రోఫీ సెమీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇబ్రహీం జద్రాన్ (146 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లతో 177) రికార్డు శతకంతో పాటు అజ్మతుల్లా ఒమర్జాయ్ (41, 5/58) ఆల్‌రౌండ్ షోతో.. గ్రూప్-బిలో బుధవారం జరిగిన చావోరేవో మ్యాచ్‌లో అఫ్ఘాన్ 8 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌కు షాకిచ్చింది. తొలుత అఫ్ఘాన్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 325 పరుగుల భారీ స్కోరు చేసింది. హస్మతుల్లా షాహిది (40), నబీ (40) రాణించారు. ఆర్చర్ మూడు, లివింగ్‌స్టోన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 317 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (111 బంతుల్లో 11 ఫోర్లు, సిక్సర్‌తో 120) సెంచరీ వృథా అయింది. నబీ 2 వికెట్లు సాధించాడు. ఈ ఓటమితో టోర్నీలో బట్లర్ సేన కథ ముగిసింది.

బ్యాటర్ల వైఫల్యం: భారీ ఛేదనలో ఓపెనర్ సాల్ట్ (12), జేమీ స్మిత్ (9), డకెట్ (38), బ్రూక్ (25) విఫలం కావడంతో ఇంగ్లండ్ 133/4తో ఇంగ్లండ్ ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో రూట్.. కెప్టెన్ బట్లర్ (38)తో కలిసి ఐదో వికెట్‌కు 83 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, బట్లర్, లివింగ్‌స్టోన్ (10) స్వల్ప తేడాతో అవుటవడంతో ఇంగ్లండ్ శిబిరంలో గుబులు రేగింది. కానీ, సెంచరీ పూర్తి చేసుకొన్న రూట్.. ఓవర్టన్ (32)తో కలిసి ఏడో వికెట్‌కు 54 పరుగులతో పోరాడాడు. కాగా, కీలక సమయంలో రూట్, ఓవర్టన్‌ను అవుట్ చేసిన ఒమర్జాయ్ మ్యాచ్‌ను అఫ్ఘాన్ వైపు మొగ్గేలా చేశాడు. ఆర్చర్ (14)ను ఫారూకీ పెవిలియన్ చేర్చాడు. చివరి ఓవర్‌లో విజయానికి 13 పరుగులు కావాల్సి ఉండగా.. రషీద్ (5)ను ఒమర్జాయ్ వెనక్కిపంపి ఇంగ్లండ్ కథ ముగించాడు.

ఆరంభంలో తడబాటు: జద్రాన్ ముందుండి నడిపించడంతో.. అఫ్ఘాన్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్.. ఆరంభంలోనే తడబడింది. మరో ఓపెనర్ గుర్బాజ్ (6), సెదికుల్లా అటల్ (4), రహ్మత్ షా (4)ను ఆర్చర్ స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చడంతో అఫ్ఘాన్ పవర్‌ప్లేలోపే 3/37తో కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ హస్మతుల్లాతో కలసి జద్రాన్ నాలుగో వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. అయితే, హస్మతుల్లాను బౌల్డ్ చేసిన అదిల్ రషీద్.. జట్టుకు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఒమర్జాయ్ చక్కని సహకారం అందించడంతో స్కోరు వేగం పుంజుకొంది. 37వ ఓవర్‌లో జద్రాన్ సింగిల్‌తో సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. మరోవైపు ఒమర్జాయ్ కూడా ధాటిగా ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. కానీ, ఒమర్జాయ్‌ను అవుట్ చేసిన ఓవర్టన్.. ఐదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. చివరి 10 ఓవర్లలో నబీ, జద్రాన్ 55 బంతుల్లో 111 పరుగులు జోడించడంతో.. అఫ్ఘాన్ స్కోరు 300 మార్క్ దాటింది.



అజ్మతుల్లా ఒమర్జాయ్ (41, 5/58)

1 చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్‌గా జద్రాన్ (177). ఇంగ్లండ్ ఆటగాడు బెన్ డకెట్ (165) రికార్డును జద్రాన్ బ్రేక్ చేశాడు. అఫ్ఘాన్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు కూడా జద్రాన్‌దే.

స్కోరుబోర్డు

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (బి) ఆర్చర్ 6, జద్రాన్ (సి) ఆర్చర్ (బి) లివింగ్‌స్టోన్ 177, సెదికుల్లా అటల్ (ఎల్బీ) ఆర్చర్ 4, రహ్మత్ షా (సి) రషీద్ (బి) ఆర్చర్ 4, హస్మతుల్లా షాహిది (బి) రషీద్ 40, ఒమర్జాయ్ (సి) సబ్/బాంటన్ (బి) ఓవర్టన్ 41, నబీ (సి) రూట్ (బి) లివింగ్‌స్టోన్ 40, నైబ్ (నాటౌట్) 1, రషీద్ ఖాన్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 50 ఓవర్లలో 325/7; వికెట్ల పతనం:** 1-11, 2-15, 3-37, 4-140, 5-212, 6-323, 7-324; **బౌలింగ్:** ఆర్చర్ 10-0-64-3, మార్క్ ఉడ్ 8-0-50-0, ఓవర్టన్ 10-0-72-1, రషీద్ 10-0-60-1, రూట్ 7-0-47-0, లివింగ్‌స్టోన్ 5-0-28-2.

ఇంగ్లండ్: సాల్ట్ (బి) ఒమర్జాయ్ 12, డకెట్ (ఎల్బీ) రషీద్ 38, జేమీ స్మిత్ (సి) ఒమర్జాయ్ (బి) నబీ 9, రూట్ (సి) గుర్బాజ్ (బి) ఒమర్జాయ్ 120, బ్రూక్ (సి అండ్ బి) నబీ 25, బట్లర్ (సి) షా (బి) ఒమర్జాయ్ 38, లివింగ్‌స్టోన్ (సి) గుర్బాజ్ (బి) నైబ్ 10, ఓవర్టన్ (సి) నబీ (బి) ఒమర్జాయ్ 32, ఆర్చర్ (సి) నబీ (బి) ఫారూఖీ 14, రషీద్ (సి) జద్రాన్ (బి) ఒమర్జాయ్ 5, ఉడ్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 49.5 ఓవర్లలో 317 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-19, 2-30, 3-98, 4-133, 5-216, 6-233, 7-287, 8-309, 9-313; **బౌలింగ్:** ఫారూఖీ 10-0-62-1, ఒమర్జాయ్ 9.5-0-58-5, నబీ 8-0-57-2, రషీద్ ఖాన్ 10-0-66-1, నూర్ అహ్మద్ 10-0-51-0, గుల్బదిన్ నైబ్ 2-0-16-1.

బ్రంట్ భళా

యూపీపై ముంబై ఘన విజయం



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ మరో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాట్ షివర్ బ్రంట్ (44 బంతుల్లో 13 ఫోర్లతో 75 నాటౌట్, 3/18) ఆల్‌రౌండ్ షోతో భళా అనిపించడంతో ముంబై 8 వికెట్లతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 142/9 స్కోరు చేసింది. గ్రేస్ హ్యారిస్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45), దినేశ్ బ్రింద (30 బంతుల్లో 5 ఫోర్లతో 33), శ్వేత సెహ్రావత్ (13 బంతుల్లో 19) మాత్రమే రాణించారు. బ్రంట్ మూడు, సంస్కృతి గుప్తా, షబ్నిమ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బ్రంట్ ధనాధన్ ఇన్నింగ్స్‌కు 'హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59) మెరుపు హాఫ్ సెంచరీ తోడవడంతో ముంబై 17 ఓవర్లలో 143/2 స్కోరు చేసి సులువుగా నెగ్గింది. మాథ్యూస్, బ్రంట్ రెండో వికెట్‌కు 82 బంతుల్లోనే 133 పరుగులు జత చేశారు. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ముంబై అగ్రస్థానానికి దూసుకొచ్చింది.

సంక్షిప్తస్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 142/9 (హ్యారిస్ 45, బ్రింద 33, శ్వేత 19, బ్రంట్ 3/18, సంస్కృతి 2/11, షబ్నిమ్ 2/33)

ముంబై: 17 ఓవర్లలో 143/2 (బ్రంట్ 75 నాటౌట్, మాథ్యూస్ 59, దీప్తిశర్మ 1/25, ఎకిల్‌స్టోన్ 1/29).

డబ్ల్యూపీఎల్‌లో నేడు | బెంగళూరు x గుజరాత్ | రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

డానిష్ సెంచరీ

విదర్భ 254/4 ● కేరళతో రంజీట్రోఫీ ఫైనల్




నాగ్‌పూర్: డానిష్ మలేవార్ ((138 బ్యాటింగ్), కరుణ్ నాయర్ (86) భాగస్వామ్యంతో.. కేరళతో బుధవారం ప్రారంభమైన రంజీట్రోఫీ ఫైనల్లో మొదటి రోజు విదర్భ కోలుకుంది. ఆట ఆఖరికి ఆ జట్టు 4 వికెట్లకు 254 పరుగులు చేసింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేపట్టిన విదర్భ ఓ దశలో 24 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి తీవ్ర ఇక్కట్లలో పడింది. ఈ తరుణంలో మలేవార్, కరుణ్ నాలుగో వికెట్‌కు 215 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. మూడు సెషన్లపాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరు 69 ఓవర్లపాటు ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొన్నారు. మలేవార్ దూకుడు ప్రదర్శించగా, నాయర్ సంయమనంతో బ్యాటింగ్ చేసి అతడికి అండగా నిలిచాడు. బౌండరీతో..మలేవార్ సీజన్‌లో రెండో శతకం పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో నాలుగో సెంచరీకి చేరువలో నాయర్ రనౌట్‌గా వెనుదిరిగాడు. మొదటి రోజు ఆఖరికి మలేవార్‌తోపాటు యష్ ఠాకూర్ (5) క్రీజులో ఉన్నాడు.

తోటి బాక్సర్‌పై గుడ్డుతో దాడి!



మాంచెస్టర్: బ్రిటన్ బాక్సర్లు ఇయుబాంక్ జూనియర్-కానర్ బెన్ ఏప్రిల్ 26న బౌట్‌లో తలపడనున్నారు. ఆ బౌట్‌కు సంబంధించి మంగళవారం ఇక్కడ జరిగిన ప్రచార కార్యక్రమంలో బెన్ మొహంపై క్రిస్ కోడిగుడ్డు విసరడం సంచలనం రేపింది. వాస్తవంగా 2022లోనే క్రిస్-కానర్ తలపడాల్సి ఉంది. కానీ కానర్ బెన్ డోప్ పరీక్షకు హాజరుకాలేదు. దాంతో ఆ బౌట్ ఆగిపోయింది. 'డోప్'కు రాకపోవడంతో కానర్‌పై సస్పెన్షన్ విధించారు. అది ఇటీవల పూర్తి కావడంతో ఇద్దరు బాక్సర్ల మధ్య మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇక.. కానర్ నాటి నిర్వాకాన్ని గుర్తు చేస్తూ అతడిపై కోడిగుడ్డు కొట్టినట్టు ఇయుబాంక్ జూనియర్ తెలిపాడు. ఈ ఘటన తర్వాత ఇద్దరు బాక్సర్ల భద్రతా సిబ్బంది మధ్య తోపులాట చోటుచేసుకుంది. దాంతో వాతావరణం ఒక్కసారి ఉద్రిక్తంగా మారింది.

కాసులు కురిపించిన పసిడి



రెండు నెలల్లోనే 12% పెరిగిన విలువ

అమెరికా, ఆస్ట్రేలియా ఈక్విటీ మార్కెట్లు దిగదుడుపు

అంతర్జాతీయ విపణిలో పసిడి ధర చుక్కలంటుతోంది. ఈ నెల ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో 2,956 డాలర్లను (సుమారు రూ.2.57 లక్షలు) తాకింది. ప్రస్తుతం 2,915 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గత ఏడాది పసిడి పెట్టుబడులు మదుపరులకు 27 శాతం లాభాలు పంచాయి. గత 14 సంవత్సరాల్లో బంగారంపై పెట్టుబడులు ఈ స్థాయిలో లాభాలు అందించడం ఇదే ప్రథమం. 2025 సంవత్సరంలో తొలి రెండు నెలల కాలంలోనే పసిడిలో పెట్టుబడులు మదుపరులకు 12 శాతం వరకు లాభాలు పంచాయి. ఇదే సమయంలో అమెరికా, ఆస్ట్రేలియా స్టాక్ మార్కెట్లలో మదుపు చేసిన మదుపరులకు వచ్చిన లాభం రెండు నుంచి నాలుగు శాతం మాత్రమే. భారత స్టాక్ మార్కెట్ మాత్రం మదుపరులకు 4.64 శాతం నష్టాలు మిగిల్చింది. ఈ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఔన్స్ పసిడి ధర త్వరలోనే అంతర్జాతీయ మార్కెట్‌లో 3,000 డాలర్లకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

పసిడి పరుగుకు ప్రధాన కారణాలు :

- ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి.
- వెంటాడుతున్న ద్రవ్యోల్బణ భయాలు.
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.
- కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.
- డిమాండ్‌కు తగ్గట్టు పసిడి ఉత్పత్తి, సరఫరా లేకపోవడం.
- స్టాక్ మార్కెట్ అనిశ్చితితో సురక్షిత పెట్టుబడిగా మారడం.
- నగలతో పాటు పారిశ్రామిక రంగంలోనూ పసిడి వినియోగం పెరగడం.
- రూపాయితో సహా ప్రధాన కరెన్సీలతో పెరుగుతున్న డాలర్ మారకం రేటు.

ఈక్విటీ మార్కెట్‌పై బేర్ పట్టు



6 నెలల్లో సూచీలు 14 % డౌన్

» రూ.82.51 లక్షల కోట్లు హాం ఫట్

» రూ.లక్ష కోట్ల ఎఫ్‌పీఐల పెట్టుబడులు వెనక్కి

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్ 'బేర్'మంటోంది. గత ఏడాది సెప్టెంబరు 27న సెన్సెక్స్ 85,978.25 పాయింట్లు, నిఫ్టీ 26,277.35 పాయింట్ల జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకి రికార్డులు సృష్టించాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిఫ్టీ 3,729.8 పాయింట్లు (14.19 శాతం), సెన్సెక్స్ 11,376.13 పాయింట్లు (13.23 శాతం) నష్ట పోయాయి. దీంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.479 లక్షల కోట్ల నుంచి మంగళవారానికి రూ.396.49 లక్షల కోట్లకు చేరింది. అంటే మార్కెట్ విలువ రూ.82.51 లక్షల కోట్లు క్షీణించిందన్న మాట. గత రెండు నెలల కాలంలోనే ఎఫ్‌పీఐలు దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడులను మన మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్నాయి. ఈ కింది అంశాలు దేశీయ స్టాక్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నాయి.

- వర్తమాన ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికం వృద్ధి రేటు 5.4 శాతానికి పడిపోవడం.
- మన కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవడం.
- ఎఫ్‌పీఐలు సెల్ ఇండియా, బై చైనా పాలసీని అనుసరించడం.
- కంపెనీల డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం.
- ట్రంప్ ఆర్థిక విధానాలతో పెరుగుతున్న వాణిజ్య యుద్ధ భయాలు.
- ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి.
- డాలర్‌తో బేర్ మంటున్న రూపాయి మారకం రేటు.
- ద్రవ్యోల్బణం ఇంకా అధికంగానే ఉండడం.
- అమెరికా రుణ పత్రాలపై అధిక వడ్డీ రేట్లు.
- అమెరికా ఫెడ్ రిజర్వు వడ్డీ రేట్ల తగ్గింపులకు బ్రేక్ ఇస్తుందనే అంచనాలు.

బిజినెస్

హైదరాబాద్‌లో ఎజిలీసియం 'జీసీసీ'

2,000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. లైఫ్ సైన్సెస్, ఫార్మా కంపెనీలకు జనరేటివ్ ఏఐ ఆధారిత వినూత్న డేటా అనలిటికల్ సేవలందించే అమెరికా కంపెనీ ఎజిలీసియం 'లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ అండ్ టాలెంట్ డెవలప్‌మెంట్ లాబ్' పేరుతో ఈ జీసీసీని ఏర్పాటు చేస్తోది. ఇందుకోసం ఇప్పటికే బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఇంజనీరింగ్ రంగాలకు చెందిన 50 మంది నిపుణుల నియామకాలు పూర్తి చేసినట్టు కంపెనీ వ్యవస్థాపకులు, సీఈఓ రాజబాబు 'బయో ఏషియా, 2025' సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. 2027 నాటికి తమ హైదరాబాద్ జీసీసీలో 2,000 ఉద్యోగాలు కల్పించబోతున్నట్టు తెలిపారు. లైఫ్ సైన్సెస్ కంపెనీల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు, వాటి అమ్మకాలు, మార్కెటింగ్‌కు జెనరేటివ్ ఏఐ ఆధారిత వినూత్న డేటా సేవలందించడం ఎజిలిసిఎం కంపెనీ ప్రత్యేకత. మౌలిక సదుపాయాలతో పాటు నిపుణులైన ఉద్యోగుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో తమ జీసీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు రాజబాబు చెప్పారు. ప్రస్తుతం తమకు ఉన్న యాభైకి పైగా క్లయింట్లలో 10 నుంచి 20 శాతం భారతీయ కంపెనీలన్నారు.

ఫోక్స్‌వ్యాగన్ కేసు మార్చి 10కి వాయిదా

ముంబై: స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా దిగుమతి సుంకాల ఎగవేత కేసు వచ్చే నెల 10కి వాయిదా పడింది. ఈ లోగా ఈ కేసు కాల పరిమితిపై అఫిడవిట్ ఫైల్ చేయాలని బొంబాయి హైకోర్టు కస్టమ్స్ శాఖను ఆదేశించింది. తాను దిగుమతి చేసుకునే కార్లను విడివిడిగా చూపుతూ ఫోక్స్‌వ్యాగన్ తక్కువ సుంకాలతో సరిపెడుతోందని, అందుకు 140 కోట్ల డాలర్లు (సుమారు రూ.12,000 కోట్లు) చెల్లించాలని కస్టమ్స్ శాఖ ఇటీవల కంపెనీకి నోటీసులు జారీ చేసింది. కంపెనీ దీన్ని బొంబాయి హైకోర్టులో సవాల్ చేసింది.

ఎయిర్‌టెల్-టాటా డీటీహెచ్ విలీనం!

» చర్చలను నిర్ధారించిన ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: కేబుల్ టీవీ, డీటీహెచ్ రంగంలో మరో పెద్ద విలీనానికి రంగం సిద్ధమవుతోంది. తన కేబుల్ టీవీ, డీటీహెచ్ సేవలను టాటా గ్రూప్ కంపెనీ టాటా ప్లేలో విలీనం చేసేందుకు భారతి ఎయిర్‌టెల్ చర్చలు జరుపుతోంది. కంపెనీ ఈ విషయాన్ని స్వయంగా నిర్ధారించింది. భారతి టెలిమీడియా అనే అనుబంధ కంపెనీ ద్వారా ఎయిర్‌టెల్ ఈ సేవలు అందిస్తోంది. అయితే ఈ వెంచర్ పూర్తిగా నష్టాల్లో ఉండడంతో టాటా గ్రూప్‌లో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ చర్చలు ఫలిస్తే దేశ డీటీహెచ్ రంగంలో ఇది రెండో విలీనం అవుతుంది. 2017లో డిష్ టీవీ వీడియోకాన్ టీ2హెచ్ విలీనమయ్యాయి.

స్పైస్‌జెట్ లాభం రూ.26 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ డిసెంబరు త్రైమాసికంలో రూ.26 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ నమోదు చేసిన నష్టం రూ.300 కోట్లుంది. మొత్తం ఆదాయం కూడా సెప్టెంబరు త్రైమాసికంతో పోల్చితే 35% పెరిగి రూ.1651 కోట్లకు చేరినట్టు కంపెనీ వెల్లడించింది. అయితే గత డిసెంబరు త్రైమాసికంలో ఆర్జించిన రూ.2149 కోట్లతో పోల్చితే మాత్రం ఆదాయం క్షీణించింది.

100 కోట్ల మంది భారతీయుల వద్ద

ఖర్చుకు డబ్బుల్లేవ్



» స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగేది 13-14 కోట్ల మందే..

» బ్లూమ్ వెంచర్స్ అంచనా

ముంబై: భారత జనాభా 140 కోట్ల పైమాటే. కానీ, దాదాపు 100 కోట్ల మంది భారతీయుల సంపాదన అంతంత మాత్రమేనని.. స్వేచ్ఛగా ఖర్చు చేసేందుకు వారి దగ్గర డబ్బు లేదని వెంచర్ క్యాపిటల్ సంస్థ బ్లూమ్ వెంచర్స్ అంచనా వేసింది. దేశంలో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వినియోగదారు వర్గం సైజు కేవలం 13-14 కోట్లేనని, ఇది మెక్సికో జనాభాకు సమానమని నివేదిక పేర్కొంది. మరో 30 కోట్ల మంది ఆశావహ వినియోగదారులని, ఇప్పుడిప్పుడే తమ పర్సుల్లోంచి డబ్బులు తీయడం మొదలుపెట్టారంటోంది. అయితే, వీరు ఆచితూచి ఖర్చు చేసేవారని అంటోంది. నివేదికలోని మరిన్ని విషయాలు..


- ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో ఇప్పుడున్న వినియోగదారు వర్గం ఆర్థికంగా మరింతగా వృద్ధి చెందుతున్నంతగా ఈ వర్గం సైజు మాత్రం విస్తరించడం లేదు. అంటే, సంపన్నుల సంఖ్య పెరగట్లేదు. ధనవంతులే మరింత సిరిమంతులవుతున్నారట. ఇది భారత వినియోగదారు మార్కెట్ దిశను మారుస్తోంది. ముఖ్యంగా ప్రీమియమైజేషన్ ట్రెండ్ పెరుగుతోంది.
- చాలా బ్రాండ్లు విస్తృత ప్రజానీకం కొనగలిగే ఉత్పత్తులకు బదులు ధనవంతులైన వారి కోసం ఖరీదైన, అప్‌గ్రేడెడ్ ఉత్పత్తుల విక్రయంపైనే ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయి. అత్యంత విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీల్లో గృహాలు, ఐఫోన్ వంటి ప్రీమియం మొబైల్స్ విక్రయాల్లో అనూహ్య వృద్ధే ఇందుకు నిదర్శనం. దేశీయ స్థిరాస్తి మార్కెట్లో అందుబాటు ధరలో లభించే గృహాల ప్రాజెక్టుల వాటా ఐదేళ్ల క్రితం 40 శాతంగా ఉండగా.. ఇప్పుడది 18 శాతానికి తగ్గింది. మార్కెట్లో బ్రాండెడ్ ఉత్పత్తుల మార్కెట్ వాటా వేగంగా పెరుగుతోంది.
- మంచి అనుభూతిని పంచే ఖరీదైన సేవలకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. కోల్డ్ ప్లే, ఎడ్ షీరన్ వంటి పాశ్చాత్య గాయకులు భారత్‌లో నిర్వహించిన లైవ్ షోల టిక్కెట్లు హాట్ కేక్‌ల్లా అమ్ముడయ్యాయి.
- కొవిడ్ సంక్షోభం తర్వాత కాలంలో ధనవంతుల ఆస్తి మరింత పెరగగా.. పేదలు మరింత పేదరికంలోకి జారుకున్నారన్న అభిప్రాయాన్ని ఈ రిపోర్టులో వెల్లడైన విషయాలు సమర్థిస్తున్నాయి. వాస్తవానికి ఈ ట్రెండ్ కరోనా సంక్షోభానికి ముందే ప్రారంభమైంది. దేశంలో ఆర్థిక అసమానత పెరుగుతూవస్తోంది.
- దేశ సంపదలో 57.7 శాతం కేవలం 10 శాతం మంది భారతీయుల వద్దే కేంద్రీకృతమై ఉంది. 1990లో ఈ వాటా 34 శాతమే. కాగా, దేశ సంపదలో ఆర్థిక స్తోమత పరంగా దిగువ 50 శాతంలో ఉన్న జనాభా వాటా 22.2 శాతం నుంచి 15 శాతానికి పడిపోయింది.

పన్ను ఎగవేతదారులపై

ఐటీ నజర్

న్యూఢిల్లీ: గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో (2022-23, 2023-24) పన్ను వినహాయింపుల్లో అవకతవకలకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్న 40,000 మంది పన్ను చెల్లింపుదారులపై ఐటీ శాఖ నిఘా పెట్టింది. టీడీఎస్ (మూలస్థానంలో పన్ను వసూలు) క్లెయిమ్స్‌లో అవకతవకతలను గుర్తించేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సమగ్రమైన 16 అంచెల వ్యూహాన్ని రూపొందించింది. అనుమానిత పన్ను చెల్లింపుదారుల ఐటీ రిటర్నులను పునఃసమీక్షించేందుకు ఆదాయపు పన్ను శాఖకు చెందిన డేటా అనలిటిక్స్ బృందం ఇప్పటికే జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. తొలుత వారికి నోటీసు పంపి, వారి రిటర్నుల్లో ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకునేందుకు ఓ అవకాశం ఇవ్వనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తరచుగా ఇలాంటి తప్పులకు పాల్పడుతున్నవారిపై, ముఖ్యంగా ముందస్తు పన్ను చెల్లింపులు- పన్ను మినహాయింపుల్లో వ్యత్యాసం ఉన్న కేసులు, మినహాయింపుదారు వివరాల్లో తరచుగా సవరణలు జరుగుతున్న సందర్భాలపై ఐటీ డిపార్ట్‌మెంట్ ప్రధానంగా దృష్టిసారించనున్నట్లు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	485
వరంగల్	447	గోదావరి	480
చిత్తూరు	493	విశాఖపట్నం	482
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75	విజయవాడ	76
వరంగల్	75	గుంటూరు	76
కరీంనగర్	75	ఒంగోలు	76
మహబూబ్‌నగర్	75	చిత్తూరు	66
కర్నూలు	75	నెల్లూరు	71
విశాఖపట్నం	75	అనంతపురం	71
గోదావరి	76		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,820 ▼	80,500 ▼	1,06,000 ▼
విజయవాడ	89,500 ▲	84,500 ▲	99,000 ▲
విశాఖపట్నం	85,970 ▼	78,810 ▼	94,730 ▼
రాజమండ్రి	87,820 ▼	80,500 ▼	98,000 ▼
ప్రొద్దుటూరు	88,350 ▼	81,810 ▼	97,200 ▼
ముంబై	86,650 ▲	79,370 ▲	95,770 ▲

పోసాని అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)



వెళ్లారు. రాత్రి 8.45 గంటల సమయంలో మైహోం భూజాలోని పోసాని నివాసానికి వెళ్లి, ఆయనను అరెస్టు చేశారు. ఆయనను గురువారం రాజంపేట కోర్టులో హాజరుపరిచే అవకాశముంది. అరెస్టు సమయంలో పోసాని పోలీసులకు సహకరించకుండా వాగ్వాదానికి దిగారు. 'నోటీసులు తీసుకోను. అరెస్టు చేసుకోండి. అసలు మీరెవరు? ఎలా మా ఇంటికి వస్తారు?' అని ప్రశ్నించడంతో... తాము అన్నమయ్య జిల్లా పోలీసులమని ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. అరెస్టు చేస్తున్నాం... సహకరించండి అని కోరారు. "ముందు నాకు నోటీసు ఇవ్వండి. నేను ఆస్పత్రికి వెళ్లి ట్రీట్‌మెంట్ చేయించుకుని... తర్వాత మీ దగ్గరికి వస్తాను" అని పోలీసులకు సూచించారు. అలా కుదరదని, అరెస్టుకు సహకరించకపోతే తమ డ్యూటీ తాము చేయాల్సి వస్తుందని పోలీసులు స్పష్టం చేశారు. 'నాకు ఆరోగ్యం బాగలేదు... ఆపరేషన్ చేయించుకున్నా. పేషంట్‌ను కూడా పట్టించుకోరా' అని మళ్లీ పోసాని ఆగ్రహించారు. పోసాని సతీమణికి నోటీసు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించారు. 'సర్‌ను అరెస్టు చేస్తున్నాం, నోటీసు తీసుకోండి మేడమ్' అని కోరడంతో... 'తీసుకోవద్దు... తీసుకోవద్దు' అని పోసాని ఆమెను ఆదేశించారు. 'నోటీసు తీసుకోండి సార్' అని పోలీసు అధికారి పదేపదే కోరినా... 'నోటీసు తీసుకునేదిలేదు. అరెస్టు చేసుకోండి' అని విసురుగా బదులిచ్చారు. 'ఆడవాళ్ల మీద రౌడీయిజం చేయొద్దు' అని పోలీసులను హెచ్చరించారు. 'మేం రౌడీయిజం చేయడంలేదు. నోటీసు ఇస్తున్నాం' అని ఎస్‌ఐ బదులిచ్చారు. 'నేను మాత్రలు వేసుకోవాలి. అన్నం తింటా' అన్నారు. ఆయన వేసుకోవాల్సిన మందులు ఇవ్వాలని పోలీసులు సూచించగా... 'ఏ మాత్ర ఎప్పుడు వేసుకోవాలో ఆయనకు తెలియదు. అన్నీ నేనే ఇస్తా' అని ఆయన సతీమణి చెప్పారు. అన్ని విషయాలు తాము దగ్గరుండి జాగ్రత్తగా చూసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు. దుస్తులు మార్చుకుని రావాలని పోసానిని కోరారు. ఆయన కొంత సమయం తీసుకుని దుస్తులు మార్చుకుని, పోలీసులతో వచ్చారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాకముందు నుంచే పోసాని టీడీపీ, జనసేన అగ్రనేతలపై అడ్డగోలుగా మాట్లాడటం మొదలుపెట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై శ్రుతిమించి వ్యక్తిగత విమర్శలకు దిగేవారు. ఇక... వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన మరింత రెచ్చిపోయారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. దీనికి ప్రతిఫలంగా జగన్ ఆయనకు ఏపీ ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ) ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. ప్రెస్‌మీట్లు, టీవీ డిబేట్లు, సోషల్ మీడియా వేదికలపై టీడీపీ, జనసేన నేతలను పోసాని అసభ్య పదజాలంతో తిట్టిన సందర్భాలు ఎన్నో! పత్రికల్లో ప్రచురించలేని భాష కూడా వాడారు. పోసాని వ్యాఖ్యలపై కడుపుమండిన టీడీపీ, జనసేన కార్యకర్తలు అప్పట్లో ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోసాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరు, విజయవాడ, నర్సారావుపేట, అన్నమయ్య, అనంతపురం, బాపట్ల, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి తదితర ప్రాంతాల్లో ఫిర్యాదులు వచ్చాయి. ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా పదికిపైగా కేసులు నమోదయ్యాయి.

రంగంలోకి అన్నమయ్య జిల్లా పోలీసులు

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 24వ తేదీ మణి అనే జనసేన నాయకుడు పోసానిపై ఫిర్యాదు చేశారు. కులాల పేరుతో దూషించడం, ప్రజల్లో వర్గ విభేదాలు సృష్టించడం వంటి అభియోగాలతో భారత న్యాయ సంహితలోని సెక్షన్ 196, 353 (2), 111 రెడ్‌విత్ 3(5) కింద కేసు (క్రైమ్ నంబర్ 65/2025) నమోదు చేశారు. పోసాని మాట్లాడిన మాటల వీడియో, ఆడియో టేపులను పోలీసులు పరిశీలించారు. ఇదే కేసులో ఆయనను బుధవారం రాత్రి అరెస్టు చేశారు.

జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంతో రెండు ప్రాణాలు బలి

- చెరువును శుభ్రం చేస్తూ తండ్రీ కొడుకు మృత్యువాత

కార్వాన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారుల నిర్లక్ష్యంతో రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. చెరువును శుభ్రం చేసేందుకు అందులోకి దిగిన తండ్రీ కొడుకులు నీట మునిగి చనిపోయారు. ఈ ఘటన బుధవారం హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లోని హుడాపార్కు చెరువులో జరిగింది. హుడా పార్కు చెరువును శుభ్రం చేసేందుకు ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేసే మహ్మద్ ఖరీమ్ (38) అందులోకి దిగాడు. శివరాత్రి సందర్భంగా పాఠశాలకు సెలవు ఉండడంతో స్థానికంగా 9వ తరగతి చదువుతున్న ఖరీమ్ కొడుకు సోహెల్ (15) కూడా తండ్రికి సాయం చేసేందుకు చెరువులోకి దిగాడు. వీరిద్దరూ చెరువులో గడ్డిని తొలగిస్తుండగా, లోతైన ప్రాంతానికి వెళ్లిన సోహెల్ అక్కడ బురదలో ఇరుక్కుపోయి నీట మునిగాడు. అతడిని కాపాడేందుకు వెళ్లిన తండ్రి ఖరీమ్ కూడా బురదలో చిక్కుకుపోయి నీట మునిగి ప్రాణాలు విడిచాడు. తోటి ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. డీఆర్‌ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అరగంట వ్యవధిలో రెండు మృతదేహాలను వెలికి తీశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి భద్రతా పరికరాలను సమకూర్చలేదని, కనీసం లైఫ్ జాకెట్లు ఇవ్వకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే కౌసర్ పేర్కొన్నారు.

విజయ బ్రాండ్ పేరిట నకిలీ పాల ప్యాకెట్లు

- ఆ ప్రైవేటు వ్యక్తులపై చర్యలు: విజయ డెయిరీ చైర్మన్

తార్నాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు పాల డెయిరీల యాజమానులు విజయ తెలంగాణ బ్రాండ్, లోగోను ముద్రించి పాలను, పాల పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డెయిరీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండేళ్లుగా కొంతమంది ప్రైవేటు డెయిరీల యాజమానులు అనధికారికంగా విజయలోగోతో నకిలీ పాలప్యాకెట్లను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సదరు వ్యక్తులకు ఇటీవల సిటీ సివిల్ కోర్టు కూడా నోటీసులు జారీ చేసిందన్నారు.



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చేపట్టిన సహాయక చర్యల్లో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది



ఆశలు ఆవిరి..!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. ఒక్కో బృందంలో 26 మంది సభ్యుల వరకు ఉండగా ఉన్నతాధికారులు కూడా లోపలికి వెళ్లి వచ్చారు. బేరింగ్ వెనుకవైపు ఉన్న బేస్ వరకు వెళ్లి వచ్చిన వారు... అక్కడి పరిస్థితి చాలా భయానకంగా ఉందని చెబుతున్నారు. మంగళవారం రాత్రి ర్యాట్ హోల్ మైనర్స్ చాలా దగ్గర వరకు వెళ్లగా అక్కడ మట్టిపై సెగ్మెంట్ బ్లాకులు ఆనుకుని ఉండటంతో మరింత కూలిపోతుందనే ఆందోళనతో తిరిగి వచ్చారు.

నేటి నుంచి టీబీఎం కటింగ్

ప్రమాదం జరిగిన సమయంలో పెద్దఎత్తున సెగ్మెంట్ బ్లాకులు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం)పై పడటంతో బేరింగ్ వెనక భాగం మొత్తం దెబ్బతింది. ఆ తర్వాత ఒత్తిడితో పైపులు, ఐరన్ షీట్లతో వ్యర్థాలు ముందుకు తోసుకువచ్చాయి. ఎయిర్ పంపింగ్, కన్వేయర్ బెల్టు కూడా దెబ్బతిన్నాయి. అయితే మూడో రోజునే కట్టర్లు, జనరేటర్లు లోపలకు తీసుకెళ్లినా ఆ వ్యర్థాలను మాత్రం తొలగించలేదు. వాటిని తొలగించకుండానే చిక్కుకుపోయిన వారి జాడ కనుక్కునేందుకు ప్రయత్నించారు. అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు. టీబీఎంను కట్ చేయడానికి జయప్రకాశ్ అసోసియేట్స్ యాజమాన్యం కూడా ఇన్ని రోజులూ ఒప్పుకోనట్లు తెలుస్తోంది. భారీ ఖర్చుతో కూడుకోవడం, టీబీఎంను కట్ చేస్తే తిరిగి పనులు ప్రారంభించడం కష్టమవుతుందని భావించినట్లు సమాచారం. అందుకే మూడు రోజులుగా ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ, బుధవారం ఆ సంస్థ ఛైర్మన్ జయప్రకాశ్ గౌర్ ఢిల్లీ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో టన్నెల్ ప్రదేశానికి వచ్చారు. మంత్రులు, అధికారులు, కంపెనీ ప్రతినిధులు, సహాయ బృందాలతో చర్చల అనంతరం టీబీఎంను కట్ చేయాలని నిర్ణయించారు.

గ్యాస్, ప్లాస్మా కట్టర్ల వినియోగం

టీబీఎంను మామూలు కట్టర్లతో కట్ చేయడం అసాధ్యం. ఇప్పటికే టన్నెల్‌లోకి గ్యాస్ కట్టర్లను తరలించగా గురువారం మధ్యాహ్నంలోపు ప్లాస్మా కట్టర్‌ను కూడా తీసుకురానున్నారు. వదులుగా ఉన్న సెగ్మెంట్ బ్లాకులు కింద పడకుండా ఆసరా పెట్టి.. తర్వాత మట్టిని, సిల్టును తొలగించనున్నారు. ఆరు 150 హెచ్‌పీ పంపుల ద్వారా నీటిని బయటకు తోడే ప్రక్రియ కొనసాగుతోంది.

రేపటితో సహాయ చర్యలు పూర్తి

- దేశంలోని టన్నెల్ నిష్ణాతులందర్నీ రప్పించి చర్యలు చేపట్టాం
- అత్యున్నత టెక్నాలజీ వినియోగం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

మహబూబ్‌నగర్/అచ్చంపేట/దోమలపెంట/హైదరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో సహాయ కార్యక్రమాలను రెండు రోజుల్లో పూర్తి చేస్తామని, ఇందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సొరంగ మార్గంలో జరిగే ప్రమాదాలను ఎదుర్కొనడంలో అత్యంత ప్రతిభావంతమైన దేశ సరిహద్దు రహదారుల సంస్థ నిపుణులు సహా దేశంలోని టన్నెల్ నిష్ణాతులందరినీ రప్పించామని చెప్పారు. దేశంలో అందుబాటులో ఉన్న అత్యున్నత ఇంజనీరింగ్, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ సహాయ చర్యల్లో పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నామని తెలిపారు. గడిచిన ఐదు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి పోరాడుతోందన్నారు. బుధవారం దోమలపెంటలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, జిల్లా కలెక్టర్ సంతోష్, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఏజెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ టన్నెల్‌లోని నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తొలగించి టీబీఎం ముందుభాగాన్ని చేరుకోనున్నట్లు తెలిపారు. టీబీఎం చివరి భాగాలను గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లతో తొలగించనున్నట్లు వివరించారు. అనంతరం ఆర్మీ, నేవీ, ర్యాట్ హోల్ మైనర్స్ సహాయంతో టన్నెల్‌లో చిక్కుకున్నవారిని వెలికితీస్తామని చెప్పారు. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనే వారి భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. టన్నెల్‌లో దాదాపు 200 మీటర్ల మేర బురద, నీరు పేరుకుపోయిందని, దాంతో సహాయ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది అత్యంత క్లిష్టమైన పరిస్థితి అని, సాంకేతిక నిపుణులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ప్రమాద ప్రాంతం భౌగోళికంగా క్లిష్టమైన ప్రదేశం కావడంతో భారీ యంత్రాలను అక్కడికి చేర్చడం కష్టంగా మారిందన్నారు. బుధవారం వచ్చిన ఆర్మీ నిపుణులు కూడా టన్నెల్‌లోకి వెళ్లి పరిస్థితులను అంచనా వేశారని తెలిపారు. ఇండియన్ మెరైన్ కమాండో ఫోర్స్ బలగాలు కూడా రంగంలోకి దిగాయన్నారు. సమీక్షా సమావేశంలో దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ప్రత్యేక అధికారి శ్రీధర్, టన్నెల్ రంగ నిపుణులు పాల్గొన్నారు.



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నీటి శబ్దం తప్ప ఏం వినిపించడం లేదు



అతికష్టంపై దారి చేసుకుని వెళ్లగలిగాం. కానీ ఇంకా మట్టి, రాళ్లు కూలే పరిస్థితి కనిపిస్తోంది. సొరంగంలో చిక్కుకున్న వారిని పిలిచినా ఎటువంటి శబ్దం రావడం లేదు. అందులో నీటి ఊట శబ్దం తప్ప మనుషుల అలికిడి వినిపించడం లేదు. ఆ ఎనిమిది మంది బతికే అవకాశం లేదు.

- అను ఖురేషి, ర్యాట్ హోల్ మైనర్స్ టీం సభ్యుడు

వారు బతికే అవకాశాలు తక్కువే



మేం ఉత్తరాఖండ్‌లో జరిగిన మైనింగ్ ప్రమాదంలో చిక్కుకున్న 41 మందిని కాపాడాం. కానీ ఇక్కడ చిక్కుకున్న వారిని రక్షించడం చాలా కష్టంగా మారింది. లోపల ఉన్న వారు బతికి ఉండే అవకాశాలు తక్కువే. టీబీఎంను కట్ చేసి తొలగిస్తే సహాయ చర్యలు కొనసాగించవచ్చు.

- ఫిరోజ్ ఖురేషి, ర్యాట్ హోల్ మైనర్స్ టీం సభ్యుడు

ఆ ప్రాంతం భయానకంగా ఉంది



ఎస్ఎల్‌బీసీలో చిక్కున్న వారు సురక్షితంగా బయటకొచ్చే అవకాశం లేదు. తాము టీబీఎం ఉన్న ప్రదేశానికి 20 మీటర్ల దగ్గరకు వెళ్లగలిగాం. ఆ ప్రాంతం బురద, రాళ్లతో నిండిపోయి భయానకంగా కనిపిస్తోంది అక్కడ గాలి, వెలుతురు రావడం లేదు. అయినా మా ప్రయత్నాలు కొనసాగిస్తున్నాం.

- నసిరుద్దీన్, ర్యాట్ హోల్ మైనర్స్ టీం సభ్యుడు

నీటి ఊటను నిలువరిస్తేనే..



రెండు రోజులుగా సొరంగంలోకి వెళ్లి అక్కడి పరిస్థితులను అంచనా వేశాం. ప్రస్తుతం చాలా వరకు టీబీఎం రాళ్లు, మట్టితో నిండిపోయింది, ఇంకా కొన్ని సెగ్మెంట్ బ్లాకులు కూలే పరిస్థితి ఉంది. కెమికల్ వాడి నీటి ఊటను నిలువరించిన తర్వాత శిథిలాలను తొలగిస్తే చిక్కుకున్న వారిని గుర్తించడం సాధ్యమవుతుంది.

- మున్నా ఖురేషి, ర్యాట్ హోల్ మైనర్స్ టీం సభ్యుడు

నిమ్స్‌ను వీడుతున్న వైద్యులు!

ఇక్కడి నుంచి కార్పొరేట్ ఆస్పత్రులకు.. తాజాగా యూరాలజీ నుంచి ఇద్దరు..

- ఇటీవలే 10 మంది వైద్యుల రాజీనామా
- కొద్ది నెలలుగా కొనసాగుతున్న ఇదే తీరు
- స్పెషాలిటీ వైద్య సేవలపై తీవ్ర ప్రభావం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదోడి వైద్యానికి పెద్ద భరోసాగా నిలిచే నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రి నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్యులు వైదొలుగుతున్నారు. ఇటీవల కాలంలో ఏకంగా కీలక విభాగాలకు చెందిన పది మంది వైద్య నిపుణులు రాజీనామా చేశారు. తాజాగా ఇద్దరు వైద్యులు తమ రాజీనామా పత్రాన్ని నిమ్స్ డైరెక్టర్ బీరప్పకు పంపారు. కొద్దినెలలుగా నిమ్స్ నుంచి వెళ్లిపోయే వైద్యుల సంఖ్య పెరుగుతుండగా... కొత్తగా వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉంటోంది. గడచిన మూడేళ్లలో నిమ్స్‌లో లక్ష సర్జరీలు జరిగాయి. అంటే వైద్యులు రోజుకు సగటున వందకుపైగా సర్జరీలు చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంతటి నైపుణ్యమున్న వైద్యులంతా నిమ్స్‌ను వీడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

నాలుగు విభాగాలు దాదాపు ఖాళీ

నిమ్స్‌లో పలు కీలక విభాగాల విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొద్ది రోజులుగా వరుసగా రాజీనామా చేస్తుండటాన్ని అక్కడి వైద్య సిబ్బంది, మెడికోలు జీర్ణించుకోలేకపోతున్నారు. నిమ్స్ న్యూరో సర్జరీ హెచ్‌వోడీగా ఉన్న డాక్టర్ విజయ సారథితో పాటు డాక్టర్ రాజేశ్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. అలాగే న్యూరాలజీకి చెందిన హెచ్‌వోడీ డాక్టర్ జబీన్‌తో పాటు డాక్టర్ నిహారిక, డాక్టర్ రూపం (ప్రొఫెసర్), డాక్టర్ రుక్మిణి (ప్రొఫెసర్) నిమ్స్‌ను వీడారు. ఆ ఒక్క విభాగం నుంచే ఏకంగా నలుగురు వెళ్లిపోయారు. ఇక, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీకి చెందిన డాక్టర్ ఆదిత్యతో పాటు మరో అసోసియేట్ ప్రొఫెసర్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. తాజాగా యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ధీరజ్ కూడా రెండు రోజుల క్రితం రాజీనామా లేఖలను నిమ్స్ డైరెక్టర్ బీరప్పకు ఇచ్చినట్లు నిమ్స్ వర్గాలు వెల్లడించాయి.



వైద్య సేవలు, సీట్లపై తీవ్ర ప్రభావం

గతేడాది నిమ్స్‌లో ఏకంగా 37 వేల శస్త్ర చికిత్సలు జరిగాయి. అలాగే భారీ సంఖ్యలో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు కూడా జరుగుతున్నాయి. గడిచిన దశాబ్ద కాలంలో ఏకంగా వెయ్యికిపైగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. అంటే కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా ఇక్కడ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్న మాట. ప్రస్తుతం ఎంతో నైపుణ్యమున్న ప్రొఫెసర్లు, విభాగాధిపతులు ఒక్కొక్కరుగా నిమ్స్‌ను వీడుతుండటంతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. నిష్ణాతులైన వైద్యులు లేకుంటే శస్త్ర చికిత్సల సంఖ్య కూడా తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు తగినంత మంది లేకుంటే సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లపై కూడా ఆ ప్రభావం చూపే అవకాశముంది.

డైరెక్టర్ వైఖరి కూడా కారణమా?

స్పెషలిస్టు వైద్యులు నిమ్స్‌ను వీడటం వెనుక ఆ ఆస్పత్రి డైరెక్టర్ వైఖరి కూడా ఓ కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి. నెలకు వందల సంఖ్యలో శస్త్ర చికిత్సలు చేసే వైద్యులకు రావాల్సిన ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్‌లు కొన్నేళ్లుగా ఇవ్వడం లేదు. ఉమ్మడి రాష్ట్రం నుంచే ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేసే వైద్యులకు కేసుకు ఇంత చొప్పున ఇన్సెంటివ్‌లు ఇచ్చేవారు. దాంతో వారు మరిన్ని శస్త్ర చికిత్సలు చేసేందుకు ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం వాటిని ఇవ్వకపోగా... రావాల్సిన వాటి విషయంలోనూ డైరెక్టర్ చొరవ చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు రోగులకు అందించాల్సిన వైద్య సేవల కంటే వైద్యులను రీసెర్చ్ పేపర్స్ ఎన్ని చేశారంటూ సతాయింపులు కూడా ఒక కారణంగా చెబుతున్నారు.

క్లినికల్ ట్రయల్స్‌కు ప్రభుత్వాలు సహకరించాలి

- ప్రజలు, రోగులకు అవగాహన కల్పించాలి
- 'బయో ఏషియా' చర్చాగోష్ఠిలో నిపుణులు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): క్లినికల్ ట్రయల్స్ నిర్వహణలో ప్రభుత్వాల సహకారం ఎంతో అవసరమని బయో ఏషియా సదస్సులో పాల్గొన్న నిపుణులు అభిప్రాయపడ్డారు. 'క్లినికల్ ట్రయల్స్‌కు భారత్‌లో ఉన్న గొప్ప అవకాశం- మార్కెట్‌ను ఎలా ఒడిసి పట్టుకోవాలి' అనే అంశంపై బుధవారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆ రంగ ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. దేశంలో క్లినికల్ ట్రయల్స్‌పై రోగులు, ప్రజలకు సరైన అవగాహన ఉండటం లేదని.. వారిలోని అపోహలను తొలగించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ ఆస్పత్రులు క్లినికల్ రీసెర్చ్, ట్రయల్స్ నిర్వహిస్తామంటే వాటికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహాయం అందడం లేదని అపోలో ఆస్పత్రి ఆంకాలజిస్టు లోకిరెడ్డి పద్మజ చెప్పారు. తగిన గుర్తింపుతో పాటు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే పరిశోధనలు మరింతగా పెరుగుతాయన్నారు. విదేశాల్లో క్యాన్సర్ చికిత్సలో క్లినికల్ ట్రయల్‌కు అంగీకరిస్తే, వారి వైద్య ఖర్చులు తగ్గుతాయన్నారు. దేశంలో సుమారు 6 వేలకు పైగా క్లినికల్ ట్రయల్ రీసెర్చ్ సైట్స్ ఉన్నాయని, కానీ వాటిలో కేవలం 150 వరకే చురుకుగా పనిచేస్తున్నట్లు పారెక్సెల్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్‌వ్యాస్ వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లో క్లినికల్ ట్రయల్ సైట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని చెప్పారు. సింగపూర్, మలేషియా, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో అక్కడి ప్రభుత్వాలు క్లినికల్ ట్రయల్స్‌కు ఎంతగానో సహకరిస్తాయని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ భాగస్వామి స్మృతీ సూర్యప్రకాశ్ అన్నారు. క్లినికల్ ట్రయల్స్ రీసెర్చ్‌లకు ప్రభుత్వాలు సహకరిస్తే ప్రపంచానికి మన దేశమే ఓ గమ్యస్థానం అవుతుందన్నారు.

20 రోజుల్లోగా లైఫ్ సైన్సెస్ పాలసీ

(మొదటిపేజీ తరువాయి)

హాజరయ్యారని తెలిపారు. హెచ్ఐసీసీలో బుధవారం బయో ఏషియా-2025 ముగింపు సదస్సులో, అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. దేశంలోనే తొలిసారి లైఫ్ సైన్సెస్ పాలసీని తేవడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిందన్నారు. ఫార్మా రంగంలో కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టేలా, ఈ రంగంలో రాష్ట్ర యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో దీన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. దీనిపై త్వరలోనే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని, 20 రోజుల్లోగా కొత్త విధానాన్ని ప్రకటిస్తామన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నామని, దీన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలోని అపార అవకాశాలు రాష్ట్ర యువతకు దక్కేలా అన్ని వర్సిటీల్లో కొత్త కోర్సులు అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ అంశంపై త్వరలో అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (వీసీ)తో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఫార్మా రంగంలో తెలంగాణలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కంపెనీలు ఆసక్తితో ఉన్నాయని, కాలుష్య లేని విధంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. వికారాబాద్, జహీరాబాద్‌లో ఇప్పటికే స్థలాలను గుర్తించామని, లగచర్లలో ఫార్మా పరిశ్రమలు కాకుండా పర్యావరణహిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని మంత్రి పేర్కొన్నారు. ఇక హెల్త్, ఫార్మా రంగాలకు చెందిన 100మంది నిపుణులు ఆయా రంగాల్లో సవాళ్లను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన అంశాలపై బయోఏషియాలో చర్చించారని, ఈ సదస్సులో 200కుపైగా బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలు జరిగాయని మంత్రి తెలిపారు. గతేడాది కంటే ఈసారి ఎక్కువ పెట్టుబడులు వచ్చాయన్నారు. అమెరికాకు చెందిన బయో టెక్నాలజీ దిగ్గజం అమ్జెన్ భారీ పెట్టుబడులతో 3వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ ఏడాది సదస్సులో 84 స్టార్టప్స్ పాల్గొన్నాయన్నారు. సంబంధిత రంగంలో అనుభవమున్న 4 పరిశ్రమల సహకారంతో 'సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' పేరిట ప్రత్యేక కోర్సును ప్రారంభించామని, మొదటి బ్యాచ్‌లో 140మంది విద్యార్థులు శిక్షణను పూర్తి చేసుకున్నారని మంత్రి తెలిపారు. జీనోమ్ వ్యాలీలో వ్యాక్సిన్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని గతంలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. ఈ కేంద్రం ఏర్పాటయ్యేలా సహకరించాలని సదస్సు వేదికపై ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఉద్దేశిస్తూ మంత్రి పేర్కొన్నారు.



బయో ఏషియా సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

ఫార్మాలో హైదరాబాద్ కీలకం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

భారత ఫార్మా రంగంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దేశంలోని ఫార్మా ఆదాయంలో 35శాతం, బల్క్ డ్రగ్స్‌లో 40శాతం ఆదాయం ఇక్కడి నుంచే వస్తోందన్నారు. 800 ఫార్మా, బయోటెక్, మెడిటెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు. బయో ఏషియా ముగింపు సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో ఐఐటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (నైపర్), సీసీఎంబీ, ఐఎస్‌బీ, నల్సార్, డీఆర్‌డీవో వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి నైపుణ్యం కలిగిన యువకులు ఆయా రంగాల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్కు వంటివి విదేశీ పెట్టుబడులను ఆకర్షించి, 2047నాటికి 500 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఎకానమీ సృష్టి దిశగా అడుగులు వేసే అవకాశాలు హైదరాబాద్‌లో మెండుగా ఉన్నాయన్నారు. లైఫ్‌సైన్సెస్ రంగానికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందువరుసలో ఉంటుందని తెలిపారు. కేంద్రం తెచ్చిన 'మెడ్‌టెక్ మిత్ర' వంటి వేదికలు.. ఆవిష్కర్తలు, స్టార్టప్స్, భాగస్వామ్య పక్షాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు దోహదపడుతున్నాయని చెప్పారు. 'రానున్న రెండేళ్లలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, 2030నాటికి 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ 'బల్క్ డ్రగ్ క్యాపిటల్', 'వ్యాక్సిన్ క్యాపిటల్'గా పురోగతి సాధించిందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో వినూత్న ఆవిష్కర్తలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు బహుమతులు ప్రదానం చేశారు.

లైఫ్‌సైన్సెస్‌లో తెలంగాణ అద్భుతం: పీయూష్

లైఫ్‌సైన్సెస్, ఫార్మా రంగాల్లో తెలంగాణ అద్భుతమైన విజయాలను సాధిస్తోందని, రాష్ట్రం ప్రముఖ హెల్త్‌కేర్ హబ్‌గా నిరూపించుకుందని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. బయో ఏషియా ముగింపు సదస్సులో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. దేశంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్లు, బయోటెక్ పరిశోధనా కేంద్రాలను తెలంగాణ నిర్వహిస్తోందని కొనియాడారు. ఈ రంగంలో తెలంగాణ విజయాలు.. భారత అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, జహీరాబాద్‌లోని ఇండస్ట్రియల్ నోడ్‌తో పాటు బీబీనగర్ ఎయిమ్స్‌తో తెలంగాణ ప్రయోజనం పొందుతోందని తెలిపారు.

రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

- కాళేశ్వరానికి లింకు పెడుతూ సీఎం వ్యాఖ్యలు
- గత ఆగస్టులో న్యాయవాది మృతి
- కేసు వేసిన రాజలింగమూర్తి ఇటీవల దారుణ హత్య

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిని ప్రశ్నించిన వారి మరణాలపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్‌లో పిల్లర్లు కుంగిపోవడంలో నాణ్యతా ప్రమాణాలను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి హత్యకు గురికావడం తెలిసిందే. కాగా, ఈ కేసును వాదించిన న్యాయవాది గత ఏడాది ఆగస్టులోనే గుండెపోటుకు గురై మృతి చెందారు. అయితే వీరి మరణాలపై అనుమానాలు ఉన్నాయంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి అప్పటి సీఎం కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు కారణమూంటూ రాజలింగమూర్తి భూపాలపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. అయితే కేసు నమోదు చేయడానికి స్థానిక పోలీసులు విముఖత చూపడంతో ఆయన జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు 2024 సెప్టెంబరు 5న విచారణకు హాజరుకావాలంటూ కేసీఆర్, హరీష్‌రావుతోపాటు మరో ఆరుగురికి కోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే కేసీఆర్, హరీశ్‌రావు డిసెంబరు 23న హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో 2025 జనవరి 7లోగా తగిన కారణాలు చూపించాలంటూ రాజలింగమూర్తికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇందుకు ఫిబ్రవరి 20వరకు గడువు కావాలని రాజలింగమూర్తి కోరగా.. హైకోర్టు అంగీకరించింది. కానీ, కేసు విచారణకు ఒక్క రోజు ముందే ఫిబ్రవరి 19న రాజలింగమూర్తి దారుణహత్యకు గురయ్యారు. భూ తగాదాలే రాజలింగమూర్తి హత్యకు కారణంగా చెబుతున్నప్పటికీ.. కాళేశ్వరంలో అవినీతే రాజలింగమూర్తి ప్రాణం తీసిందని ఆయన భార్య ఆరోపిస్తున్నారు. మరోవైపు ఇదే కేసును రాజలింగమూర్తి తరుపున వాదిస్తున్న న్యాయవాది గంటా సంజీవరెడ్డి గత ఆగస్టులో గుండెపోటుకు గురయ్యారు. ఆయనను హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ వారం తరువాత మృతి చెందారు. దీంతో ఆయనపై ఎవరైనా ఒత్తిడి చేయడం వల్లే గుండెపోటుకు గురయ్యారా? అనే అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధుల విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి రోజున తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కూలీలకు శుభవార్త చెప్పింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన నిధులను విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.39.98 కోట్ల నిధులను బుధవారం జమ చేసింది. ఈ పథకాన్ని జనవరి 26న ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఉన్న అర్హులైన కూలీలందరికి పథకాన్ని వర్తింపజేశారు. పథకం ప్రారంభం సందర్భంగా 18,180 మందికి రూ.6 వేల చొప్పున రూ.10.90 కోట్లు జమ చేశారు. ఆ తరువాత మండలి ఎన్నికల కోడ్ రావడంతో పథకం అమలు నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క కోరడంతో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉన్న ఉపాధి కూలీలు 66,640 మందికి రూ.39.98 కోట్లను జమ చేసింది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.88 కోట్లు నిధులు ఖర్చు చేసింది. ఈ పథకం ద్వారా అందించే నిధులు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. వ్యవసాయ కూలీ పనుల మీదనే ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది. ఏడాదికి రెండు విడతల్లో ఒక్కో విడతకు రూ.6 వేల చొప్పున రూ.12 వేల సహాయాన్ని ప్రభుత్వం అందించనుంది.

విద్యుత్ డిమాండ్ రికార్డులు బద్దలు

- 16,506 మెగావాట్లుగా నమోదు
- తెలంగాణ ఏర్పడ్డాక ఇదే అత్యధికం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పరుగులు పెడుతోంది. ఇప్పటికే నమోదైన అత్యధిక డిమాండ్‌ను తోసిరాజని... మంగళవారం ఉదయం 8.03 గంటల సమయంలో 16,506 మెగావాట్లుగా నమోదయింది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఇదే అత్యధిక డిమాండ్. అంతకు ముందు 21న మధ్యాహ్నం 12.02 గంటల సమయంలో 16,412 మెగావాట్లుగా నమోదు కాగా... మంగళవారం దాన్ని దాటేసి... 16,506 మెగావాట్లుగా నమోదయింది. డిమాండ్(ఏకకాలంలో ఆయా పరికరాల వినియోగంతో రికార్డయ్యేది)తో పాటు వినియోగం(రోజంతా విద్యుత్ వాడకం) కూడా భారీగా పెరిగింది. ఈ నెల 25న రాష్ట్ర విద్యుత్ వినియోగం 313.373 మిలియన్ యూనిట్లు(ఒక మిలియన్ 10 లక్షల యూనిట్లు)గా నమోదయింది. 21న 313.36 మిలియన్ యూనిట్లుగా ఉండటం గమనార్హం.

నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై విచారణలో భాగంగా గురువారం నుంచి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను మరోసారి ప్రారంభించనున్నారు. విచారణలో భాగంగా మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, నరేందర్ రెడ్డితో పాటు కాళేశ్వరం ఈఎన్‌సీ బి.హరిరామ్‌లను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. గురువారం 11:30 గంటల నుంచి వీరిని విచారించనుంది. ఇప్పటికే వీరు కమిషన్ విచారణకు హాజరు కాగా... మరోమారు వీరిని పలు వివరాల నిర్ధారణ కోసం క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు.

సీనియర్ ఐపీఎస్ అభిలాష బిస్త్‌కు చుక్కెదురు

- ఏపీకి వెళ్లాలన్న ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు క్యాట్ నిరాకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): క్యాడర్‌కు సంబంధించిన వివాదంలో సీనియర్ ఐపీఎస్ అభిలాష బిస్త్‌కు కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించలేదు. అభిలాష బిస్త్ తక్షణం ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో చేరాలంటూ కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి క్యాట్ బుధవారం నిరాకరించింది. ప్రస్తుతానికి కేంద్రం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఏపీలో చేరాలని.. ఏపీకి కూడా సీనియర్ ఐపీఎస్‌ల అవసరముందని వ్యాఖ్యానించింది. ఉమ్మడి ఏపీ విభజన సందర్భంగా ఏపీ, తెలంగాణ మధ్య ఐపీఎస్‌ల పంపిణీ చేసిన విధానం నచ్చని కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించి ఎక్కడి వారక్కడే కొనసాగుతున్నారు. అయితే తాజాగా తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఐపీఎస్‌లను ఏపీకి వెళ్లాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ అభిలాష బిస్త్ క్యాట్‌ను ఆశ్రయించారు. లతా బస్వరాజ్ పాట్నే, శాలినీ మిశ్రా బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టారు. ప్రస్తుతానికి కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులపై ఎలాంటి స్టే ఇవ్వలేమన్న క్యాట్.. కేంద్రంతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.

రాష్ట్రంలో యూరియా కొరత లేదు:తుమ్మల

- ఈ వారంలో 81,800 మెట్రిక్ టన్నులు వస్తుందన్న మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వారంలో మరో 81,800 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సిఉండగా, 6.81 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే మార్క్‌ఫెడ్ వద్ద ఉంచిన 3.08 లక్షల మెట్రిక్ టన్నుల్లో అవసరం మేరకు అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్రానికి కేటాయించిన యూరియాను వెంటనే సరఫరా చేయాలని కోరినట్టు వివరించారు.. మరోవైపు..రాష్ట్రంలో 1.11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ సంచాలకుడు ఒక ప్రకటనలో కోరారు.

మిస్టరీగా మరణాలు!

(మొదటిపేజీ తరువాయి)

కోరడం లేదని ప్రశ్నించారు. బుధవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాజలింగమూర్తి హత్య జరిగిన వెంటనే కాళేశ్వరంపై ఆయన దాఖలు చేసిన కేసును క్వాష్ చేయాలంటూ న్యాయస్థానాన్ని కోరారని, దీనిని బట్టే అసలేం జరిగిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. విస్టరీ మరణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే సమగ్ర దర్యాప్తు చేస్తామన్నారు. తద్వారా నిజాలు బయటికి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఇక ఎల్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి గత కేసీఆర్ ప్రభుత్వమే కారణమని సీఎం రేవంత్ ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇది కేవలం రూ.5 వేల కోట్లతో (ప్రస్తుతం పెరిగిన అంచనా వ్యయంతో కలిపి) సుమారు 3.5 లక్షల ఎకరాలకు సాగునీరందించే గొప్ప ప్రాజెక్టు అని, ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి సొరంగంతో కూడిన ప్రాజెక్టు అని చెప్పారు. ఇందులో కమీషన్లు రావనే ఉద్దేశంతోనే గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం దీనిని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పదేళ్లపాటు ప్రాజెక్టును పట్టించుకోకపోవడంతో టన్నెల్ మట్టి కుంగి కూలిందని తెలిపారు. క్రమం తప్పకుండా పనులు కొనసాగి ఉంటే.. ప్రమాదం జరిగి ఉండేది కాదేమోనని అభిప్రాయపడ్డారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు..

గత కేసీఆర్ ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టిందని సీఎం ఆరోపించారు. అతితక్కువ వ్యయంతో 3.5 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ప్రాజెక్టును కాదని, కేవలం లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తుందని రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని అన్నారు. చివరికి 50 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందించలేదన్నారు. కాళేశ్వరం లేకపోయినా ఈసారి 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ఎప్పుడూ ఇంత దిగుమతి రాలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం అనుకోకుండా జరిగిందని, కానీ.. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడమనేది మానవ తప్పిదంతో జరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ అవినీతి, ప్రణాళికా లోపం, కమీషన్ల కోసం కక్కుర్తి పడడం, తానే మేధావిననే భ్రమతో జరిగిన ప్రమాదమని ధ్వజమెత్తారు. కేసీఆర్‌లా తాము తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని, నిపుణుల కమిటీ నివేదికల తర్వాతే ముందుకు వెళతామని స్పష్టం చేశారు. టన్నెల్ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని, దేశంలోనే మొదటిసారిగా 18 సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎస్ఎల్‌బీసీని పూర్తిచేసి తీరతామన్నారు. ఇక రాష్ట్ర మంత్రివర్గంలో తనకంటే అనుభవజ్ఞులైన వారు ఉన్నారని, వారికి పూర్తి స్వేచ్ఛ ఉందని సీఎం అన్నారు. మంత్రివర్గ విస్తరణపై వస్తున్నవన్నీ ఊహాగానాలేనని, విస్తరణ ఉంటుందని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు.



బీఆర్‌ఎస్ విలీనానికి బీజేపీ కుట్ర..

తెలంగాణలో గత పదేళ్లలో జరిగిన అవినీతికి సంబంధించి విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారని, అయితే దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సీబీఐ విచారణకు ఆదేశిస్తే ఆ పేరుతో బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసుకోవాలన్నది వారి ఆలోచన అని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర అన్ని అంశాల్లో చట్టపరంగా దర్యాప్తు జరుగుతోందని, ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని హైకోర్టు సుమోటోగా స్వీకరించి పర్యవేక్షిస్తోందని అన్నారు. హైకోర్టు కంటే సీబీఐ పెద్దదా? అని ప్రశ్నించారు. హరీశ్ రావును అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. కాళేశ్వరం అవినీతిపై జస్టిస్ ఘోష్ కమిషన్ దర్యాప్తు చేస్తోందని, కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత ఏం చేయాలనే దానిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రభాకర్‌రావు విదేశాల్లో ఉన్నాడని, ఆయనను తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రానిదేనని అన్నారు. అలాగే, ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఈడీ దర్యాప్తు జరుపుతోందని, మరి కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఈడీ దర్యాప్తుపై కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడడం లేదన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర క్యాబినెట్‌లో చర్చకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని, కేసీఆర్ కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

రాజ్యాంగంలో మార్పులేమీ రాలేదు..

దేశంలో పార్టీ ఫిరాయింపులకు సంబంధించి 2014 నుంచి 2024 వరకు ఏ రాజ్యాంగం అమల్లో ఉందో, ఇప్పుడు కూడా అదే రాజ్యాంగం అమల్లో ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఏ పార్టీలో గెలిచి, ఏ మంత్రివర్గంలో పనిచేశారో అందరికీ గుర్తుందన్నారు. అయినా, పార్టీ ఫిరాయింపులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని మొట్టమొదటిసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది తానేనని గుర్తు చేశారు. 90 రోజుల్లో స్పీకర్ నిర్ణయం చెప్పాలని సుప్రీంకోర్టు తొలిసారిగా ఆదేశించిందని తెలిపారు. ఆ తీర్పు ఆధారంగానే ఆ తర్వాత అనేక మంది ఫిరాయింపులపై పిటిషన్లు దాఖలు చేశారన్నారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ 90 రోజుల్లో స్పీకర్ నిర్ణయాన్ని చెప్పలేదన్నారు. ఒక పార్టీలో 1/3 వంతు మరో పార్టీలో కలిస్తే అది విలీనమైనట్లు అని, చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ అన్ని రకాలుగా చట్టబద్ధంగా కాంగ్రెస్‌లో విలీనమైందని చెప్పారు. అంతే తప్ప.. ఎమ్మెల్యేల్లో 1/3 మరో పార్టీలో చేరితే అది విలీనం కిందికి రాదన్నారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్, బీజేపీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గోవా, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో బీజేపీ వ్యవహరించిన తీరు దేశమంతా చూసిందన్నారు. త్వరలోనే తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయనడం కేటీఆర్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కథ ముగిసిందని, భవిష్యత్తులో బీజేపీతోనే తమకు పోటీ ఉంటుందని చెప్పారు.

నా దృష్టి పని పైనే.. ప్రచారంపై కాదు..

సోషల్ మీడియా ప్రచారంలో కాంగ్రెస్ వెనక పడుతోందన్న ప్రశ్నకు రేవంత్ బదులిస్తూ.. తన దృష్టంతా పనిపైనే ఉంటుందని, ప్రచారంపై కాదని అన్నారు. మూడేళ్లు ప్రజా సంక్షేమం, అభివృద్ధికే సమయం కేటాయిస్తానని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ చేయలేని ఎన్నో పనులను తాము ఏడాదిలోనే చేసి చూపించామన్నారు. లబ్ధిదారులే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్‌లతోనే పని చేయించుకోవాలి తప్ప కొత్తవారిని ఎక్కడి నుంచి తీసుకొస్తామని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాకు తగినవాళ్లు రాష్ట్రంలో నలుగురే ఉన్నారని, ఉన్న అధికారులతోనే సమర్థంగా పని చేయిస్తున్నామని అన్నారు సమష్టి కృషితో రాష్ట్రాన్ని అన్నింటా అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. ఏడాదిలోనే రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు 8.5% నుంచి 6.6 శాతానికి తగ్గిందన్నారు. ఆక్యుపెన్సీలో హైదరాబాద్ బెంగళూరును దాటేసి దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు.

కొడంగల్ ఇన్‌చార్జి మా సోదరుడే..

కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి తన సోదరుడేనని సీఎం రేవంత్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా అక్కడ రాజకీయ వ్యవహారాలు ఆయనే చూసుకుంటున్నారని తెలిపారు. సెక్రటేరియట్‌లో కూర్చుని అధికారులతో రివ్యూలు చేస్తే తప్పు కానీ, నియోజకవర్గంలో ప్రజల తరపున నిలబడితే తప్పేముందని ప్రశ్నించారు. కేటీఆర్ కొడుకు భద్రాచలం వెళ్లి సీతారాములకు తలంబ్రాలు సమర్పించారని, కేటీఆర్ కొడుకు ఏ హోదాలో అక్కడికి వెళ్లాడని ప్రశ్నించారు. తన సోదరుడు అలాంటి పనులేమీ చెయ్యడం లేదన్నారు. వర్గీకరణపై అసెంబ్లీలో బిల్లు పెడతామని, దీనికోసం అన్నీ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గతంలో హుజూరాబాద్‌లో 1.5 శాతం ఓట్లే వస్తే తనదే బాధ్యత అని చెప్పానని, ఆ తర్వాత అదే హుజూరాబాద్‌లో 40 శాతం ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. ఐదేళ్ల తర్వాత దేనికైనా బాధ్యత తనదేనన్నారు. కులగణన విషయంలోనూ అన్నింటికీ తానే బాధ్యత వహిస్తానని, కాంగ్రెస్ అధిష్ఠానం చెప్పిన దారిలోనే తాను ముందుకు వెళుతున్నానని స్పష్టం చేశారు.

నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష సరికాదు...

దేశంలోని రాష్ట్రాలకు నిధుల కేటాయింపుల విషయంలో కేంద్రం వివక్ష చూపడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రానికి తెలంగాణ రూపాయి చెల్లిస్తే కేంద్ర మాత్రం కేవలం 42 పైసలే తిరిగి ఇస్తుందన్నారు. అలాకాకుండా, 50శాతం నిధులు జనాభా ప్రాతిపదికన, మరో 50 శాతం నిధులు కేంద్రానికి రాష్ట్రం చెల్లిస్తున్న పన్నుల ప్రాతిపదికన కేటాయించాలని కోరారు. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశామన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టామని, త్వరలోనే ప్రతి కార్డుదారుకు సన్నబియ్యం అందిస్తామని అన్నారు.

ప్రతి నెలా 6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం..

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెలా రూ.6,500 కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ప్రతినెలా రాష్ట్రానికి సుమారు రూ.18,500 కోట్ల ఆదాయం వస్తుందని, అందులో వడ్డీలు, వేతనాలకే రూ.13 వేల కోట్ల దాకా చెల్లిస్తున్నామని అన్నారు. మిగిలిన సొమ్ముతోనే సంక్షేమం, అభివృద్ధి అన్నీ చేయాల్సి వస్తోందన్నారు. ఆదాయాన్ని రూ.22 వేల కోట్లకు పెంచితే అన్నింటికీ సజావుగా సరిపెట్టే వీలుంటుందని, అందుకే.. పెంచే పనిలో పడ్డామని చెప్పారు. పన్నుల శాఖలో సంస్కరణలు చేశామని, దీనివల్ల జీఎస్టీ రాబడిలో సుమారు 8 శాతం వృద్ధిని నమోదు చేశామని వెల్లడించారు. మైనింగ్ రంగాన్ని కూడా గాడిలో పెట్టామని, ఇసుక తరలింపులో అక్రమాలకు తావులేకుండా చేశామని తెలిపారు. కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదని, దశలవారీగా పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. ఇక హైదరాబాద్‌లో ఆక్రమణలను పూర్తిగా అరికట్టామని, హైడ్రా తర్వాత ఆక్రమణలు జరగలేదని చెప్పారు. చెరువుల ఆక్రమణ అంటేనే వెన్నులో వణుకు పుట్టించే పరిస్థితిని తీసుకొచ్చామని తెలిపారు. బీజేపీ నేతలు హైడ్రా పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు చంద్రబాబునాయుడి హయాంలో నందనవనం లాగే ఏదైనా చేస్తే బాగుంటుందనే ఆలోచన ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తనను కలవడానికి వచ్చిన తనకు తెలియదన్నారు. కేసీఆర్ లాగా నిర్బంధ పాలన లేదన్నారు.

తెలంగాణ అట్లాస్‌లో బీఆర్ఎస్ ఛాయలు..

టీజీడీపీఎస్‌లో పది మందిపై వేటు

- సీఈవో షేక్ మీరా సహా ఐదుగురు అధికారులు జీఏడీకి సరెండర్
- ఐదుగురు ఔట్ సోర్స్ సిబ్బంది రిలీవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) ఇటీవల రూపొందించిన 'అట్లాస్'లో కొన్ని చోట్ల.. గత ప్రభుత్వం హయాంలో అమలైన పథకాల పేర్లు, కాళేశ్వరం గురించిన వివరాలను యథావిధిగా కొనసాగించిన వ్యవహారంలో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. టీజీడీపీఎస్ సీఈఓ షేక్ మీరా, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరమణ సహా ఐదుగురు అధికారులను సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ)కు సరెండర్ చేసింది. మరో ఐదుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి రిలీవ్ చేసింది. బీఆర్ఎస్ హయాంలో తీసుకువచ్చిన రైతు బంధు పథకం పేరును కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాగా మార్చింది. కానీ, అట్లాస్‌లో 'రైతు బంధు' పేరునే కొనసాగించారు. కాళేశ్వరంలో తీవ్ర అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించగా.. అట్లాస్‌లో దాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అత్యంత కీలకమైన(ఫ్లాగ్‌షిప్) ప్రాజెక్టుగా పేర్కొన్నారు. ఈ అట్లాస్‌ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గతవారం ఆవిష్కరించారు. అట్లాస్‌లో గత ప్రభుత్వపు వ్యాఖ్యలు ఉన్న విషయం ఆలస్యంగా సీఎంవో దృష్టికి వచ్చింది. సీఎం రేవంత్ వెంటనే చర్యలకు ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకే పది మందిపై చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, కొత్త అట్లాస్ వ్యవహారం రాజకీయంగా, అధికార యంత్రాంగంలోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రభుత్వ యంత్రాంగంలో బీఆర్ఎస్ 'కోవర్టులు' ఉన్నారా, ఆ పార్టీకి ఇంకా సహకరిస్తున్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇంకా బీఆర్ఎస్ భ్రమల్లో ఉన్నారని, గత ప్రభుత్వాలకు ఇంకా వంత పాడితే యంత్రాంగాన్ని మొత్తం ప్రక్షాళన చేయాల్సి ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. అట్లాస్ రూపకల్పనలో టీజీడీపీఎస్ బాధ్యతారహితంగా వ్యవహరించిందని, వివిధ శాఖల నుంచి వచ్చిన సమాచారాన్ని నిర్ధారించుకోకుండా 'కట్ అండ్ పేస్ట్' పద్ధతిలో కూర్చిందని ఆరోపిస్తున్నారు. మరోవైపు, ఇదే అట్లాస్‌ను పరిశీలించి, ఆమోదముద్ర వేసిన రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కింది స్థాయి సిబ్బందిపై వేటు వేయడాన్ని నిరసిస్తూ ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నాయి. తెలంగాణ అట్లాస్‌ను ప్రతీ ఏడాది విడుదల చేస్తారు. అందులో రాష్ట్ర భౌగోళిక పరిస్థితులు, జనాభా, విద్య, ఆర్థిక అంశాలు, వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగం తదితర సమాచారం అంతా గ్రాఫిక్స్ రూపంలో ఉంటుంది. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్(డీఈఎస్) సాయంతో టీజీడీపీఎస్ ఈ అట్లాస్‌ను రూపొందించి విడుదల చేస్తుంది.

5 కీలక ప్రాజెక్టులకు నిధులివ్వండి

తెలంగాణ అభివృద్ధికి సహకరించండి.. మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతివ్వండి

- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి
- దానికి సమాంతర రైల్వే లైన్ అవసరం
- మూసీ ప్రాజెక్టుకు సహకరించాలి
- ప్రధానికి విన్నవించిన సీఎం రేవంత్ రెడ్డి
- వీటిని సాధిస్తే కిషన్ రెడ్డికి పౌరసన్మానం
- గండపెండేరం కూడా తొడుగుతా బండి సంజయ్ కూడా తోడ్పడాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, ఐదు కీలక ప్రాజెక్టులకు నిధులివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ స్తంభించిపోయిందని, ఈ ప్రాజెక్టు ముందుకు సాగడానికి తోడ్పడాలని విన్నవించారు. దీనితోపాటు రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని మంజూరు చేయాలని, ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రైల్వే లైన్‌కు అనుమతించాలని, డ్రైపోర్టు నుంచి ఏపీలోని బందర్ పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించాలని, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు భారీ నిధులు మంజూరు చేయాలని, సెమీకండక్టర్ మిషన్ ప్రాజెక్టుక అనుమతించాలని ఆయన అభ్యర్థించారు. బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయి.. వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఢిల్లీ టూర్‌లో ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎంవో అధికారి శేషాద్రి ఉన్నారు. కాగా అధికారిక సమావేశం అనంతరం మోదీతో సీఎం రేవంత్ రెడ్డి ఏకాంతంగా కొద్దిసేపు రాజకీయాలను చర్చించినట్లు సమాచారం. మోదీని కలిసిన తర్వాత రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రూపురేఖల్ని మార్చి సర్వతోముఖాభివృద్ధికి దారితీసే ఐదు ముఖ్యమైన ప్రాజెక్టుల గురించి ప్రధానమంత్రికి వివరించానని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ ప్రాజెక్టులను మంజూరు చేయించడంతోపాటు భారీ ఎత్తున నిధులు కేటాయించేలా కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి, సహాయమంత్రి బండి సంజయ్ తోడ్పడాలని అభ్యర్థించారు. ఈ ప్రాజెక్టులను ఆమోదింపచేస్తే ఆ ఘనత కిషన్ రెడ్డికే దక్కుతుందని, తాను ఆయనకు పౌర సన్మానం చేసి గండపెండేరం తొడుగుతానని రేవంత్ చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు వెంటనే అనుమతులు ఇవ్వాలని ప్రధానిని కోరానని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని మోదీ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు మెట్రో కారిడార్లను ప్రతిపాదించామని వివరించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు ఆర్ఆర్ఆర్ సమీపంలో డ్రైపోర్టు అవసరమని చెప్పారు. ఆ డ్రైపోర్టు నుంచి ఏపీలోని బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు అవసరమని, ఆ రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేస్తే సరుకుల రవాణా ఖర్చు తగ్గడంతోపాటు పారిశ్రామిక ఎగుమతి అవసరాలకు డ్రైపోర్టు కీలకంగా నిలుస్తుందని తెలిపారు. దీనివల్ల తెలంగాణలో కొత్త ఉద్యోగావకాశాలు పెరుగుతాయని చెప్పారు. హైదరాబాద్ నగరం మధ్యలో 55 కిమీ పొడవునా ప్రవహిస్తున్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్ల ఆర్థిక సహాయం చేయాలని కోరినట్లు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని విజ్ఞప్తి చేశానన్నారు. సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలనీ ప్రధానిని కోరినట్ల రేవంత్ తెలిపారు.



ప్రధాని మోదీని కలిసిన సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలి

విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ క్యాడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడున్న అవసరాలకు ఈ అధికారుల సంఖ్య సరిపోవడం లేదన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై ప్రధానికి వివరించానని తెలిపారు. నదుల పునరుజ్జీవం అవసరమని మోదీ చెప్పారని, మూసీ పునరుద్ధరణ మంచి నిర్ణయమని అభినందించారని రేవంత్ తెలిపారు.

పెండింగ్ అంశాలను ప్రస్తావించి.. రేవంత్‌ను ఆశ్చర్యపరిచిన మోదీ

తెలంగాణ అభివృద్ధికి ఐదు కీలక అంశాలతో ముఖ్యమంత్రి వినతిపత్రం సమర్పించిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణలో పెండింగ్ అంశాలపై రేవంత్‌కు నోట్ సమర్పించి ఆశ్చర్యపరిచారు. ఆయా అంశాలపై అధికారులతో చర్చించి సత్వరం చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా రేవంత్ ప్రధానితో చెప్పారు. ప్రధాని.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చిన అంశాలివి..

పీఎంఏవై(గ్రామీణ)ను అమలు చేయడం లేదు

2016-17లో తెలంగాణకు పీఎంఏవై కింద 70,674 ఇళ్లను మంజూరు చేసినప్పటికీ రాష్ట్రం అమలు చేయకపోగా కేంద్ర వాటా మొత్తాన్ని తిప్పి పంపింది. 2024లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసేందుకు అనుమతించాలని కోరినప్పటికీ 2018 ఆవాస్ సర్వే జరపనందువల్ల అర్హులైన కుటుంబాలను గుర్తించలేదు. ఆవాస్-2024 మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించేందుకు 2025 మార్చి 31 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది.

మెగా ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి

వామపక్ష తీవ్రవాద ప్రాంతాల్లో రెండవ దశలో భాగంగా మొబైల్ కనెక్టివిటీ, కొన్ని గ్రామాల్లో 4జీ మొబైల్ కవరేజీ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతోపాటు రూ.32,797 కోట్లతో చేపట్టిన రిలయన్స్ జియో 4జీ, 5జీ విస్తరణ ప్రాజెక్టుకు అనుమతులు, అటవీ క్లియరెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.18,189.53 కోట్లతో చేపట్టిన జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల, రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం, శ్రీరామసాగర్ ప్రాజెక్టు రెండవ దశ పనుల కోసం భూసేకరణ, న్యాయ వివాదాలు తదితర అంశాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయి. ముందుగా వీటిని పరిష్కరించుకోవాలి. బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు సంబంధించి.. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంస్థలకు విద్యుత్ కనెక్షన్లు, నీటి సరఫరాకు సంబంధించి రూ.1365.95 కోట్ల మేరకు నిధులు విడుదల చేయాల్సి ఉన్నది. శంషాబాద్‌లో ప్రభుత్వ భూమిని కేటాయించకపోవడం వల్ల 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం పెండింగ్‌లో ఉండిపోయింది. అదేవిధంగా భూసేకరణ, అటవీ అనుమతులు లేకపోవం వల్ల మనోహరాబాద్ - కొత్తపల్లి కొత్త రైల్వే లైన్, కాజీపేట - విజయవాడ మూడో లైన్ విద్యుద్దీకరణ పెండింగ్‌లో పడింది. ఇందుకు రూ.3113.48 కోట్లు ఖర్చు పెట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నది.

ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

» శంషాబాద్ విమానాశ్రయంలో 4 గంటల పాటు పడిగాపులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే ఇండిగో విమానంలో బుధవారం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు నాలుగు గంటల పాటు పడిగాపులు కాశారు. బుధవారం ఉదయం 10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాల్సిన ఎస్‌జీ 773 ఇండిగో విమానంలో బోర్డింగ్ పాస్‌లు తీసుకున్న తరువాత సాంకేతిక లోపం తలెత్తిందని ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రయాణికులకు సమాచారం ఇచ్చారు. దీంతో నాలుగు గంటలు విమానాశ్రయంలోనే పడిగాపులు కాయాల్సి రావడంతో ప్రయాణికులు విమానం దిగి ఇండిగో ఎయిర్‌లైన్స్ టికెట్ కౌంటర్ వద్దకు వెళ్లి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒక సమయంలో ఎయిర్‌లైన్స్ సిబ్బందిపై దాడి చేయడానికి యత్నించడంతో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అడ్డుకున్నారు. ఎట్టకేలకు విమానం మధ్యాహ్నం 1.55 గంటలకు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరి వెళ్లింది.

ఉప్పల్ కేవీలో ఖాళీల భర్తీకి మార్చి 4 ఇంటర్వ్యూ

హైదరాబాద్ ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయం (కేవీ)లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. మార్చి 4న వీటిని ఇంటర్వ్యూ ఆధారంగా నియమించనున్నారు. పోస్టును అనుసరించి ఎంఎస్సీ, ఈడీ, బీఈడీ, సీటెట్, టెట్, డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంసీఏలో ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి. వివరాల కోసం https:// no1uppal.kvs.ac.in/kendriyavidyalayano1an-dno2uppalwalk-in-interview 202526/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐడీబీఐ బ్యాంకులో 650 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ)లో 650 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు 2025 మార్చి 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే. పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా నియామకం ఉంటుంది. ఎంపికైన వారు 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఏడాది పాటు ఉండే ఈ కోర్సులో ఆరు నెలలు క్లాస్ రూమ్ బోధన, తరువాత రెండు నెలలు ఇంటర్న్‌షిప్, నాలుగు నెలలు ఆన్‌జాబ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సులో నెలనెలా స్టైఫండ్ ఇస్తారు. తర్వాత 6.5 లక్షల సంవత్సర ప్యాకేజీతో ఉద్యోగంలోకి తీసుకుంటారు. అభ్యర్థుల వయస్సు 2025 మార్చి 1 నాటికి 20 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 12. వివరాలకు https://www.idbibank.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

నేడు జేఈఈ మెయిన్ కరెక్షన్ విండో ఓపెన్

జేఈఈ మెయిన్ 2025 రెండో విడత దరఖాస్తులో తప్పు ఒప్పులను సవరించుకోవడానికి గురువారం నుంచి వెబ్‌సైట్ విండో ఓపెన్ అయినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తెలిపింది. ఈ కరెక్షన్ విండో శుక్రవారం 28 రాత్రి 11.50 గంటల వరకు ఓపెన్ ఉంటుంది. దరఖాస్తులో తప్పులు దొర్లాయని సవరణలకు అవకాశం ఇవ్వాలని తమకు పెద్ద సంఖ్యలో మెయిల్స్ వస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది.



బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణకు చెక్కును అందజేస్తున్న రాఘవేంద్ర ప్రసాద్ దంపతులు

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి 10 కోట్ల విరాళం

» ప్రకటించిన ఎన్‌ఆర్ఐ దంపతులు

» మొదటి విడతలో రూ.5 కోట్ల చెక్కు అందజేత

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు అమెరికాకు చెందిన డా. రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి ప్రసాద్ దంపతులు రూ.10 కోట్ల విరాళం ప్రకటించారు. ఇండో అమెరికన్ క్యాన్సర్ రిసెర్చ్ ఫౌండేషన్ ద్వారా పరిశోధనా పరికరాలను సమకూర్చుకోవాలని బసవతారకం కాన్సర్ ఆస్పత్రి రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిర్ణయించగా, అందుకు సహకరించేందుకు రాఘవేంద్ర ప్రసాద్ దంపతులు విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. మొదటి విడతలో భాగంగా బుధవారం ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో చైర్మన్ నందమూరి బాలకృష్ణకు రూ. 5 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. పేదలకు అందుబాటు ధరలలో ప్రపంచస్థాయి క్యాన్సర్ చికిత్స అందించాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్‌పై చేయబోయే పరిశోధన కోసం డాక్టర్ ప్రసాద్ దంపతులు ముందుకు రావడం అభినందనీయమని, పరిశోధనలకు వారి పేర్లను పెట్టనున్నామని చెప్పారు. డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్‌ను బోర్డు మెంబర్‌గా చేరాలని ఆహ్వానించినట్టు తెలిపారు. కళ్యాణి ప్రసాద్ క్యాన్సర్‌పై పోరాడి విజయాన్ని సాధించారని వెల్లడించారు.

వారాంతపు రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వారాంతాల్లో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి నుంచి కాకినాడ, నర్సాపూర్ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ప్రకటించింది. చర్లపల్లి నుంచి కాకినాడ, నర్సాపూర్‌కు మార్చి 7, 13, 21, 28వ తేదీల్లో.. అటునుంచి చర్లపల్లికి మార్చి 2, 9, 16, 23, 31వ తేదీల్లో ప్రత్యేక రైలు ఉంటుందని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

అంగట్లో సరుకులా బంగ్లాదేశ్ యువతులు!

» వారి ఆర్థిక అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న ముఠాలు

» పని చూపిస్తామంటూ భారత్‌కు తరలింపు

» ఆపై బలవంతంగా వ్యభిచార కూపంలోకి

» హైదరాబాద్‌లో 18 మంది నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లోని పేద ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని వారి ఆడపిల్లల జీవితాలతో కొందరు ఆడుకుంటున్నారు. బతుకు దెరువు చూపిస్తామంటూ నమ్మించి కొంత డబ్బు ముట్టజెప్పి వారి ఆడ పిల్లలను అక్రమంగా భారత్‌కు తరలిస్తున్నారు. ఆపై బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెడుతున్నారు. ఇలా నగరంలో బంగ్లాదేశ్‌కు చెందిన యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న రెండు ముఠాలను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. చాదర్‌ఘాట్, ఖైరతాబాద్ పరిధిలో మొత్తం రెండు ముఠాలకు సంబంధించి ఇద్దరు మహిళలు సహా 18 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో బంగ్లాదేశ్‌కు చెందిన ముగ్గురు బాలికలను, నలుగురు యువతులను రక్షించి ప్రభుత్వ హోమ్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు చెందిన కొందరు దళారులు బంగ్లాదేశ్ నుంచి యువతులను పని కల్పిస్తామంటూ అక్రమంగా దేశంలోకి తీసుకొస్తున్నారు. తర్వాత వారికి భారత్‌కు చెందిన కొన్ని ఐడీ ప్రూఫ్‌లు తయారు చేస్తున్నారు. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, పుణె, ఏపీలోని పలు నగరాలకు వారిని పంపి స్పా, మసాజ్ సెంటర్లు, బ్యూటీపార్లర్‌లలో పనికి పెడుతున్నారు. ఆ తర్వాత యువతులను వ్యభిచార వ్యాపారాలకు వినియోగిస్తున్నారు. కొద్దిరోజులకు ఒక నగరంలోని వారిని మరో చోటికి, అక్కడి వారిని ఇంకో చోటికి తరలిస్తూ రహస్యంగా వ్యభిచారం నిర్వహించి రూ.లక్షల్లో కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో యువతులకు లగ్జరీ జీవితాన్ని అలవాటు చేసి, ప్రతి నెలా వారికి రూ. 20 నుంచి 30 వేలు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో చాదరఘాట్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో బంగ్లాదేశ్ యువతులతో కొన్ని ముఠాలు వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ ప్రాంత పోలీసులతో కలిసి రంగంలోకి దిగి 18 మందిని అరెస్టు చేశారు.

శంభో శివ శంభో!

శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు.. భక్తులతో కిటకిట





శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయానికి పాగాలంకరణ

వేయిస్తంభాల గుడిలో దర్శనం కోసం బారులు దీరిన భక్తులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

చెంబుడు నీళ్లు కుమ్మరించినా.. చిటికెడు భస్మం చిలకరించినా.. నిర్మలత్వంతో రెండు చేతులెత్తి మొక్కినా చాలు సంతోషించి, సకలైశ్వర్యాలను ప్రసాదిస్తాడు పరమ శివుడు.. అదే విశ్వాసంతో మహా శివరాత్రిని భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకొన్నారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం శంభో హరహర మహాదేవ.. శంభో శివశంభో.. ఓం నమశ్శివాయ.. అంటూ రాష్ట్రంలోని శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణలతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుడికి వైభవంగా రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని కీసరగుట్ట క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. లక్ష మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ సుబ్రహ్మణ్యం, ఎంపీలు లక్ష్మణ్, ఈటల, పలువురు న్యాయమూర్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారికి కేంద్ర మంత్రి బండి సంజయ్ పట్టువస్త్రాలు సమర్పించారు. హనుమకొండలోని వేయిస్తంబాల రుద్రేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 3 లక్షల మంది దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని ముక్తేశ్వరాలయం, ములుగు జిల్లా రామప్ప రామలింగేశ్వర, సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున, సంగారెడ్డి జిల్లాలోని ఝరాసంగం కేతకీ సంగమేశ్వర, నల్లమలలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే, యాదాద్రిలోని రామలింగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి పర్వాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తన సతీమణి మల్లు నందినితో కలిసి తన స్వగ్రామమైన ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం శివాలయంతో పాటు మధిర, చింతకాని మండలం నేరడ, ముదిగొండ మండలం వల్లభి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయలలో మహా జాతరకు మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం శ్రీకారం చుట్టారు. అమ్మవారికి మంత్రి దామోదర పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఏపీలోని శ్రీశైలంలో బుధవారం రాత్రి భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వివాహం వైభవంగా జరిగింది.

స్నానానికి వెళ్లి ఒకరి మృతి

నిజామాబాద్ జిల్లా బర్దీపూర్‌లో వర్ధన్ (23) రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమంలో స్నానానికి వెళ్లి కాలు జారి పడి చనిపోయాడు. మంచిర్యాల మండలం కోటపల్లి మండలం పారుపెల్లి వద్ద గోదావరిలో రాజేశ్ (45), నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండలం గుండాల వద్ద కోనేరులో స్నానం చేస్తూ ఓమేష్(17) గల్లంతయ్యారు. మరోవైపు.. ఏపీలో నదుల్లో స్నానాలకు వెళ్లిన 9 మంది మృతి చెందారు.

గల్ఫ్ దేశాల్లోనూ శివోహం..

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ప్రవాసీలు బుధవారం మహా శివరాత్రిని అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకొన్నారు. దేవాలయాల్లో శివనామస్మరణలే వినిపించాయి. 125 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఒమాన్‌లోని మస్కట్‌లో గల శివ మందిర్‌లో అర్ధరాత్రి వరకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే, శతాబ్ది చరిత్ర కలిగిన బహ్రెయిన్‌లోని శ్రీ కృష్ణ మందిరంతో పాటు దుర్గ, శివ మందిరాలకు కూడా భారీగా భక్తజనం తరలి వచ్చారు. దుబాయిలోని శివ మందిరం, జబల్ అలీలోని హిందూ దేవాలయం, అబుధాబిలోని బాప్స్ హిందూ ఆలయాలకూ భక్తజనం పోటెత్తారు.



అబుధాబిలోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.